UNIVERSAL
LIBRARY
OU_204840
LIBRARY
UNIVERSAL

Osmania University

Call No. T82 8 775. Accession No. P.G.T 2226

Author [illegible]

Title [illegible]

1927

This book should be returned on or before the date last marked below.

శ్రీ

సంగీతవిష్ణులీలలు

అను

దశావతారములు

మద్దూరి శ్రీరామమూర్తిగారిచే
రచింపఁబడియె.

పబ్లిషర్:

కొండపల్లి వీరవెంకయ్య,

బుక్‌సెల్లరు, రాజమండ్రి.

రెండవకూర్పు 1000 ప్రతులు.

కాకినాడ.

కాకినాడముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1927

[స్వామ్యసంకలితము] [వెల 1—0—0

పీఠిక.

భాషాభిమానులారా!

ఈవిష్ణులీల యనుదృశ్యప్రబంధమును మరల నేను రచించుటకు నా కీమహానుభావుని లీలలయందున్న భక్తియే గాని వేఱొక్కకారణమును లేదు. భారత, భాగవత, రామాయణకథ లెంద ఱెన్నివిధములుగా నెన్నిమారులు వ్రాసినను దనివితీరదు గదా?

భక్తిపారవశ్యమున నీకథ గైకొని భాగవతములోని పద్యములే సాధ్యమైనంతవఱకు దీసికొని దొరకనిచోట్ల నాపద్యము లుంచితిని.

నాకు నాటకములు వ్రాయుట కిదియే ప్రథమప్రయత్నము. ఇందు లెక్కకు మిక్కుటంబగు స్ఖాలిత్యము లుండవచ్చును. ప్రాజ్ఞులు జూపించినచో ద్వితీయముద్రణమున సవరించుకొందును.

12-2-27,
కాకినాడ.

ఇట్లు విన్నవించు భాషాభిమాని,
మద్దూరి శ్రీరామమూర్తి.

సరా: ఈ నాటకమందలి యంకెలు అనుబంధములను సూచించుచున్నవి. అంకెలున్న స్థలములందు నాయనుబంధమును పాడవలయును.

మద్దూరి శ్రీరామమూర్తి.

ఈ నాటకమందలి పాత్రములు

మత్స్యావతారము.

సత్యవ్రతుఁడు
హయగ్రీవుఁడు
బ్రహ్మ
సరస్వతి
విష్ణువు
మత్స్యావతారవిష్ణువు

కూర్మావతారము.

ఇంద్రుఁడు
బృహస్పతి
వరుణుఁడు
కుబేరుఁడు
బ్రహ్మ
విష్ణువు
బలి
శంబరుఁడు.
కూర్మావతారవిష్ణువు
శంకరుఁడు
పార్వతి
జ్యేష్టాదేవి
జగన్మోహిని

వరహావతారము.

హిరణ్యాక్షుఁడు
నారదుఁడు
వరుణుఁడు
వరహావతారవిష్ణువు
బ్రహ్మ
ఇంద్రుఁడు.

నరసింహావతారము.

హిరణ్యకశ్యపుఁడు
లీలావతి
ప్రహ్లాదుఁడు
చండామార్కులు
కొందఱుబాలురు-పాములవాఁడు
సేవకులువత్తురు
నృసింహావతారము

వామనావతారము.

బలిచక్రవర్తి
శుక్రాచార్యులు
వామనుఁడు
రాణి
విశ్వరూపము విష్ణువు

పరశురామావతారము

కార్తవీర్యుఁడు
శూరసేనుఁడు
జమదగ్ని
పరశురాముఁడు
రేణుక

రామావతారము.

రాముఁడు
లక్ష్మణుఁడు
సీత
శూర్పణఖ
రావణుఁడు
అంగదుఁడు
విభీషణుఁడు
మండోదరి

కృష్ణావతారము.

చంపక
నీలవేణి
రాధ
యశోద
గోపాలుఁడు
బలరాముఁడు
శ్రీకృష్ణుఁడు
నలకూబరుఁడు
మణిగ్రీవుఁడు
నందాదులు
బ్రహ్మ
కాళీయుఁడు
నాగాంగనలు
అక్రూరుఁడు
కంసుఁడు

బుద్ధావతారము.

ఇంద్రుఁడు
నారదుఁడు
బ్రహ్మ
శివుఁడు
మునులు
బుద్ధుఁడు
తారకాక్షుఁడు
కమలాక్షుఁడు
విద్యున్మాలి
విష్ణువు
లక్ష్మి

శ్రీ

సంగీత విష్ణులీలలు.

మత్స్యావతారము.

ప్రథమ రంగము.

కృతమాలికానదీతీరము.

[ప్రవేశము:— సత్యవ్రతుడు.]

సత్య — (బద్ధాంజలియై)

దండకము-శ్రీమన్మహాదేవ! దేవాదిదేవా! కృపాపూర్ణభావా! భవద్దాస వర్గోపతాపంబులం బాపగా నోపుదివ్యాత్మకా! మోక్షసంధాత వైయున్న లోకేశ! లోకోద్భవా! లోకపుంజంబు గల్పింపఁ బాలింపఁ దూలింపగాఁ బెక్కురూపంబులం బొందునీపాదపంకేరుహ ధ్యానపారీణుఁనై ఘోరసంసారవారాసిలోఁ బెక్కుకష్టంబులం బొందుచున్నాడ నీదివ్యరూపంబు జూపించి గాపాడవే భక్తచింతామణీ లోకరక్షామణీ దేవదేవా నమస్తే నమస్తే నమః.

నారాయణా! ఆర్తత్రాణపరాయణా! సచ్చిదానందరూపా! సత్సంకల్పా! సంసారసాగరమధ్యంబునఁ జిక్కియల్లాడుచున్న నన్ను రక్షింపుమా! పన్నగాధీశతల్పా!

అల్లదె ప్రభాకరోదయమైనది. నాయొనర్చినతపంబు నారాయణునకర్పించి గృహోన్ముఖుఁడ నయ్యెదఁగాక.

(జలముల గ్రహింపగా మీనుపిల్ల కాన్పించును. జలములవిడచి) రమానాథచరణారవిందముల నాకెందంబున నిడుకొని విధివిధానంబున నప్పరమేశ్వరున కర్ఘ్యమొసంగ జలముల గ్రహించుచుండ నీశకులశాబకము నాయంజలిఁబడియె, నియ్యది యశుభసూచకమేమోగదా-

మీన— గీ. ఓనృపాగ్రిణి యిచ్చోట । నున్నయెడల
సమితమీనాళినను బట్టి । సంహరించు
నంచు దలపోసి శరణార్థి । నౌచునీదు
యంజలింబడితిఁ గాపాడు । మనఘచరిత.

ఓ దవిళాధీశ్వర! శరణాగతత్రాణ బిరుదాంకుఁడవని తలంచి శరణార్థినై నీయంజలింబడిన నన్ను దయావిహీనుండవై జలంబుల విడిచితివి. ఇది నీబోంట్లకు కృత్యముగాదు.

సత్య—(ఆశ్చర్యమున) ఆశ్చర్యమాశ్చర్యము! జలచరంబెక్కడ మనుజవచనంబుల బల్కుటెక్కడ! పరికింపగానియ్యదొక గొప్పచిత్రమైయుండనోపును- ఎట్లైన నీశకుల శాబకంబును గాపాడుటయే కర్తవ్యము. అయినచో నీశకులమును గాపాడుటెట్లు- (ఆలోచింపుచుండును.)

మీన—రాజన్యచూడామణీ! ఆలోచించుచుంటివేల? నన్నురక్షింపుము. వేయిపల్కులకవకాశమీయక- నామాటకెదురాడక- నన్ను రక్షింప బద్ధకంకణుఁడవుగమ్ము. మున్ముందు నాయుదంతంబునంతయు నెఱిఁగిన పిమ్మటధికతరామోదమందగలవు.

సత్య—(జలములతో మీనమును గ్రహించి) ఈ మీనుపిల్లను గొన్ని దినంబులవఱకు నాకమండలోదకమునం దుంచి కాపాడెదగాక. ఆహా! మృత్యువన్న ప్రతిజీవరాసికిని భయమేగదా! (పరికించి మీనమునుజూచి) మఱియొకవింత- వింతపై- వింత- నాయంజలిపడుటకుమున్ను కడుంగడు చిన్నదైన నీమీనమింతలోనన నే

నాదోయిలిపట్టనంతటి పెట్టమొయ్యెను- ఇంతగా వృద్ధిబొందుట కేమి హేతువో గదా! యిట్టిది- యున్నన్నడును కనివిని యెఱుగము. కానిమ్ము యీశకులశాబకమును నాకమండలమందుంచి గృహంబునకుఁ గొంపోయి యొక పెద్దపాత్రమున నుంచి కాపాడెదఁగాక (నిష్క్రమించును.)

ద్వితీయ రంగము.

సత్య —(తనలో) నదీతటంబునుండి గృహంబున కరుదెంచులోపలనె నాకమండలమంతయునాక్రమించుకొని-యందు-తనకు-స్వేచ్ఛగాఁ దిరుగుటకుఁ దగినంతస్థలము లేదని మొరపెట్టుటచే నీకూపమందుంచితిని. ఇచ్చోటనైన నామీనరాజంబున కిమ్ముగనుండెనో లేదో? (ప్రకాశముగ) ఓమీనరాజమా! సుఖముగానుంటివా! ఇచ్చట స్థలకుశలత్వము గలుగలేదుగదా?

మీనము— రాజన్య చూడామణీ!

గీ. అల్పజలమున్న యీనూతి । యందునాకు
సుఖముగూర్పంగదగినంత । చోటులేదు
ఓనృపాలక యిచ్చోట । నుండజాల
గాన గొంపొమ్ము నదికి నన్ । గరుణతోడ.

సత్య —(ఆశ్చర్యమున) పట్టుమని పదిఘడియలైనగాకుండనే యొక్క... చిన్నిశకులశాబకమింత పెద్దనూయియైనం బట్టఁజాలనంతగాఁ వృద్ధిజెందుటఁ జూడ నెదో యద్భుతంబైన మాయగానున్నది.

[తెరలో]

ఓ నృపాలచూడామణీ! ఈ మీనరాజంబును సామాన్యమట్లు దలంపకుము. కొండొక కార్యార్థమై శ్రీమహావిష్ణు వీరూపంబున

నవతరించెనని యెఱుఁగుము. నేటి దివసంబాది సప్తదివసంబులకుఁ జతురాననునకొక్కపగలు నిండును. అప్పుడు సమస్తలోకములు ప్రళయసంద్రమున మునుఁగఁగలవు. ఆప్రళయంబున భక్తాగ్రగణ్యుండవగు నిన్ను గాపాడుటకే నీకిమ్మహాత్ముఁడు దర్శనమొసంగెను. నేటి కారవదినంబున సప్తమహాఋషులతోనున్న యొక్క చిన్నినావ యీకృతమాలికాతీరంబున కరుదెంచును. నీవును నాపంపున సమస్తోషధీలతా బీజములతో నానౌక నధిష్టింపుము. ప్రళయకాలమందలి పెంజీకటివల్ల బాధలేకుండ సప్తమహాఋషుల తేజంబు నిన్ను- మీనావను గాపాడుచుండును. ప్రళయవారాసిలో నౌక మునుంగకుండునట్లీ మహామీన మద్దానిని తనకొమ్మున నిల్పియుంచును. ప్రళయపవనంబువలన బాధలేకుండనొక్క పన్నగం బద్దానిని ద్రింగి మిమ్ము రక్షింపగలదు. కాన రాబోవుసంగతుల గుర్తెఱింగి యీమీన ముపదేశించి నట్లొనర్పుము.

సత్య—ధన్యోస్మి! ధన్యోస్మి!! ఏమినాభాగ్యము. (1)

సీ. సంసారమనుమహా । సాగరంబునజిక్కి
పలుపాట్లు పడుచుండు । ప్రజలకైన
భక్తాగ్రగణ్యులఁ । బరికించిభక్తితో
నతులొనరించువై । ష్ణవులకైన
కర్మవిసర్జించి । మర్మంబుదెలసితి
మంచుఁదిరిగెడి స । న్యాసులైన
యనవరతంబు ని । న్నరయంగదలపోసి
వనములనివసించు । మునులకైన
చేతులారఁగ భక్తితోఁ । సేవసేయు
భాగ్యమలవడకుండెనా । భాగ్యమేమొ

పద్మనాభుని సేవించు । పదవిదొఱకె
ధన్యుఁడనునైతి కులమెల్ల । ధన్యమయ్యె.

ఈమీనరాజను నాకృతమాలికానదియందు విడచివచ్చెదగాక.

(నిష్క్రమించును.)

తెర పడును.

తృతీయరంగము.

[ప్రవేశము: — హయగ్రీవుఁడు.]

హయ —(తనలో) సవతితల్లిబిడ్డలమని మమ్మాసడించి స్వర్గీయసౌఖ్యములలోఁ భాగ్గానసీయక వేదబాహ్యులమని దూరముగా తరిమినైచిరి. ఆవేదములు మాకడలేవని- యావేదములను మేము జదువలేదని- జన్నములలోని హవిర్భాగములనీయక తామే యనుభవించుచుండిరి. మమ్మిట్లు మోసమొనరించి మాపట్టున నింతక్రూరులైయున్న వీరల మోసముచేతనే వంచింపవలయును. వేదముల నాల్గింటిని సంగ్రహించుకొని పారిపోయెదగాక. (నలుదెసలు కలయజూచి) ఏమిది- యింతలోననే యింతచీకటిక్రమ్ముకొనుట కేమిహేతువో గదా. అదే ఆదెసగూడ కారుచీకటిచే నావరింపబడినదే- (ముందునకుఁజూచి) అల్లదే యీ ప్రక్క నొక్కదివ్యతేజంబు మాడ్కి నెదో మెరయుచున్నది. (సమీపించి) ఎదోయనుకొంటిని. బ్రహ్మగారి దివ్యతేజము (యింకను సమీపించి) అదే భారతిగూడ యాతనిప్రక్కనే శయనించియున్నది. వీరితీరుజూడ నిద్రించుచున్నట్లున్నది. మంచిసమయమే లభించినది. ఇంక వేదములు లభించినవనుమాటయే. ఆహా! వేదములే లభించిన నాయదృష్టము గొనియాడదరమె-

సీ. కర్మరాహిత్యుని । మర్మంబుబోధించు
వేదముల్ నాచేత । వెలయునపుడు
సర్వోత్తమజ్ఞాన । సంధాయకములైన
వేదముల్ నాచేత । వెలయునపుడు
అమరులగర్వంబు । హరియింపఁజాలెడి
వేదముల్ నాచేత । వెలయునపుడు
అఖిలసౌఖ్యంబుల । కాధారభూతమౌ
వేదముల్ నాచేత । వెలయునపుడు
అమరనాయకు సిగఁబట్టి । యవనికీడ్చి
సంపదలపుట్టినిల్లనఁ । జాలునట్టి
త్రిదివసామ్రాజ్యమే లెడి । పదవిగనుట
కేమియభ్యంతరంబుండు । నింక నాకు.

(పరిక్రమించి) వేదములా చతురాస్యుని నిశ్వాసవాయువులతోడ వెలికనుదెంచుచున్నవి. వీనిని సంగ్రహించి రసాతలమునందు ప్రస్తుతము వీనినిదాచి యుంచెదను. (వేదములసంగ్రహించి కొని పారిపోవును.)

(వేదములు తెరలో) కమలసంభవా! రక్షింపు రక్షింపుము. మమ్మొ దురాత్ముఁడు గొనిపోవుచున్నాడు.

బ్రహ్మ—(మేలుకాంచి) చిరకాలంబునుండి యింతుకంతమైన విశ్రాంతిదీసికొనక పనిచేసి నేఁడించుక కనుమూసిన నన్నెవ్వరోరక్షింపురక్షింపుమని పిలుచుచున్నారు. ఎవ్వరా పిలచువారు-

వేదములు—కమలసంభవా! వేదముల నాల్గింటిని నిద్దురాత్ముఁడు దొంగిలించుకొని పోవుచున్నాడు.

బ్రహ్మ—దేవీ! లెమ్ము లెమ్ము. వేదములనెవ్వడో తస్కరించుకొని పోవుచున్నాడు. లెమ్ము. (వాణిని లేపును.)

సర—నాథా! ఏమది. ఒక్కసురాత్ముఁడు వేదములఁ గొంచుబోయెనా! ముల్లోకంబులు ప్రళయసముద్రమున మునింగియుండ నీగ్రవ్యాదు డెట్లుజీవించి యిచ్చోటికరుదెంచియుండెను- తమదివ్యదృష్టినిజూడుడు. వాఁడెవ్వఁడో మున్ముందుగఁ దెలసికొనుఁడు.

బ్రహ్మ—(దివ్యదృష్టి నభినయించి) దేవీ! సోమకాసురుండను రక్కసాధముడీ యకృత్య మొనరించెను. మనము నిద్రింపకయమున్ను బ్రహ్మలోకము ప్రవేశించుటఁజేసి వాఁడు ప్రళయంబున నశింపక మనము నిద్రించుచుండఁ దరిలభించినదని వేదముల సంగ్రహించినాఁడు.

సర—నాథా! యిప్పుడు కర్తవ్యమేమి?

బ్రహ్మ—కర్తవ్యమునకేమున్నది- లోకరక్షకుండైన యాదినారాయణునిఁ బ్రార్థింపవలయును.

ఉ. వేదపురాణపూరుష వి । వేక మొకింతయు లేక యెవ్వఁడో
నా దరిజేరి వేదముల । నాల్గిటిఁగైకొని పారిపోయె; నా
వేదచయంబు దొంగిలిన । వీరునిబట్టి వధించిమాదు మ
ర్యాదనునిల్పుమయ్య యిగ । మంబులబ్రోవఁగదయ్య మాధవా!

(తెరలో) కమలాసనా! చింతింపకుము. ముందిట్లురాఁగలదని భావించియే ప్రళయసముద్రంబున మత్స్యంబనైయుంటిని. సముద్రతీరంబునకురమ్ము. ఆ చ్చోట వేదముల నీకొసంగెదను.

బ్రహ్మ—మహాప్రసాదము. దేవీ! రమ్ము. దేవదేవుఁడుపదేశించినట్లు చేయుటయే కర్తవ్యముగదా?

సర—చిత్తము. (నిష్క్రమింతురు.)

(తెరపడును.)

తురీయరంగము.

[ప్రవేశము:—హాయగ్రీవుఁడు.

హాయ—ఇప్పటికిఁగదా! నాకోర్కె నీడేర్చుకొంటిని. కష్టించి ప్రయత్నించినచో కార్యసాఫల్యము గాకుండునా! కార్యసాఫల్యము మనము చేయు ప్రయత్నమును బట్టియేగదా యుండును. ఇంక నీవేదముల సాంగముగా జదివిచూచెదగాక. (అనివిప్పుచుండ)

వేదములు —నారాయణా! ఈముక్కిడిరాక్షసాధముని నుక్కడగించి మమ్ముఁగాపాడి లోకములఁబ్రోవుము.

హాయ —దానవారియగు నా నారాయణునిఁగూర్చి యీవేదములు మొఱలిడుచున్నవి. ఇంచుక విప్పినంతనే యల్లరిచేయుచున్నవి గాన వీనినోళ్లను కట్టివేయించి రసాతలమునకుం గొనిపోయెదను. (అనిమరల గట్టఁగట్టును)

(తననీడఁజూచి భ్రమసి) అయ్యో! యికేమున్నది. మాపాలిటి కాలుఁడనఁదగునా విష్ణువే నాకడనుండి యీనిగమంబుల బలిమినైనఁ గైకొనఁగోరిగాబోలును వచ్చినాడు. నామేనప్రాణము లుండఁగా నీవేదముల నీతనికర్పింతునా! కలలోనివార్త. వానికంట్లలో నెట్లో దుమ్ముఁగొట్టి పారిపోయెదగాక. (పరుగిడును.)

[పునఃప్రవేశము:—హాయగ్రీవుఁడు.]

హాయ—(నలువంకలజూచి) అయ్యయో యూరకభ్రమజెందితిని. ఎవ్వడును గానరాడు.

(తెరలో) పాపీ యింకెందుబోయెదవురా!

వేదసంరక్షణార్థమా విష్ణుండు పట్టువీడక వచ్చుచుండెను గావలయును గాని వాయువేగమనోవేగంబుల బరువిడఁగల నన్నుఁగలసికొనఁగలఁడా కల్ల కల్ల! అయినను- రాబోవు నాపదఁదప్పించుకొనుట

కిప్పటినుండియే యత్నముసేయవలయును గాన యిక్కడనుండియే-నాకాళ్ళకు బుద్ధిసెప్పి పరుగులిడెదగాక. (నిష్క్ర-)

[ప్రవేశము:—నారాయణుఁడు.]

నారా—ఓరీ! రాక్షసకులార్ణవబడబానలా! నిలునిలు. ఇంకెందు పోఁగలవు రాదుర్మతీ! వాణీమనోహరుండు నిద్రనుండు తరి వేదముల సంగ్రహించి పారిపోవుచుంటివా? నిలునిలు!! నిగమంబుల తస్కరించిన నిన్ను మున్నుంగాఁ జక్కాడి ముందు లోకులెవ్వరు-నిట్లు మతిమాలి వర్తింపకుండునట్లొనర్చెదను. (యించుకదూరమేగును.)

(తెరలో)

వేదము—నారాయణా! నారాయణా! మమ్ముగాపాడవా! భక్తలోకమందారా! రక్షింపుము. రక్షింపుము.

నారా—(వెనుకకుదిరిగి) అల్లదే! ఆడబోయిన తీర్థమెదురైనట్లు లా దురాత్ముఁ డీవంకకే వచ్చుచున్నాఁడు. రానిమ్ము. (వెనుకకొదిగి యుండును.)

[ప్రవేశము:—హయగ్రీవుఁడు.]

హయ—అబ్బా! యెంతప్రయాసపడవలసివచ్చినది. మిట్టుపల్లంబులనక-తాలురప్పలనక-ముండుగిండ్లనక- యేకబిగిని పెక్కునక్కజిక్కులం బరువిడి యాతనికంట దుమ్ముగొట్టి యిట్లురుదెంచితిని. మాటిమాటికి వేదములా నారాయణుని బ్రార్థించుటచే నాతఁడెప్పుడువచ్చునో-యని భీతిజనించుచున్నది. ఆ-భీతియేమి! ఎవ్వడడ్డంబువచ్చినను వాని జక్కాడి పిమ్మట నేరసాతలమున కేగెదగాక.

కాని యీనారాయణుని చర్యలలోఁ గొన్నినాకుఁ గిట్టవు. సోదరులమే-యిర్వురతల్లులుటలయందొక్క జనకునకు జన్మించినవారమే-

యట్టిమాలో భేదంబుల గల్పించి- మాసోదరుల కలహములందుఁ జొచ్చి యొకరుని రక్షించి రెండవవానిఁ జక్కాడును.

గీ. అన్నదమ్ముల కలహము । లందుఁజొచ్చి
కాకులను జంపి గ్రద్దల । సాఁకునటుల
యుక్కరుని జంపి రాజ్యమిం । కొకరి కిచ్చి
సాఁకుచుండుట యాతని । సహజగుణము.

ఇట్టికార్యములలో నిష్కారణముగాఁ బ్రవేశము గల్గించుకొనియేవో లేనిపోనినేరములు మాపై నారోపించి దూరుచుండును. (ముందునకు జూచి తనలో) అయ్యో యెవ్వని బాఁటిపడకుండఁ బారిపోవఁజూచితినో యాతని కట్టెదుటికే వచ్చితినే? యింకేమిదారి? భీతిమై పులిగుహం బ్రవేశించు ఛాగశాబకమునైతినే. యాతనితోఁ బోరాడుట దప్పదని తోచుచున్నది.

విష్ణు— వేదాపహారీ! హయగ్రీవా! నా బాఁటి పడకుండ నీవెందేగఁ గలవు-నా సహజగుణ మెఱిఁగియు నిట్టి యకార్యమున కేల మూఢుఁడవై సిద్ధపడితివి.

హయ— ఏలనా! యిప్పుడు నీకు పరాజయము జేకూర్చుటకే. తెలసినదా! వేదాపహారీ! యంటివయ్యది తప్పు- బ్రహ్మసృష్టిలోనివారమైన మేముఁగూడ వేదములఁ జదివి వానివలన నుపయోగము బడయవచ్చును గాన నేనా వేదంబుల గైకొంటిని యిందాక్షేపణ మేమున్నది. ఈవేదముల జదువని వారమగుటచేతనే గదా యజ్ఞములలోని హవిర్భాగములు మాకీయక దేవతలే యనుభవించుచుండిరి.

నా—ఓరీ! దురాత్మా! వేదబాహ్యులగుటకు మీప్రవర్తనమే కారణము. జన్నములలోని హవిర్భాగములఁ గొనుటకు మీరెందుల కనర్హులైతిరో యెఱిఁగింతు నాలింపుము.

సీ. జపతపోహోమాది । సత్కర్మలనువీడి
యీరీతి మీరు వ । ర్తించుకతన
కారుణ్యమొక్కింత । గలనైనదలఁపక
హింసచేయఁగ నడు । గిడుటకతన
సత్యమే మరచి య । సత్యమే మనకెందు
బూర్ణలాభంబని । మురియుకతన
పరలోక మనుమాట । భావింపఁబోవక
యిహలోక సుఖము కాం । క్షించుకతన
చేయరానట్టి పాపముల్ । చేయుకతన
నడువగా రానిపథముల । నడచుకతన
కర్మభూమియిష్టమైన యా । గములలోని
హవ్యములు గొనమీర । నర్హులైరి.

దురాత్మా నీసందియము తీరినదా! యింకనిన్ను జక్కాడిలోకంబులకు నీతిసెప్పెదగాక.

హయ — ఓరీ! యెంతపెద్దయుపన్యాస మొనరించితివి. చాలుచాలునిక నూరకొనుము. రమ్మి! నిన్నుజక్కాడినపిమ్మట నేవేదముల రసాతలమునకు గొంపోయెదగాక. (యుద్ధముచేయుదురు.)

హయ — (తనలో) అబ్బా యీతనితో బోరొనరించుట కఠినంగడు గష్టముగా దోచుచున్నది. ఈవేదములీతని పాలబడకుండ జేయవలసియున్నదికదా.

(మరల యుద్ధముచేయుచు పరుగిడును.)

విష్ణు — ఓరి! దురాత్మా! సముద్రము జొచ్చిననిన్ను వెంటాడలేనని యే దలంచితివా! సర్వవ్యాపకుండనైన నా బారిపడకుండ నీవెందే గగలవు. పొమ్ము. జలధిలోన నేమరణింపుము. (నిష్క్రమింతురు)

తెరయెత్తగా

మత్స్యావతారవిష్ణువు.

ప్రవేశము:—సత్యవ్రతుఁడు-బ్రహ్మాదులు.

సత్య—పన్నగాధీశతల్పా! సత్సంకల్పా! భవద్దివ్యసందర్శనంబున కడుం గడు గృతార్థుడనైతిని. సర్వకాలసర్వావస్థల తమ్మెడబాయకుండు నట్లనుగ్రహింపుడు. నాపరిణామశతంబును గొనుఁడు.

మత్స్యావ—కమలాసనా! ఈవేదచతుష్టయముంగొని లోకంబుల యథాప్రకారము సృష్టింపుము. సత్యవ్రతా! నీభక్తికే నెంతయు సంతసించితిని, నాసాయుజ్య మొసంగితిని, రమ్ము.

అందఱు—మహద్భాగ్యము.

తెరవాలును.

శ్రీ

సంగీత విష్ణులీలలు

కూర్మావతారము.

[ప్రవేశము:—ఇంద్రుఁడు, బృహస్పతి, వరుణుఁడు మున్నగువారు]

ఇంద్రుఁడు—గురూత్తమా! క్రూరరాక్షసుల దారుణబాధల కోర్చి యిట్లెంతకాలమని మరియుండఁగలము. దీనికిఁదగిన ప్రతీకారమేమియును లేదా ?

బృహ—శచీంద్రా! నాఁడా దూర్వాసుఁడొసంగిన శాపవశంబున లోకంబులు ధనహీనంబులయ్యె! యయ్యది కారణంబుగ భూలోకంబున యజ్ఞయాగాదికర్మ లడుగంటెను. ఎక్కడనైనజన్నము జరుగుచుండెనని తెలియవచ్చినంతనే ముష్కరులగు రాక్షసాధములు వానికి విఘ్నమాపాదించి మన కుపవాసంబులఁ గల్పించుచున్నారు.

వరు—ఇట్టి దుష్కార్యము లొనరింప సాహసించిన యాదురాత్ములు దిక్పాలురఁ గూడ నిర్జింపఁదలంతురేమో యను సందియ ముదయించుచున్నది.

ఇంద్ర—అయ్యదియే నాభయకారణము. ఎప్పుడెవ్వఁడు దండెత్తివచ్చునో యని తత్తరిల్లుచునే యుంటిని. ఛీఛీ! యింద్రత్వమువలన నాకిసుమంతయైన సుఖములేదు. దినదినగండము నూరేండ్లాయువని నట్లున్నది నాబ్రతుకు. ఇప్పటికీకష్టములు దీరెగదా

యని సంతసించుచుండ మరల నెవ్వఁడో యొక్కరుఁడిరా
క్షసాధముఁడు-పరమేష్ఠిచేతనో వరంబులబడసి-యీస్వర్గము
పై దండెత్తును—గురువరా! యీదుల కేమైన సాధనమున్న
చో దెల్పుము.

బృహ—లోకములన్నియు నిట్లు సంక్షోభమొందుచుండ నాకమలా
సనాదులు జూచి యూరకుందురా! వారలుగూడ దగిన ప్రతీ
కార మొనర్పవలయుననియే చూచుచుందురు.

ఇంద్రు—పరమేష్ఠియొద్ద కెవ్వనినైన బంపినచో—

బృహ—నేనీవఱ కీవిషయమునుగూర్చి నాలోచించి చతురాననుని
దోడ్కొనిరమ్మని చిత్రరథుని బంపియుంటిని.

[ప్రవేశము:—కుబేరుఁడు]

కుబే—శచీంద్రా! దానవులెల్లరును బలీంద్రుని దమయధిపతిగా నెన్ను
దిగ్విజయార్థము నాకలోకమున కరుదెంచుచుండెనని నారదు
లచే నిప్పుడె వింటిని.

ఇంద్రు—మిత్రమా! ఆయాసనమలంకరింపుము! గురువరేణ్యా! మన
మనుకొనినట్లుగా దానవులు స్వర్గమును జయించుట కరుదెం
చుచుండిరి. ఇప్పట్టున మనమాచరింపవలసిన దెద్దియో గోచ
రించుటలేదు.

[ప్రవేశము: బ్రహ్మ]

ఇంద్రు—(సింహాసనమిడి) వాణీమనోహరా! మంచిసమయమునకే
యరుదెంచిరి. దానవుల బోకార్చి లోకంబులఁ గాపాడుటకు
సుకరంబైన మార్గమొక్కటుపదేశింపుము

బ్రహ్మ—దేవాదిదేవుండగు నారాయణుఁడే యందులకుఁ దగినప్రతీ
కార మారయవలయును.

వరుణు—వికుంఠమున కేగినచో గొంతలాభకారిగా నుండునేమో.

బ్రహ్మ—వలదు. వలదు.

గీ. ఆదిదేవుని సన్నిధి । కరిగినంత
దనుజుఁ డెవఁడేని సేనతోఁ । దరలివచ్చి
యమరపురిపైనవిడిసి ప । రాక్రమించి
నపుడు వారలగెలువఁగా । నగునెమనకు.

బృహ—అయ్యదిగూడ నాలోచింపవలసిన విషయమే ! నేడో రేపో
దనుజులీ నాకమును సమీపింపగలరని తోఁచుచున్నది.

బ్రహ్మ—శచీంద్రా! సర్వవ్యాపకుండగు యానారాయణు నిచ్చోట
నుండియే ప్రార్థింతము.

ఇంద్రు—చిత్తము. (ప్రార్థింతురు) (21)

ఇంద్రుఁడు—

ఉ. ఓకమలాక్ష యోవరద । యోదనుజాంతక! కూర్మ రాక్షసా
నీకము దేవతానగరు । నేడెగ్రహింపఁగ వచ్చుచుండె; మే
మేకరణిన్ జన దగునో । యెట్లుజయంబును గాంచువారమో
నాకముగాచు ప్రోట్టలో జ । నార్దన మా కెఱుఁగంగ జేయవే.

వరు—గీ. నాటి దూర్వాసుశాపమీ । నాడుమమ్ము
పట్టి పల్లార్చుచుండెనో । పరమపురుష
భవ్య భవదీయ దివ్య కృ । పారసంబు
కొంతమాపైన బరపి చే । కొనుముదేవ!

[ప్రవేశము:—విష్ణువు]

వి—చతురాననా! దిక్పాలురారా!

గీ. కాలవశమున కోర్చి ది । క్పాలులార
యుబ్బి చెలరేగి దిరుగాడు । చున్నదనుజ

సంతతుల బలమునుగూల్చు । నంతవఱకు
వారితో మైత్రిచేయగా । వలయునిపుడు.

శచీంద్రా !

చ. పటుతర బాహువిక్రమము । పారముగాఁగలదానవేశ్వరుల్
కుటిలతనంబు చూప ది । గుల్ వడనేలసహింపుమయ్యా నీ
యటమటతెల్లదీరునఱ । కాదనుజానఁగూడి మీరు దు
ర్ఘటమని యెంచబోనక ద । గన్మథియింపుడు పాలసంద్రమున్.

దనుజాధములతోఁగూడి నానానేక యోషధీలతల సంపాదించి పాల సముద్రమునవైచి మంధరక ధరంబును కవ్వముగజేసి వాసుకి యనుమహానాగును త్రిరాడుచేసి మధించిన జరామరణముల జయించు యమృత మందుద్భవింపగలదు. ఆయమృతపానమున మీరు బలసంపన్నులై దనుజాధముల నిర్జింపగలరు- కార్యసాధనకడంగుడు. (అంతర్ధానమగును.)

బ్రహ్మ--నారాయణదేవుఁ డుపదేశించి నట్లొనరించుడు- శచీంద్రా! నేనింక సత్యలోకమునకేగెదను. (నిష్క్రమించును.)

ఇంద్రు—గురువరా ! పెక్కు కష్టంబుల కోర్చి యమృతమును సంపాదించినను యాముష్కిక్కీడిరక్కసులు మనకడనుండి యయ్యమృతమును బలిమినిఁ గైకొనిన మన మొనర్పఁగలదేమున్నది.

బృ - ఇందుల కాలోచింపవలసినపని లేదు. శ్రీహరి యెట్టులో మనకమృతమునొసంగి రాక్షసులకు సున్నజుట్టును. సందేహింపకుము.

(తెరలో కిలకిలము.)

ఇంద్రు—(ఆలించి) ఆకలకలధ్వనులేల యుప్పతిల్లియుండును.

కుబే—రాక్షసాగమనము సూచించు మనవారి కేకలైయుండనోపు.

[తెరలో] త్రిభువనసామ్రాజ్యలక్ష్మీ దురంధరుండనను గర్వముపెంపున కన్ను మిన్నుగానని యింశచీంద్రుడెడీ!

ఇంద్రు—గురువరా! కర్తవ్యము కర్తవ్యము.

బృహ—కర్తవ్యమున కేమున్నది. కయ్యముమాని వారలతో నెయ్యంబుననుండుమనిగదా నారాయణదేవుఁ డుపదేశించెను. అట్లొనర్పుటయే ముఖ్యకర్తవ్యము- కాన నీవు ప్రస్తుతము వైరము నుమరచి- యాబలీంద్రున కెదురేగి దోడ్కొనివచ్చి పీఠమిడి యాదరింపుము.

(ఇంద్రుఁడు నిష్క్రమించి బలిశంబరులతో ప్రవేశించును.)

ఇంద్రు—సోదరా! దానవసార్వభౌమా! ఆయాసనమలంకరించి నన్ను కృతార్థుజేయుఁడు.

బలి—ఇంద్రా! యీసక్కనివినయము లెక్కడనేర్చుకొంటివి. ఇట్లు నటించుమని నీ కెవ్వరుబోధించిరి.

శంబరు—సార్వభౌమా! అందినజుట్టును నందకున్న గాళ్ళనుబట్టుకొను స్వభావముగల యీదేవతులు జిత్తులమారులు. అట్టివీరికి నికడ నీవిద్య నేర్చుకొనక్కరలేదు.

బలి—ఇంద్రా! యీనక్కవినయముల పోవిడచి ప్రస్తుతాంశమును వినుము. స్వర్గీయసౌఖ్యముల చాలకాల మనుభవించితివి ఇంకనించుకంత విశ్రాంతిదీసికొనుము. నీయనుంగు తమ్ములమైన మాపై నీస్వర్గరాజ్య రమామణిని విడచి యెచ్చోటికైన బొమ్ము. అట్లొనర్పకున్న నిను రణరంగంబునజక్కాడి విజయలక్ష్మితో నీ స్వర్గరాజ్యలక్ష్మినిఁగూడఁ జేకొందును.

ఇంద్రు—సోదరా! సకలకష్టంబుల కాకరంబైన యీస్వర్గరాజ్యము విడవవలయుననియే దలంచుచున్నాను గాని,

బలి—హాంసపాదు లనవసరంబు- నీకానీల-విడచి- నీచేజేతల నాకుఁ బట్టాభిషేకమొనరించి తక్షణమే వెడలిపొమ్ము.

వరు—అగ్రసోదరతుల్యుండవగు నీకీతండా పట్టాభిషేక మొనరించుట లోకులువిన్న నవ్వరా!

శంబ—శచీంద్రా! బలీంద్రుడీ స్వర్గమేలుటకు సమ్మతింతువా!

బృహ—బలీంద్రా! శంబరా!! నావాక్యములాలింపుడు. పలుకష్టంబులతో గూడిన యీరాజ్యభారమును తమభుజములపై బడవేయనేలయని సందేహించుచున్నాడు. ఈతడెప్పుడును దేవదానవుల క్షేమమును కాంక్షింపుచుండును కాని

శంబ—కాని యనుచుంటివేమి

బృహ—ఇంతవఱకయ్యది నెరవేరలేదు.

శంబ—ఇంతటినుండి కలుగును. రాజ్యమును మాకువదలినచో స్నేహభావముతోడనే యుండవచ్చును.

ఇంద్ర—అయ్యది సరికాదు. దేవదానవులని భేదములేకుండునట్లును మనకెల్లరకును జరామరణరాహిత్యముఁ చేకూర్చు దివ్యామృతమును సంపాదించుమార్గ మొక్కటిగలదు.

బలి—(తనలో) ఆదివ్యామృతమునుగూడ సంపాదింపవలసినదే- (ప్రకాశముగ) పురందరా ఆమార్గ మనుసరించుటకు దానవులందఱును సిద్ధముగానుండిరి. గాని యాయమృతమును సంపాదించుటెట్లు?

బృహ—ఇప్పటికే కాలమతిక్రమించినది! భోజనాదిక్రియల నిర్వర్తించికొనినపిదప నెల్లసంగతుల ముచ్చటించుకొనవచ్చును రండు

(నిష్క్రమింతురు.) (తెరవ్రాలును.)

క్షీరసాగరతీరము.

కూర్మావతారము. ద్వితీయరంగము.

[ప్రవేశము:—ఇంద్రాదులొకవంకను, బలిశంబరాదులొకవంకను.]

బలి—పురందరా! కార్యము విఘ్నమైనది. మాపడినశ్రమవ్యర్థమైనది.

బూడిదనుబోసిన పన్నీరయినది. యింకేమున్నది. తుచ్ఛులగు దేవతల మాటలునమ్మి మోసపోయితిమి!

శంబరు — ఇంద్రా! ఇందులకేమేని ప్రతీకారమున్నదా! లేక నోరు మూసికొని యూరకేగుటయా

ఇంద్రు— దానవసార్వభౌమా! తొత్తరబాటుజెంది యూరక మమ్ముల నిందింపకుము. మనకిట్టిసూర్గ ముపదేశించిన యా యిందిరా రమణుని ప్రార్థించిన ప్రసన్నుఁడై యేదేని కార్యసాధనోపాయ మెఱింగించితీరును.

బలి— అట్లనే కానిండు.

(అందఱు ప్రార్థింతురు. 3)

బలి—

శా. ఓరాజీవదళాక్ష మంధరము పా । థోరాసిలో మున్గెనీ
కారుణ్యాం బిసుమంతజూపి; యెటులో । కార్యంబు సాధింపగా
మారాముఁల్ వడుచున్న మమ్ముగుణధా ' మాబ్రోవగా నేడు నీ
వే రాకున్నను దిక్కు- మాకెవరు లో । కేశా కృపంజూడుమీ!

[ప్రవేశము:—విష్ణువు]

విష్ణు— దేవేంద్రాదులారా! దానవేశ్వరులారా! వెరువకుఁడు. వెరువకుఁడు. కూర్మావతారమెత్తి యీమంధరమును పైకిదేల్చెదను. పట్టుదలవీడక కార్యసాధనకైఁ గడంగుఁడు. (నిష్క్రి(

బ్రహ్మ— మహానుభావా! ఆదినారాయణా! మున్ను సోమకాసుర సంహారసమయమున మత్స్యావతారరూపమును జూపి మమ్మా నందింపజేసినట్లు కూర్మావతారరూపసందర్శన మొసంగి మమ్ముల చరితార్థులఁజేయవే.

(ధ్వనితో తెరలేచును)

(కూర్మావతారస్వరూపము.)

బ్రహ్మ—ధన్యోస్మి ! ధన్యోస్మి !! (అందఱునమస్కరింతురు.)

(కూర్మావతార మంతర్ధానమగును.)

బలి—(నిర్ఘాంతపడి చూచుచు) శచీంద్రా! మంధరము సముద్రము నుండి లేచినది. మరల తరుచుట కారంభింతమా!

ఇంద్రు—అట్లనే యొనర్తము.

(సముద్రమునుమధింప హాలహాలము పుట్టును.)

బలి—ఇంద్రా! యిదేమి? పెనుమంటలతో లోకమును భస్మీపటల మొనర్చుచున్నది.

(తెరలో) దేవదానవులారా! వెరువకుఁడు. ఆయుద్భవించినది హాలాహాలము. అద్దానిని శాంతింపఁజేయుమని వెంటనే యీశ్వరునిఁ బ్రార్థించుఁడు లేకున్నచో హాలాహాలము వలన లోకములన్నియుఁ గాలి భస్మీపటలములు గాఁగలవు.

బలి – ఇంద్రా! కర్తవ్యము వింటివా. అట్లొనర్తమా!

బ్రహ్మ—శంకరా! భక్తవశంకరా! హాలహాలము వలన లోకములు భస్మీపటములగుచున్నవి కాపాడుమా!

ఇంద్రు—పరమేశ్వరా!

కం. నీకంటె నొండెఱుంగము
నీకంటెం బరులుగాన। నేరరుజగముల్
నీకంటె నొడయఁడెవ్వఁడు
లోకంబుల కెల్ల నిఖిల। లోకస్తుత్యా!

మత్తకోకిల. బాహుశక్తిసురాసురుల్ సని। పాలవెల్లి మధింప హా
లాహాలంబు జనించె నేరిక। లంఘ్యమె భువనంబు గో
లాహాలంబుగఁ జేసి చిచ్చును। లాగముంగొని ప్రాణిసం
దోహముఁ బ్రదికింపవే దయ। దొంగలింపగనీశ్వరా.

బలి—చిరశుభాకారా! పార్వతీచిత్తచోరా! నీవుగాకున్న మాకింక దిక్కెవ్వరు.

[ప్రవేశము:—పార్వతీపరమేశ్వరులు.]

శంక—దేవదానవులారా! భయమొందకుడు. ఈ హాలాహలమును భక్షించి మీయాపదనెల్ల క్షణములోఁ దీర్చెదను (పార్వతి వైపునకుఁ దిరిగి)

క. శిక్షింతు హాలహాలమును
భక్షింతును మధురసూక్ష్మ ఫలరసముకియ్యఁ
రక్షింతు ప్రాణికోట్లను
వీక్షింపుము నీవు నేను వికచాబ్జముఖీ!

(హాలాహలమును బక్షించి) సురాసురులారా! మీకోరినట్లే హాలాహలముమ్రింగితి నింకసుఖకాంక్షకై పట్టుదలతోయత్నింపుము.

[ప్రవేశము:—జ్యేష్టాదేవి.]

జ్యేష్టా—క్షీరసాగరునిలో గర్భముం దుద్భవించిన నేను నివసింపదగిన తావులును నాచేయుకృత్యములను నెఱుంగజేయరే!

బ్రహ్మ—(తనలో) ఏమీ వికృతాకారము (ప్రకాశముగ) ఓముద్దుగుమ్మా! దబ్బరలాడుచు దత్తంబైన ధనంబు లపహరించి మధుపానాశక్తులై యుండువాండ్రును మధుసేవాపరాయణులై జూదదేవి నాశ్రయించి యొడలెఱుఁగక యిల్లువాకిళ్ళ నమ్మువాండ్రును చరణంబులైన గడుగక జపతపోహోమాదికార్యంబుల నిర్వర్తించు డాంబికులును- సంజకెంజాయలందు నిద్రిసలువాండ్రును- అరిషడ్వర్గపీడితులై- కులాచారధర్మములమరచి వర్తించువాండ్రును- దురాచారసంపర్కులైనవాండ్రును నీకు నమ్మినబంట్లుగా నుందురు. ప్రొద్దెక్కి మేల్కాంచు ముద్దరాండ్రను- విభులతో జగడించువాండ్రను- దురాచార

సొంపున్కైన జవరాండ్రును- పతిభక్తి వంచించి చెడి జారిణు
లై మత్తిల్లి దిరుగు తలిరుబోండ్లును- కారణం బిసుమంతయు
లేకయిరుగిండ్లకుఁ బొరుగిండ్లకుఁ బోవువాండ్రును- భర్త
భుజింపకమున్న భుజించు గయ్యాళ్రాండ్రును- పిలిచికయ్యములా
డు వాండ్రును ప్రియులనగచాట్లబెట్టెడి దుర్మార్గురాండ్రును-
నీకు నమ్మిన చెలికత్తెలైయుందురు. హరివాసరత్రియంబు లాచ
రింపనియిండ్లను- కలహంబులే యెల్లప్పుడును గలుగు నిండ్లను
కలిమెంతలెక్కినపిమ్మట కసవ్రలూడ్చెడి యిండ్లును దేవపూజ
లులేని యిండ్లును- యజ్ఞయాగ- అధ్యయనములులేని యిండ్లును
నీకు నందనోద్యానతుల్యములు- వత్సా! కలిపూరుషా నీవీ
మెను సహధర్మచారిణిగాగొని సుఖంబుండుము.

కలి—మహాప్రసాదము. (కలి జెష్టాదేవి నిష్క్రమింతురు.)

(సముద్రమును మధించుచుండగా నుచ్చైశ్రవము- ఐరావతము- పాంచజన్యము- కల్పవృక్షము- అప్సరసలు- లక్ష్మిసుధాకరుఁడు- క్రమక్రమముగా నుద్భవింతురు.)

బలి—ఈ వస్తుచయ మేమిసేయుదము. ఈ లక్ష్మిసుధాకరుల నేమి చేయుదము.

బ్రహ్మ—బలీంద్రా! ఇందొక్కరహస్యమున్న దాలింపుము. మన కొఱకై కూర్మావతార మెత్తిన యా శ్రీహరి కీలక్ష్మిదేవిని యొసంగవలయునుగదా! హాలాహలపాన మొనరించిన యా మహేశ్వరున కీసుధాకరు నొసంగుదము. ఈ సుధాకరుం డాతని జటాజూటమున నిలచి తన శీతకిరణంబులచే హాలాహలము వల్ల హానిరాకుండ గాపాడుచుండును. ఇంతియెగాక మన కీమార్గ ముపదేశించినందుల కాహరి కీపాంచజన్య మొసంగిన

చో యుక్తముగా నుండును. మిగిలిన వస్తువుల స్వర్గమందుం చుదము.

బలి—స్వర్గమందేల మా భూలోకమునకు గొంపోయెదము.

ఇంద్రు—సోదరా! మరల మా నీ యని యారంభించితివా! మన మందఱ మొక్కటిగాఁ గోరికదా యీ యత్నము.

బలి— పురందరా! మఱచితిని. అట్లనే యొనరింపవచ్చును.

[మథించుచుండగా అమృతముతో ధన్వంతరి ప్రవేశించును.]

బ్రహ్మ - ఇంద్రా! ఆ యమృతమును గొనుము.

బలి—నేనుగూడ గైకొనుట కర్హుండనే.

బ్రహ్మ—నీ యనుజుండవ నీ కేటి కీశ్రిమ.

ఇంద్రుడు—(అమృతమును గొనును).

బలి—(అమృతకలశమును రెండవవైపునుండి పట్టుకొని) నీ వొక్కడ వే పట్టుకొన్న యెడల జారి ప్రమాదవశత క్రిందబడునేమో!

బ్రహ్మ— ఆ సముప్రదేశమున మన మీయమృతమును భాగించుకొని యనుభవింతము రండు. (తనలో) నా ప్రయత్నము కొనసాగు నట్లు లేదు. అయినను బ్రయత్నించెదను. (నిష్క్రమింతురు.)

తృతీయరంగము.

[ఇంద్రాద్దు లొకవంకను దానవు లొకవంకను ప్రవేశింతురు]

ఇంద్రు—బలిసార్వభౌమా! ఆ యమృతకలశ మిటు దెమ్ము. సమముగా భాగించెదను.

బలి— ఆమాత్రముకార్యము నే నొనర్పగలను. ఇంతియెగాక నీనుడివి నట్లు నేను నీ కగ్రసోదరుఁడ నగుటచే భాగముల నేన చేయ వలయును.

వరు—సోదరా ! దానవసార్వభౌమా ! యిప్పట్టున

శంబ—వరుణా ! యూరకొనుము.

గీ. యజ్ఞముల హవిర్భాగము । లందునపుడు
సోమరసపాన మొనరించి । సోలునపుడు
అనుజులముగాక నేడు కా।ర్యాంతరమున
సోదరులమటంచు బల్కగాc । జోద్యమయ్యె.

ఇంద్రు—అక్కటా ! (తనలో) విధినతిక్రమింప విధికైనను దరమగు నా ! పడరాని యిడుమలబడి- బహుప్రయాసతో సంపాదించిన యీ యమృతమును- యీనగాచి నక్కలపాలు జేసినట్లు- యీ రక్కసిమూండకొడుకుల పాలొనర్చితిని దేవాదిదేవా !

గీ. ఎన్నగారాని కష్టంబు । లెన్నియేసి
పొంది సాధించి యమృతము । పాలసుదిండ్ల
పాలొనర్చితి నిప్పుడో । పరమపురుష
నీవె కాపాడవలె మమ్ము । నీరజాక్ష.

నారాయణా ! ఆర్తత్రాణపరాయణా! నీవే మా కిప్పట్టున శరణ్యము.
(ధ్యానించుచుండును.) (అనుబంధము 4)

[ప్రవేశము:—జగన్మోహిని.]

(నృత్యము జేయుచు జగన్మోహిని రాక్షసులపై నభినయముపట్టుచునొకనికి దెలియకుండ నొకనికిసైగచేయుచుండును.)

బలి—(తనలో) యెవ్వ రీసుకుమారగాత్రి! హాయ్-హాయ్-ఏమి-యీ లతాంగిసోయగము. నాహృదయమును యొక్క యలనిమిషంబులో దొంగిలించినది.. బాపురే- ఏమీ యభినయచాతుర్యము- ధన్యోస్మి! ధన్యోస్మి!! యీసుగుణమంజరి తన కెంజిగురాకు చేతులతో నన్నాలింగనము నకు గలుగ రమ్మను

చున్నది. నాజన్మమింక సార్థకమైనది- యీయమృతపానము నకు దో డీమెయధరసుధామృతపానము గూడ లభింపనున్నది. ఈలాతన్వి లభించినచో నాకింక నీయమృతముతో బనిలేదు. (5)

శంబ — (తనలో) వహ్వారే! ఎంతలో నాహృదయము దొంగిలించిన ది. నాహృదయమునందలి ప్రేమ ధనమంతయు గొల్లలాడి న న్నపరిమితానందము నందజేయుచున్నది. ఇప్పు డేమిసేయవ లయునో గోచరింపకున్నది.

ఉ. ఉల్లము తల్లడిల్లగ స।ముజ్వలకాంతి సమూహవాహినుల్
వెల్లువకట్టి పార నతి।వేడ్కనటింపుచు మోహిలనున్న యీ
పల్లవపాణి నాహృదయ।పద్మములోని యమూల్యమైన సొ
మ్మొల్ల హరించినిల్చె విధి। యెట్లులిఖించెనో నోపకుండ్డశ్ర.

రాకుసుడు — (తనలో) ఇంచి తీరింది నాజన్మ. నన్నే రమ్మనుచున్నది. లేదు- లేదు- స్త్రీలనమ్మరాదు- ఈమెకు నిజముగా నాపై ప్రేమగలదా! ఏమో ఎవ్వరుచెప్పగలరు. (మోహిని మరల సైగచేయుచున్నది) ఆ- ఆ. నన్నే- అమ్మతోడు- నన్నే రమ్మ నుచున్నది. నా యంద మీమె డెందంబునకు నచ్చినదిగాబో లును. నన్ను మోహించింది గాబోలును.

గీ. ఇచటి పూరుషులందున। నెన్నదగిన
యందగాడని తనమది।యందు దలచి
యీ లతాతన్వి తనకృపా।దృష్టి బరపి
నన్నె జేపట్టుమని కను।సన్నసేసి.

ఈమె లభించిన నా కీయమృత మక్కర లేదు.

ఇంద్రు — (కండ్లుతెరచి తనలో) పరమేశ్వరమాయ. ఈకాంత యెవ్వ రు- (పరికించి) ఈమెయందు హరిపోలికలు గొన్ని దోచుచు న్నవి- (మరల పరికించి) సందియము లేదు- ఆదినారాయణు

డే- యీరూపంబు నవతరించి రాక్షసుల వంచింపదలచినట్లు న్నది. కానిమ్ము- ఇప్పటి కిసుమంత ధైర్యము చిక్కినదిగదా! ముం దేమిజరుగనున్నదో-

బలి—సుందరీ ! నీ వెవ్వతెవు- నీవృత్తాంతమేమి- యెవ్వరియాన నీ విచ్చటి కరుదెంచితివి- నీ తల్లిదండ్రు లెవ్వరు ?

మోహిని—(నవ్వుచు)

గీ. ఒకరియానకు లోబడి యుండగాని
యొరులె నాయానకై వేచియుందు రెపుడు
తల్లిదండ్రులు లేరు యీ ధాత్రిమీద
నిటుల వర్తించుచుందు నే నెల్లయపుడు.

న న్నెల్లరు జగన్మోహినియందురు. తమబోటి సుందరాకారులజూచి నంతటినుండి మన్మథుఁడు- నా డెందమును సందడింప- నే- నిం- ద- రు- దెంచి- తి-

ఇంద్రు—దానవోత్తమా ! ఆయమృతమును భాగించుకొందమురమ్ము.

బలి—దూరముగానుండుము- అమృతకలశమును ముట్టితివా ! దౌడ పండ్లూడగొట్టెదను.

జగ—దానవసార్వభౌమా! ఈతనితో కలహమేల కలహకారణమేమి.

బలి—ఈ యమృతమ ను మే మందఱమును గలసి సంపాదించితిమి.

జగ—అయిన సమముగా భాగించుకొనుడు.

బలి—తానే మాకును- వారికిని పంచియిచ్చునట.

జగ—అంగీకరించిన- నేను- అయిననాకేల? మీరేభాగించుకొనుడు.

బలి—కల్యాణీ! సంశయింతు వేల? మాధ్యస్థమువహించి యీయమృతమును పంచిపెట్టుము. (శంబరునితో రహస్యముగ) వారలకు తక్కువ మనకు నెక్కువ యిమ్మని సైగజేసిన యట్లేయని

మరల సన్న జేసినది లెమ్ము. (ప్రకాశముగా) ఇంద్రా! యీ లతాతన్వి భాగించుటను సమ్మతించెదవా ?

ఇంద్రు—సమ్మతమే.

జగ—(కనుసన్నతో బలినిజేరి యమృతకలశమును గ్రహించి రహస్యముగా) ఈ దేవతలకు ముందుగా కొంచెముగాబోసి మిగిలిన దంతయును మనమే యనుభవింతము.

బలి—(అపవారించి) అట్లేచేయుము. ఈ యమృతమునకుఁ దోడుగ నీ యధరామృతమునుగూడ యొసంగి న న్నాదరింపవలెను.

జగ—(అపవారించి) అందుల కేగదా! యీయత్నము. (ప్రకాశముగ) దేవదానవులారా! పంక్తులుదీర్చి కూర్చుండుఁడు.

(దేవత లొకవంకను రాక్షసు లొకవంకను గూర్చుందురు).

జగ—ఇంద్రాదిదేవతలారా! ఈ యమృతమును గ్రోలుడు.

(అని వారలకుఁ బోయుచున్నది).

రాహువు—(తనలో) ఈ జగన్మోహిని దేవతలకే పోయుచున్నది. అమృతమంతయు చెల్లినట్లున్నది. జాలము చేసిన కార్యము లేదు. నేనుఁగూడ దేవతలప్రక్క జేరుదును. (అని దేవతలలో జేరి కూర్చుండును).

జగ—(వానికిని సుధబోయును).

సూర్యచంద్రులు—(రాక్షసుఁడని సైగ సేతురు).

జగ—(పరికించి చక్రమున తలనరికి రిత్తకలశమును పారవైచి యంతర్ధానమగును).

బలి—ఏదీ! జగన్మోహిని అరే యొంతపనిజేసినది.

శంబ—అంతర్ధానమైనది నేను సందేహించినట్లే యైనది.

3 రాక్ష—ఇట్లు జరుగగలదనియే నేను దలంచితిని.

బలి—అయిననేమి లెండు. ఓదానవులారా! లెండు. లెండు. యుద్ధమునకు సిద్ధపడుడు. దేవతల జక్కాడుడు. (6)

శ్రీ

సంగీత విష్ణులీలలు.

వరాహావతారము.

[ప్రవేశము — హిరణ్యాక్షుఁడు]

హిర — మర్త్యలోకంబున నాతోఁ బోరాడఁగల శూరుఁడు గన్పడఁడే? కమలాసన వరప్రభావము సరిజూచుట కొక్కప్రత్యర్థియైన భూలోకంబుననేడీ ఛీ! ఛీ! అంతలోకమును నిర్మించి యా బ్రహ్మ నాతోఁ బోరాడగలమానవు నేల సృజింపకఁ బోయెనో గదా! ఈ స్వర్గమునందు నెవ్వడైన యుండునేమో యను గంపెడాసతో నరుదెంచితినిగాని ఛీ! ఛీ! యిందైనను దగినవాఁడు లభింపడయ్యెను. ఈ స్వర్గాధినాథుఁడును- పర్వతగర్వభంజనుఁడును అగు నావజ్రపాణియైన నింత రణబిక్షయొసంగునని దలంచివచ్చితినిగాని యాతఁడును గాన్పింపఁడు. కారణమేమైయుండును.

ముల్లోకంబులకు ప్రభుఁడైన యా శచీంద్రుఁడు నాధాకకుఁజడిసి పారిపోయి యెందైనడాగియుండునా? అట్లెన్నటికిని జరిగియుండదు.

సీ. అమృతంబనియెడి దివ్యౌషధముంగ్రోలి
బలుఁడ నేనని గర్వపడెడివాఁడు
భువనత్రయంబును । బాలొప్పందగా నేలి
బలుఁడ నేనని గర్వపడెడివాఁడు

అలనగంబులతెక్క । లవలీల దునుమాడి
బలుఁడ నే నని గర్వ।పడెడువాఁడు
హరిపాప్రుగలదంచు । ననయంబు దలపోసి
బలుఁడ నే నని గర్వ।పడెడువాఁడు
గీ. తగినవీరుండు లభియింప । దనదునేర్పు
జూప రణరంగమున నిల్వ।జూచుగాని
పిగ్గుబిడియముల్ లేనట్టి । చెనటిపోల్క
వెరచి దాగొన నెటకేని । పరుగులిడునె

ఏదో కార్యాంతరమున నా వెన్నునితో మాట్లాడనరిగియుండును గాని నే వచ్చుచుండు టెఱిఁగి భీతిమై దాగొనియుండడు.

[ప్రవేశము—నారదుఁడు (7) పాడుచు]

హిర—(నారదుని సమీపించి) సురమునీంద్రా! నాకృతనమస్కారములు గొనుము.

నార—హిరణ్యాక్షా! యింకుంటివేమి? (తనలో) భూలోకమును భస్మీపటల మొనరించి యిచ్చోటి కరుదెంచితివా?

హిర—భూలోకంబున నాతోఁ బోరాడఁదగిన వీరుఁడు లభింపమి యీస్వర్గాధినాథుఁడైన శచీంద్రుఁడేని యింతుక రణభిక్ష యొసంగగలఁడని వచ్చితిని. కాని యాతఁ డేదో కార్యార్థమై వైకుంఠమున కరిగియుండెనట. ఇచ్చట నాతని రాకకై వేచియుంటిని.

నార—(నవ్వును)

హిర — నవ్వెదరేమి?

నార—ఇచ్చట వేచియున్న లాభ మగపడదు. నీవచ్చు టెఱిఁగియే యాతఁడు వైకుంఠమున కేగియుండెను. ఆతఁ డింతలో వచ్చునట్లు లేదు.

హిర—నిజమేనా ! ముల్లోకాధినాధుడే నాకు వెరచిపరుగిడెనా ! యీలోకమును గొడ్డునారినదా ?

నార—ఓయీ నీతో బోరాడదగినవాఁడు వరుణదేవుఁడు. అతని యొద్ద కేగుము.

హిర —చిత్తము రణమొనరింప నామనంబు తత్తరిల్లుచున్నది.

(నిష్క్రమించును.)

నార—ఈతని యాయుఃకాలము పూర్తియైనట్లుదోచుచున్నది. వినాశకాలే విపరీతబుద్ధిః యనునట్లీతనికి విపరీతబుద్ధులు పుట్టుచున్నవి. ఏమిజరుగునో చూచెదగాక. (17 పాడుచు నిష్క్రమించును.)

ద్వితీయరంగము.

[ప్రవేశము: హిరణ్యాక్షుఁడు- వరుణుఁడు.]

వరు —దానవేంద్రా! కడుంగడు వ్యయప్రయాసల కోర్చి నీవిప్పటున నిచ్చటికిరాగతమేమియో ఎఱిఁగింపవలగునేని యెఱిఁగింపుము.

హిర—గదాయుద్ధమున నిన్నుమించినవాఁడు లేరని నారదుఁడు వినిపింప నధికతరామోదంబునంది నేటికిగదా తగినప్రత్యర్థి దొరికెనని సంతోషించి యిచ్చటి కరుదెంచితిని.

వరు —(తనలో) నీతోడనా పోరొనరించుట. నారదుఁడు నాకొంప దీయనెంచినాఁడు.

హిర —ఆలోచించుచుంటివేమి ?

వరు — ఓయీ !

చ. మనముశాంతిబూని నియమంబున సంగరముజ్జగించియే
ననయమునున్నవాఁడ నిపుడాహవకేళి చరింపరాదు నీ

ఘనభుజవిక్రమస్ఫురిత । గాఢవిజృంభణముల్ జయింపజా
లిన ప్రతివీరులెవ్వరును । లేరు ముకుందుఁడు దక్క నెక్కడన్.

హిర — (తనలో) తప్పించుకొనఁ యత్నించుచున్నాడు. అయిన మరొ
క్కపరి మాట్లాడిచూచెదగాక! (ప్రకాశముగ) ఓయీ' సమ
ర్థుఁడగు వీరుఁడు లభించినచో యుద్ధముసేయక నాడుదానివలె
నియమము - శాంతి - యని మాటలాడెద వేటికి? లెమ్ముకొంత
కాలము వినోదముగా మల్లయుద్ధ మొనరింతము రమ్ము.

వరు — ఓయీ ! పలుమాటలేల వినుము. నీవంటివీరుఁడు లభించుట
యేతడవుగా యుద్ధ మొనరించువాడను. కాని యీనియమమూ
నుటచే యుద్ధ మొనర్చుట లేదు. అయినను కమలాసనవరప్ర
భావమున నమితపరాక్రమంబుగల నీతో నావంటి సామా
న్యుఁడు పోరజాలునే ముకుందునియొద్ద కేగుము.

హిర — ఆత డెచ్చోటనుండును.

వరుణు — దానవకులావతంసమా !

చ. గొనకొని యచ్యుతుండు విబుధ [?] పురంబున నున్నవాఁడుదా
నని మొనబెక్కుమారులు భి । యాతుల నోరిజయించి శక్తిపెం
పున నడిసన్న వీరుఁడని । భూజనకోటి నుతించునందువే
చను మతఁడిచ్చునీకునని । సర్వముదీఱు నంత మీఁదటన్.

హిర — సరే గానిమ్ము అచ్చటికే పోయెదను. (తనలో) ఛీఛీ !
యిట్టిపిరికిపందవని యెఱింగినచో రాకనేయుందును. (ముందు
నకు నడచును.) తెరవాలును.

హిర — ఇక్కడ నింతయైనదింక యక్కడనెంతయగునో చూడవలయు
ను. నాపేరు విన్నమాత్రముననే యింద్రుడు పాఱిపోయెను.
యీవరుణుడు యుక్తియుక్తముగా మాటలాడి తప్పించుకొని

నాడు. ఇంక నాముకుందుఁడుమాత్రము నాతో బోరుటకు సమ్మతించునా ?

(తెరలో వీణానాదము.)

అదుగో! నారదుని వీణాస్వనంబు వినవచ్చుచున్నది.

[ప్రవేశము నారదుఁడు 9 పాడుచు.]

నార — ఇచ్చటనే యుంటివేమి ? వరుణునియొద్ద కేగలేదా !

హిర — ఏగితిని. లాభమేమి ?

నార — వరుణుఁడు యుద్ధమొనరింపలేదా?

హిర — ఆవరుణుఁడుమాత్రి మాహిరణ్యాక్షునితో బోరసాహసించునా ? ఆతఁడు దుర మొనరింపలేక మొంగిచేయిజూపుచు ముకుందునియొద్దకుఁ బొమ్మనెను. అందులకై వైకుంఠమున కేగుచుంటిని.

నార — వలదు. వలదు.

చ. గురుభుజుఁడమ్మహాత్ముఁడు వైకుంఠపురంబున నేఁడు లేఁడు భూ
భరమువహింపనాదికిటి । భావముదాల్చి రసాతలంబునం
దిరువుగనున్నవాఁడచటి । కేగఁగనోపుదువేని నేగుమం
దరయగఁగల్గు నీకునసురాంతకుతోడి రణంబవశ్యమున్.

హిర — ఏమీ ! వైకుంఠమున లేఁడా ! అట్లయిన రసాతలంబునకే బోయి యాతని నరసెదగాక. (నిష్క్రమించును.)

నార — వీఁడు నేఁడే హరిచేఁగూలఁగలవాఁడు. యీచిత్రమును సాంగముగాఁ జూచియే పోయెదఁగాక. (నిష్క్రమించును.)

(తెర యెత్తబడును. రసాతలము.)

[ప్రవేశము:— నారదుఁడు.]

నార — (తనలో) ఆ నారాయణదేవుని యవతారలీలల వర్ణింప నెవ్వని తరంబు. ముమ్ము మత్స్యమై సోమకాసురాధముని జంపి బ్రా

జడువుల బ్రహ్మకిచ్చె. సురాసురులు సముద్రమథన మొనరిం
పుచుండగా క్రుంగిన గిరిక్రింద నిలచి యాకుధరభారమున వ
హించి దేవతల కమృత మొసంగెను. నేడీరక్కసాధముని జం
పనాదికిటిరూపంబుదాల్చియున్నాడు... (ఎదుటజూచి) అల్లదే
అమ్మహానుభావుఁ డెదురులేని శౌర్యమున విహారమొనర్చు
చున్నాడు.

సీ. తుద మొదళ్ళకుఁ జిక్క । దునిసిపాఱఁగ మోర
గుల శైలములఁజిమ్ము । గొంతతడవు
బ్రహ్మాండభాండంబు । పగిలిచిల్లులుఁబోవఁ
గొమ్ములదాటించు । గొంతదడవు
జలధులేచును బొంక । సంకులంబైయుంక
ఖురములమట్టాడు । గొంతదడవు
ఉడురాజు సూర్యుండు । నొక్కమూలకుఁబోవ
గుఱుచవాలము ద్రిప్పుఁ । గొంతదడవు

గీ. గినియుఁ గుప్పించు లంఘించు । గొప్పరించు
నెగయు ధరద్రవ్వ బొఱియఁగా । నేపురేగి
దానవేంద్రుని గుండెలు । తల్లడిల్ల
బందిమెల్లన రణపరి । పంథియగుచు.

అల్లదే హిరణ్యాక్షు డీవంకకే వచ్చుచున్నాడు. నే నామాటునను
డి వీరియుద్ధనైపుణ్యమును దిలకించెదగాక (నిష్క్రమించును.)

(ప్రవేశము:—హిరణ్యాక్షుఁడు.)

హిర—(తనలో) అల్లదేముకుందుఁడు నాదికిటిరూపంబున నన్నుభయ
పెట్టుటకుగాబోలు సముద్రమంతయు వ్యాకులపెట్టుచున్నాడు.
ఆ- ఆ- అదే. నావశవర్తినియైనభూమిని దంష్ట్రాగ్రమున నిల్పి
వినోదించుచున్నాడు గానిమ్ము వీనిపనిపట్టెదగాక. (ప్రకాశ

ముని) ఓరీ! నారాయణా! వసీవరాహరూపా!

క. గొనకొనినీవి ధరణిం
గొనిపోకుము విడుముకాక । కొనియేఁగెదవే
గొనియొద నీప్రాణముగై
కొనుమిదె నాదుమాట । కొననేమిటికిన్. (నిష్క్ర-)

(తెరయెత్తబడును.) వ రా హా వ తా ర ము .

ఈహిరణ్యాక్షుఁడు విరించి దయదలంచి యొసంగినవరముల కుప్పొంగి భూవలయము నన్నుమించినవీరుఁడు లేడని గర్వించి యెల్లర బాధించుచు ప్రజాకంటకుఁడయ్యె వీనిని జక్కాడి లోకంబుల కుపకారమొనర్చెదగాక.

[ప్రవేశము:— హిరణ్యాక్షుఁడు.]

(కం. గొనకొని...అనుపద్యమును జదువుచు)

వరా—(సమీపించుచు.)

మ. వినరా ఘోరి యమంగణాచరణయు । ద్వృత్తిన్ననున్నీదు ధీ
నయంబున్ వనగోచరంబగు మృగంబుం దలంతౌర నే
నెనయన్ వన్యమృగంబయాదుబలిమై । యేతెంచు నీబోటి యా
శునకశ్రేణివధింతునేడని మొనన్ । సాకోర్చివర్తించినన్.

చం. ననునెదురంగజాలినఘనంబగు శౌర్యము ధైర్యమున్ బలం
బునుగలవేని నిల్వరణభూమిని నీహితులైనవారికిం
గనుగవ బాష్పపూరములు । గ్రమ్మగ మాన్పగనోపుదేని జ
య్యనజనబొమ్ము దానవకులాధమ యూరక రజ్జులేటికిన్.

హిర—ముకుందా! నీబీరంబులఁ బోనడచి నాతోఁ బోరగలవేని నిందుమగంటిమి గలదేని రణంబుననిల్వుము. లేకున్న యిదారి దొలఁపగిది కాళ్ళకు బుద్ధిసెప్పి పరుగిడుము.

వరా—ఛీ భుజాబలగర్వదుర్విదగ్ధా- ఆరణోచితస్థలంబునకు రమ్ము-
(ఇరువురు నిష్క్రమింపగా నారదుడు- ప్రవేశము.)

నార—ఏమి వీరి సమరనైపుణ్యము- ఇరువురును వెనుకంజవేయక-
కాదు- కాదు- హిరణ్యాక్షుడించుక వెనుకకేగుచున్నాడు-
లేదు- వెనుకకేగి తగరుకొండదాకినభంగి మరల హరినిదాకు
చున్నాడు- ఆ- చచ్చెను హిరణ్యాక్షుడు- లేదు నారాయణు
నిచే వ్రేటువడి క్రిందబడెను. మరల లేచుచున్నాడు- క్రిందబ
డినను మాదేగెలుపనినట్లు బీరంబులు పల్కుచున్నాడు-ఏమి
గుసగుసలు. (పైకిజూచి) తెలిసినది జగద్వినుత పరాక్రమ శీలు
రగు నీవీరులు యుద్ధనైపుణ్యమును దిలకించుటకు దేవతలెల్ల
విమానరూఢులై గగనమార్గంబున నిలచియుండిరి- అదే
బ్రహ్మ ఏదో పల్కుచున్నాడు.

(తెరలో)

ఉ. అంచితదివ్యమూర్తి పర।మాత్మక యీకలుషాత్ముడైన న
క్తంచరుడస్మదీయవర। గర్వమునన్ భువనంబులెల్లగా
రించు మదించి యిట్టివిప।రీతచరిత్రుని దుష్టపకిట్లుపే
క్షించుటగాదు వీనిబలి। సేయు వసుందరకుం శుభంబగున్.

నార - (తనలో) చతురాననుండు వీనినివధించి భువనంబులకుపకార
మొనరింపుమని ప్రబోధించుచున్నాడు గాని సంధ్యాకాలమే
తెంచుచున్నదని యెఱుంగక కాబోలును హరి వానితోక్రీడిం
చుచందంబున యుద్ధమొనరించుచున్నాడు.

(తెరలో)

మ. అనఘాయీయభిజ న్మహూర్తమునదే। హరాతి మర్దింపవే
నసయంబున్ మఱిదైత్యవేళగు సం।ధ్యాకాలమే తెంచినన్

ఘనమాయాబలశాలియైన దనుజున్ । ఖండింపగా రాదుగా
వునసీవేళన త్రుంపుసజ్జనహిత । ప్రోద్యోగరక్తుండవై.

నార— కమలాసనుఁ డదే దనుజనివధింపుమని దేవాదిదేవుని త్వర
పెట్టుచున్నాఁడు- అదే- అదే- దేవదేవుండు చక్రమందుకొని
యారక్కసుపై విడచినాఁడు- దనుజుఁడు నేలగూలినాఁడు- ఆ
దనుజాధముని దృక్కులింకను నాహరిపైననే యున్నవి.

మ. పరయోగీంద్రులు యోగమార్గముల నెవ్వానిన్ మనోవీధి సు
స్థిరతన్ లింగశరీరభంగమునకై । చింతింతు రాపంకజో
దరు పాణ్యాహతిఁ దన్ముఖాంబురుహమున్ । దర్శించుచుం జచ్చెదు
ర్భరితోత్తంసుఁడు దైత్యవల్లభుని సౌభాగ్యంబు దా నెట్టిదో.

(తెర లేవగా హిరణ్యాక్షునిపై హరియుండును.
బ్రహ్మాదు లిరువంకలను జేరి స్తుతింతురు.)

బ్రహ్మ—

చం. తలపరసాతలాంతరగ । తక్షితిఁ గ్రిమ్మరనిల్పినట్టి నీ
కలితనమెన్నవిస్మయము । గాదు సమస్తజగత్తులోలిమై
గలుగఁ జేయుటద్భుతము । గాక మహోన్నతి నీకొనర్చు పెం
పలరిన కార్యముల్ నడప । నన్యులకుందరమే రమేశ్వరా!

ఇంద్ర—

ఉ. విశ్వభవస్థితి ప్రళయ । వేళలయందు వికారసత్వమున్
విశ్వము నీవయై నిఖిల । విశ్వముఁగోలి సృజింతువింది రా
ధీశ్వర యీశ కేశవ త్రయీమయదివ్య శరీరదేవ నీ
శాశ్వతలీల లిట్టివని । సన్నుతి సేయగ మాకు శక్యమే.

(తెరవ్రాలును.)

శ్రీ

సంగీత విష్ణులీలలు.

నరసింహావతారము.

ప్రథమరంగము.

[ప్రవేశము:—హిరణ్యకశిపుఁడు, లీలావతి విప్రజిత్తి మొదలగువారు.]

హిర—నిన్నటిదినంబునుండియు చిరంజీవియగు ప్రహ్లాదునిఁ జూడవలయునని యుండుటచే కుర్రని దోడ్కొనిరమ్మని చండామార్కులకు వార్తబంపినను రాకుండిరేలకో గదా!

లీలా—అదే! కుమారుని వెంటబెట్టుకొని గురుపుత్రులు వచ్చుచున్నారు.

[ప్రవేశము:—ప్రహ్లాదుఁడు చండామార్కులు.]

ప్రహ్లా—(తండ్రికడకేగి) జనకా! నాకృతవందనముగొనుఁడు.

హిర-లీలా—దీర్ఘాయుష్యమస్తు, గురుపుత్రా! ఆయాసన మలంకరింపుఁడు.

హిర—(ప్రహ్లాదుని దగ్గరగాదీసుకొని) కుమారా! నీవు గురువులకడ శ్రద్ధగా విద్యనభ్యసించుచుంటివా! గురువులకడ నీవిదివఱకెట్టి శాస్త్రముల నభ్యసించితివి.

ప్రహ్లా—తండ్రీ పెక్కుశాస్త్రముల జదివితిని గురువులెన్నింటినో జదివించిరి. ఈ చదువులు నిస్సారములు.

ఉ. ఎల్లశరీరధారులకు । నిల్లను చీకటినూతిలోపలన్
ద్రెళ్ళకయుండ నేనును మ । తి భ్రమ నొంబు భిన్నులై ప్రవ
ర్తిల్లక సర్వమున్ నతని । దివ్యకళామయమంచు విష్ణునం
దుల్లముఁ జేర్చి తారడవి । నుండుటమేలు నిశాచరాగ్రణీ.

హిర—ఏమిది నాకు నైరియగు నా విష్ణుని గొప్పజేసి వర్ణించుచు టివి. ఇయ్యది నీకెవ్వరుపదేశించిరి. లేక నీకేదోచనా?

శా. నాకుంజూడగ చోద్యమయ్యెడి గదా । నాతండ్రి యీబుద్ధి దా
నీకున్ లోపలదోచెనో పరులు దు । ర్నీతుల్ పఠింపించిరో
యేకాంతంబున భార్గవుల్ పలికిరో । యీదానవశ్రేణికిన్
వైకుంఠుండు కృతాపరాధుడతనిన్ । వర్ణింపనీకేటికిన్.

కుమారా! మనకులాచారముల పోద్రోచి వైరిజనుల నేల కీర్తించెదవు?

మ. సురలందోలుటయో సురాధిపతులన్ । ద్రుక్కించుటో సిద్ధులం
బరి వేధించుటయో మునిప్రవరులన్ । బాధించుటో యక్ష కి
న్నర గంధర్వవిహంగ నాగపతులన్ । నాశంబునొందించుటో
హరియుంచున్ గిరియుంచు నేలచెడమో । హాంధుండవై పుత్రకా!

ప్రహ్లాదుఁడు—(గురునివైపునకు దిరిగి)

శా. అజ్ఞుల్ గొందఱు నేముదామనుచు మా । యం జెంది సర్వాత్మకుం
బ్రజ్ఞాలభ్యుదురన్వయక్రమములన్ । భాషింపగా నేరరా
జిహ్వాసాపధమందుమూఢులుగదా । చింతింప బ్రహ్మాది వే
దజ్ఞుల్ తత్పరమాత్ముని విష్ణు నితరుల్ । దర్శింపగా నేర్తురే.

చండా—నాయనా ప్రహ్లాదా! హరిభక్తిమానుము.

ప్రహ్లా—గీ. ఇనుమయస్కాంతసన్నిధి । నెట్లు భ్రాంత
మగు హృషీకేశుసన్నిధి । నావిధమున
గరగుచున్నది దైవయో । గమున జేసి
బ్రాహ్మణోత్తముచిత్తంబు । భ్రాంతమగుచు.

వారియొక్క విశేషమాలోచింపుడు.

సీ. మందారమకరంద । మాధుర్యమునఁదేలు
మధుపంబుబోవునే । మదనములకు
నిర్మలమందాకి । నీవీచికలఁదూగు
రాయంచజనునె త । రంగిణులకు
లలితరసాల ప । ల్లవఖాదియై చొక్కు
కోయిలసేరునే । కుటజములకు
పూర్ణేందుచంద్రికా । స్ఫురితచకోరక
మరుగునే సాంద్ర నీ । హారములకు
నంబుజోదరుదివ్య పా । దారవింద
చింతనామృతపాన వి । శేషమత్త
చిత్తమేరీతి నితరులఁ । జేర నేర్చు
వినుతగుణశీల! మాటలు । వేయునేల?

చండా—ప్రహ్లాదా! మా జెప్పిన శాస్త్రములనెల్ల మంటగల్పితివా!

ఉ. పంచశరద్వయస్కుఁడవు । బాలుఁడవించుకగాని లేవు భా
షించెదు తర్కవాక్యములు । జెప్పిన శాస్త్రములోని యర్థము
క్కించుకయైనఁజెప్ప వసు । రేంద్రుని ముందట మాకు నాదలన్
వంచుకొనంగ జేసితివి । వైరివిభూషణ వంశదూషణా.

హిర—కుమారా! మనకులద్వేషియగు నాహరిని కీర్తించెదవేల నా
మాటలు వినుము హరిభక్తి మానుము మేలగును.

ప్రహ్లా—జనకా! ఆదిమధ్యాంత శూన్యుండును. రాజసాది గుణత్రయ
విరాజితుండును. చిరశుభాకారుండును. మోక్షసందాయకుం
డును. అగు నాదేవదేవునకు. వీరు. వైరులనియు వారు హితు
లనియు బేధమున్నదా! బుద్ధిహీనులమై మనమట్లు దలంచుచుం
దుముగాని యాపరమాత్మునకట్టిదెన్నటికిని లేదు. పిపీలికాది

బ్రిహ్మపర్యంతమాతఁడు సమంబుగ నెల్లర సమదృష్టినారయు చుండును.

హిర—ఛీ దురాత్మా! నాకే బుద్ధులుగరపుచుంటివా!

చ. తనయుఁడుగాడు శాత్రిపుఁడు । దానవభర్తకువీఁడు దైత్య చం
దనవనమందుఁ గంటకయ । తక్షితిజాతముభంగి బుట్టి నా
డనవరతంబు రాక్షస కు । లాంతకు బ్రిస్తుతిసేయుచుండు దం
డనమునఁ గాని శిక్షలకు । డాయఁడు పట్టుఁడు కొట్టుఁడుద్ధతిక్.

చండా—దనుజేంద్రా! మాపల్కు లాలించుము-ఈతఁడింకను పశివాఁడు దండనమున కాఁగలేఁడు గాన వారల దోడ్కొనిపోయి మా నిపుణత్వమంతయు జూపి గోపించియో దండించియో జదివించి యీపాడు హరిభక్తి మానునట్లొనరింతుము.

లీలా—నాథా! చండామార్కులు జెప్పినవిధంబున వర్తించుటయె కర్తవ్యము-యింకను ముక్కుపచ్చలారని యీచిన్నిపాపనిదండించినచో లాభముండునా! కొంచెము ప్రాజ్ఞుఁడైనచో నేమేని బుద్ధిదెచ్చుకొనునేమోగదా!

హిర—మంచిదట్లనేగానిండు-గురుపుత్రా! మీరాయిచ్చవచ్చిన తెఱంగున వీనికి బోధించి హరిభక్తిమానునట్లొనరింపుడు-

(చండామార్కులు ప్రహ్లాదులు నిష్క్రమింతురు)

హిర—ప్రాణేశ్వరీ! రమ్ము లోనికేగుదము-నేఁడు నామనం బన్యాక్రాంతమై యొకవిధమగు విచారముచే నావరింపఁబడినట్లున్నది.

(నిష్క్రమింతురు-తెరవ్రాలును)

ద్వితీయరంగము.

(హిరణ్యకశ్యపుఁడు-చండామార్కులు ప్రహ్లాదుఁడు దూరమున నుండగా
(తెర లేచును)

చండా— నాయనా ప్రహ్లాదా! నామాటవినుము-నీతండ్రియెదుట విష్ణునివర్ణింపకుము- నామాటవినుము- మాకు దలవంపులు దేకుము కనుసన్నల మెలగి నీతండ్రియిష్టానుసారమువర్తించుము- ఈపాడుహరిభక్తికీర్తనలపద్యములు నీతండ్రిచెంతఁ బాడకుము.

ఉ. త్రిప్పకుమన్న మామతము । దీర్ఘములైన త్రివర్గపాఠముల్
దప్పకుమన్న నేఁడుగున । దైత్యవరేణ్యుని మ్రోలనేము మున్
జెప్పిన నీతిగానిమఁదు । సెప్పకుమన్న విరోధినీతులన్
విప్పకుమన్న దుష్టులగు । విష్ణుచరిత్రకథార్థజాలముల్.

అదే నీతండ్రి నమస్కరింపుము- దానవసార్వభౌమా! నీకుమారుని సకలనీతిశాస్త్రపారంగతునిఁ జేసి దోడ్కొనివచ్చితిని.

క. శిక్షించితిమన్యములగు
శాస్త్రంబులుమాని నీతి । పారగుఁడయ్యెన్
రక్షోవంశాధీశ్వర
వీక్షింపుము నీకుమారు । విద్యాబలమున్.

ప్రహ్లా— జనకా! నమస్కరించుచున్నాఁడను.

హిర— కుమారా! దీర్ఘాయుష్మంతుడవై యుండుము- (అని దగ్గరకు దీసికొని ముద్దిడుకొని తొడపైగూర్చుండబెట్టుకొని-) ఇంతకాలము దనుక నీవేమిజదివితివి- గురువు లేమిబోధించిరి-

శా. చోద్యంబయ్యెడి నింతకాలమరిగన్ । శోధించియేమేమి సం
వేద్యాంశంబులుసెప్పిరో గురువు లే । వొటంబఠింపించిరో

విద్యాసారమెఱుంగఁ గోరెదభవ । ద్విజ్ఞాతశాస్త్రంబులోఁ
బద్యంబొక్కటి సెప్పి సార్థముగ తా । త్పర్యంబుభాషింపుమా.

ప్రహ్లా — జనకా! గురువులెన్నియో శాస్త్రంబులు సెప్పిరి నేను జదివి తిని చదువులలోనిసారమును గూడగంటిని.

క. చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థముఖ్య । శాస్త్రంబులు నే
జదివినవి గలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల । జదివితి తండ్రీ.

హిర — నాయనా! మంచిది. ఆపాఁపుహరిభక్తి మాని శాస్త్రంబుల నెల్లజదివి సారముగ్రహించితివా! మంచిది. యింకనెన్నడును నావిష్ణునిగీర్తింపకుము. నీవు నేర్చినసారమెద్దియో నాకుఁ గూడ విన్పింపుము.

ప్రహ్లా — జనకా! ఆలించుము.

సీ. కమలాక్షునర్చించు । కరములు కరములు
శ్రీనాథువర్ణించు । జిహ్వా జిహ్వా
సురరక్షకుని జూచు । చూడ్కులు చూడ్కులు
శేషశాయికి మ్రొక్కు । శిరము శిరము
విష్ణు నాకర్ణించు । వీనులు వీనులు
మధువైరి దవిలిన । మనము మనము
భగవంతువలగొను । పదములు పదములు
పురుషోత్తముని మీది । బుద్ధిబుద్ధి
దేవదేవుని జింతించు । దినము దినము
చక్రహస్తుని ప్రకటించు । చదువు చదువు
కుంభినీధవు జెప్పెడి । గురుఁడు గురుఁడు
తండ్రిహరిఁజేరు మనియెడి । తండ్రి తండ్రి.

జనకా ఆలించుము విష్ణుభక్తిలేని మానవుఁడు మానవుఁడే.

సీ. కంజాక్షునకుగాని । కాయంబు కాయమే
పవనగుంభిత చర్మ । భస్త్రిగాక
వైకుంఠుఁబొగడని । వక్త్రంబు వక్త్రమే
ఢమఢమధ్వని తోడి । ఢక్కగాక
హరిపూజనములేని । హస్తంబు హస్తమే
తరుశాఖ నిర్మిత । దర్విగాని
కమలేశు జూడని । కన్నులు కన్నులే
తనుకుడ్యజాల రం । ధ్రములుగాక
చక్రిచింతలేని । జన్మంబు జన్మమే
సరళిసలిలబుద్బు । దంబుగాక
విష్ణుభక్తిలేని । విబుధుండు విబుధుఁడే
పాదయుగముతోడి । పశువుగాక.

జనకా! సంసారవారాసిలోఁ జిక్కుకొనిన మానవులకు విష్ణుభక్తిలేకున్న మోక్షములభించునా !

సీ. సంసారజీమూత । సంఘంబు విచ్చునే
చక్రిదాస్యప్రభం । జనములేక
తాపత్రయాభీల । దావాగ్నులారునే
విష్ణుసేవామృత । వృష్టిలేక
సర్వంకషాఘౌఘ । జలరాసులింకునే
హరిమనీషా బడ । బాగ్నిలేక
ఘనవిపద్గాఢాంధ । కారంబులడఁగునే
పద్మాక్షునుతిరవి । ప్రభలులేక
నిరుపమానపునరావృత్తి । నిష్కళంక
ముక్తివిధిఁ గానవచ్చునే । ముఖ్యమైన

శార్ఙ్గకోదండ చింతనాం। జనములేక
తామరసగర్భునకునైన। దానవేంద్ర.

హిర — (మండిపడుచు) ఓరీ! దుర్మతీ! (కుమారునిక్రిందికిదోసి) నా యెదుట యిట్లు నావైరినివర్ణింప సాహసించిన నిన్ను పుత్రవ్యామోహమునబడి మన్నించితిని గాని లేకున్నచో నీపాటికి నా ఖడ్గమున కెరయైయుందువు- ఎంతగా మీరిపోయితివి- ఇట్టికులద్రోహివగుదువని కలనైనఁ దలంపనైతిగదా! అయినను యింది నిన్నవలసినదిలేదు.

చ. పటుతరనీతిశాస్త్ర చయ। పారఁగుజేసెదనంచు బాలునీ
వటుగొంపోయి వానికి న। నర్థములైన విరోధిశాస్త్రముల్
కుటిలత జెప్పినాడవు భృ। గుపుత్రవరుండవటంచు నమ్మితిన్
గటకట బ్రాహ్మణాకృతివి। గాక యథార్థపు బ్రాహ్మణుండవే.

చండ — దానవేశ్వరా నాపైన నలుగకుము.

ఉ. తప్పులులేవు మావలన। దానవనాథ విరోధిశాస్త్రముల్
చెప్పము కూరులైపరులు। చెప్పరు మీచరణంబులానను
మ్మొప్పుడుమీకుమారునకు। నింతయు నైజమునీమ యెవ్వరుం
జెప్పెడి పాటిగాదు ప్రతి। చింతదలంపుము నేర్పుకైవడిన్.

హిర — ఓరిడింభకా! గురుపుత్రు లుపదేశింపని యీదుర్మతము నెవ్వరుపదేశించిరి. వారల బేర్కొనుము తత్క్షణము వారిని ద్రుంచెదను.

ప్రహ్లాదుఁడు — జనకా!

ఉ. అచ్చపుజీకటింబడి గృ। హవ్రతులై విషయప్రవిష్టులై
చచ్చుచు బుట్టుచుం మరల। చర్వితచర్వణులైనవారికిన్
జెచ్చెరబుట్టునే పరులు। జెప్పిననైన నిజేచ్ఛనైననే
మిచ్చిననైన గానలకు। నేగిననైన హరిప్రబోధముల్.

ఒకరుపదేశించినంతమాత్రమున విష్ణుభక్తి యలవడునా! పూర్వకర్మ
సంచితంబుగ దనంతనదియే యుద్భవింపగలదు.

హిర — ఏమీ! నీపొగరుబోతు సమాధానము- కానిమ్ము- యిట్టిప్ర
గల్భవాక్యము లాడువారలను మన్నింపరాదు.

శా. అంగవ్రాతములోఁ జికిత్సకుఁడు దు । ష్టాంగంబు ఖండించి శే
షాంగశ్రేణికి రక్షసేయుక్రియనీ । యజ్ఞాంగ గులద్రోహి దు
స్సంగుం గేశవపక్షపాతి నధమున్ । జంపించి వీరవ్రతో
త్తుంగఖ్యాతిఁ జయించెదం గులముని । ర్దోషంబు గావించెదన్.

దానవులారా! రండు-యీతుచ్ఛునిఁ గొనిపోయి మీయిచ్చవచ్చినట్లు
బాధింపుడు. కట్టుఁడు కొట్టుఁడు హరిభక్తి మానివేయుదుననువ
ఱకు-మీ యిచ్చవచ్చినట్లు శూలములచేఁ బొడువుడు గదలచే
మొత్తుఁడు.

[ప్రవేశము: — యిరువురు రాక్షసులు.]

ప్రహ్లా — జనకా! శ్రీమన్నారాయణచరణారవిందమరందపాన పార
వశ్యంబున దేలుచున్న నా కెట్టియాపదలును రానేరవు.

హిర — (దానవులతో) ఈద్రోహినిఁ గొంపోండు.

ప్రహ్లా — శ్రీహరీ! శ్రీహరీ! (దానవులు దోడ్కొనిపోవుదురు.)

హిర — (తనలో) ఎంతచెప్పినను వినడయ్యెను. కడగాదనుజులు యువ
రాజని సంశయింపక తమయిచ్చవచ్చినరీతిఁ బాధింపుచున్నను
సహించుచు శ్రీహరీ! శ్రీహరీ! యని నుతించునుగాని యిం
చుకంతయు దైన్యమొందడు.

ఉ. శూలములన్ నిశాచరులు । సుక్కగదేహము నిగ్రహింపగా
బాలుఁడు నేలపైబడఁడు । పాఱఁడు చావఁడు తండ్రినైన నా
పాలికివచ్చి చక్రధరు । పక్షముమానితినంచు పాదముల్
ఫాలమునొత్త మ్రొక్కఁడఁన । పాయక నుండుట కేమిహేతువో,

చండా—(రాజు యభిమత మెఱింగి) రాజేంద్రా! నాపల్కు లాలకింపుము. శుక్రాచార్యులవారు వచ్చునంతవఱకీతని నింక బాధింపకుము. వారు వచ్చిరేని తగుమార్గములబోధించి విష్ణుభక్తి విడచునట్లు జేసెదరు. అంతవఱకు మేముగూడ వేయి విధంబుల యత్నించుచునే యుందుము.

హిర — అట్లొనర్పుడు- రండాతని దోడ్కొని వెడలుదురుగాక.

(నిష్క్రమింతురు.)

(తెర పడును.)

తృ తీ య రం గ ము.

—: పాఠశాల :—

(చండామార్కులు- ప్రహ్లాదుఁడు- యితరబాలురు.)

చండా—ప్రహ్లాదా! ఆహరిభక్తిమాని తిరంబుగ నా నేర్పుత్రివర్గపాఠముల జదువుచుండుము. నీతోడి బాలురచేఁగూడ జదివించుచుండుము. జపతపంబుల నిర్వర్తించుకొని యొక్కఘడియలో వచ్చెదను. (నిష్క్రమించును.)

1 బాలుఁడు—పంతులువెళ్ళినాడు- పుస్తకముల మూలపారెయ్యండి ఆడుకుందాము రండి.

2 బాలుఁడు—నీకెప్పుడు ఆటలేకాని చదువక్కఱలేదు.

3 బాలుఁడు — నువ్వు మాచదివేసినావు లెద్దూ.

4 బాలుఁడు—ప్రహ్లాదా! ఆడుకొనుటకు వచ్చెదవా!

ప్రహ్లాదుఁడు—బాలకులారా! ఆలించుడు. ఆటపాటలలో కాలమునువ్యర్థముసేయకుడు- సకలజన్మంబులలో మనుష్యజన్మంబుత్తమము- అయ్యదియుశతవర్ష పరిమితంబైన జీవితకాలంబున నియమితం

బై యుండు. అందు సగమంధకార బంధురంబయి రాత్రిరూపంబున నిద్రాదివ్యవహారంబున నిరర్థకంబగు చిక్కిన యేబది వత్సరంబుల బాల్యకైశోర కౌమారాదివయోవిశేషంబుల యిరువదివత్సరంబులు గతించును, మిగిలిన ముప్పదివత్సరంబులందును నింద్రియంబులచేతఁ బట్టుబడి యరిషడ్వర్గాదులకుఁ జిక్కి దన్మధ్యంబునుండి వెలువడజాలక నాశాపిశాచంబుచే నావహింపబడి ధన కనకవస్తువాహనంబులను బాంధవులను ప్రేయసిని వర్జింప నేరక నిర్గమద్వారశూన్యంబగు మందిరంబున నుండి వెడలెడు మార్గంబుగానక చింతించు కీటకంబుచందంబున గృహస్థుండు స్వయంకృతకర్మపాశబద్ధుఁడై మోక్షసాధనంబులగు మార్గంబులగు రెఱుఁగక, రమానాథచరణారవిందగంధరసాస్వాదనంబెఱుఁగక మూఢుడై దండధరుమందిరద్వారగేహళీజాజ్వల్యమానవైతరణీదహనదారుణజ్వాలాజాలదందహ్యమానదేహులంగూడి శిఖిశిఖావగాహంబుల నొందుచుండును. ఏపురుషుండు యరిషడ్వర్గంబుల జయించి మనోనిగ్రహుండై తనహృదయపద్మంబున నారమాకాంతుని పాదపద్మంబుల నిడుకొని సేవించుచుండునో యాపురుషుండు మోక్షలక్ష్మినిగైకొని సర్వకాలసర్వావస్థల నా శ్రీమన్నారాయణుని చెంత నివసించియుండు. కాన మోక్షార్థియైనజీవి తన యిచ్చవచ్చినరీతిఁ గాలంబును వృథసేయక తుచ్ఛంబులగు నిహసౌఖ్యంబుల కాశజేయక దేహావసాన పర్యంతము నారాయణుని సేవించుటయె కర్తవ్యము.

1 బాలుఁడు—ప్రహ్లాదా! ఆతడెట్టివాఁడు-ఎచ్చోటనుండును.

2 బాలుఁడు—ఆతని మెప్పించుటెట్లు?

3 బాలుఁడు—మోక్షంబు సాధించుటెట్లు?

4 బాలుఁడు—ఈ ప్రశ్నల కుత్తరమిచ్చినచో మేముగూడ హరిభక్తు
లమై యుందుము.

ప్రహ్లాదుఁడు—ఆ నారాయణుండు కరుణాపరిపూరితుండై యెల్లర సమదృష్టి నీక్షించుచుండును. పృథివ్యప్తేజోవాయు రాకాశంబులందును భూతవికారంబులయిన ఘటపటాదులందును సకల చరాచరస్థూలసూక్ష్మజీవసంఘంబులందును రజస్తత్వతమోగుణంబులందును గుణరహితంబైన మహత్వాదియందును బెక్కురూపంబుల-రూపశూన్యుండై- యుండియు లేనట్టుల మెలంగుచుండును. పెక్కుమాటలేల- అనారాయణదేవుఁడు లేనిస్థలంబుగాని వస్తువుగాని యేలోకంబునందునులేదు. అది కారణంబుగ మనము సర్వభూతములందును సుహృద్భావంబు గలిగి వర్తించిన నధోక్షజుండు పరమానందంబునొందును. ననంతుండును-నాద్యుండును నగునాహరి సంతసించి తనకృపాదృక్కిరణంబుల మనపైఁ బ్రసరించిన నింక మనకుఁ గావలసినదే మున్నది. జనార్దనచరణసరసిజయుగళసంస్మరణ సుధారసపానపరిమత్తులమైనచో నకాంక్షితంబుగ మోక్షలక్ష్మి తనంతదానె మనల వరించితీరును.

1 బాలుఁడు—నీచెప్పినది సత్యంజసముగానున్నది.

2 బాలుఁడు—మేముగూడ హరిభక్తుల మయ్యెదము.

ప్రహ్లాదుఁడు—అయినచోరండు. హరినిభజింతము. (10)

[ప్రవేశము:—చండామార్కుఁడు]

చండా—పాఠశాలయంతయు నల్లకల్లోలముగానున్నదే- (పరికించి) ఆహా మించివచ్చినది. ఎల్లరును విష్ణుభక్తులైరి- ప్రహ్లాదుని మూలమున రాక్షసబాలు రెల్లరును పాడగుచుండిరి. భూకాంతున కియ్యది యెఱిగింపకున్న ముప్పువాటిల్లగలదు-(ప్రహ్లాదు

నిసమీపించి బలవంతముగా నాపి) చాలుచాలు. మంచిపనిజేసి తివి యీరీతిగా నేనా పాఠములు జదువుట రమ్ము. నీతండ్రితో నీవృత్తాంతమంతయుజెప్పి నిన్ను తగినట్లు శిక్షింపజేతును. రమ్ము. (ప్రహ్లాదుని దోడ్కొని నిష్క్రమించును.)

[ప్రవేశము:—హిరణ్యకశ్యపుఁడు.]

హిర—(తనలో) ప్రహ్లాదునకేమేని బుద్ధివచ్చియుండునా! అకటకటా! ఆపాడు హరిభక్తిగాక వీనియందొక దుర్గుణములేదే! యిట్టి సుగుణరాసిని నిష్కారణముగా బాధించితి- బాధించితి- కన్న కుమారుడని- మనమున నించుకేని కనికరింపక బాధించితి- అయినను- నాయెడలఁగలభక్తి వీడక విష్ణుభక్తి పరాయణుడై జరించుచుండెనే! ఇంక వీనిని నెట్లుస్వాధీనమొనర్చుకొందును. (ఆలోచించి) పసిబాలుఁ డెక్కడ క్రూరబాధలకోర్చియుండు టెక్కడ- నాశాత్రువుండగు నాహరి- నాసోదరుని యమలోకంబున కంపిన వఁరి- వీనియం దావేశించియుండి యాబాధల సహించుచు బాలకునిగాపాడుచుండెను. ఓరీ! నామగుణ రూపహీనా! నీకండకావర మడగించెదలెమ్ము. నాధాకకు వెరచి డాగొనిన నిన్నేసంహరింపజాలనియెడ కమలాసనదత్త మహోత్కృష్టవరప్రభావమొందులకు- దుర్మతీ! తత్తరపడకుము యీహిరణ్యకశ్యపుడింతలో శాంతివహింపజాలఁడు.

[ప్రవేశము:—తొందరతో చండామార్కులు.]

హిర—ఏమిది గురుదేవా! యింతతత్తరబాటున నరుదెంచితిరేమి? చిరంజీవి విష్ణుభక్తిమానెనా! లేదా!

చండ—దానవసార్వభౌమా! కొంపమునుగునట్లున్నది- నీకుమారునిమూలముగా తక్కింగల బాలకులుగూడ పాడగుచుండిరి.

శా. రక్షోబాలురనెల్ల నీకొడుకు చేరంజేరి లోలోననా
శిక్షామార్గములెల్ల గుల్లలని యాక్షేపించి తానందఱన్
మోక్షాయత్తులజేసినాఁడు మనకుం మోసంబువాటిల్లె నీ
దక్షత్వంబున జక్కసేయవలయుం దైతేయవంశాగ్రణీ!

హిర—తానుచెడినదేగాక వారలగూడఁ జెరుపయత్నించెనా! మీ రంతటశిక్షించి నీకిది తగదని బోధింపలేదా!

చండా—నేను జపంబు పర్వ్తించుకొని పాఠశాల కరుదెంచునప్పటికి బాలురెల్లరును తన్మయత్వముతో బాడుచు నాడుచుండిరి. అతికష్టముపై నీతనయుని బట్టినిల్పి యిదేమని ప్రశ్నించగా నాకుఁ గూడ విష్ణుభక్తి యుపదేశింపఁ బ్రారంభించెను. అంత జేయునది లేక యీవృత్తాంతము తమకెఱుఁగఁజేయ వచ్చితిని ప్రహ్లాదుని యల్లదే గుమ్మముకడ నిలిపితి.

హిర—(కోపమున) ఓరీ! డింభకా! పుత్రుడవని కనికరముజూపిన కొలదియు నెత్తిపైకెక్కి తాండవించుచున్నాడవా! ఓరీ! అలంబసా! ప్రహ్లాదు నిట్లీడ్చుకొనిరమ్ము.

[ప్రవేశము:— ప్రహ్లాదుఁడు, అలంబసుఁడు.]

హిర—ప్రహ్లాదా! కడసారిగా నడుగుచున్నాను. విష్ణుభక్తిమానెదవా! నాఖడ్గమున కెరయయ్యెదవా! జెప్పుము. కులాచార ధర్మంబులఁ బోవిడిచి నీపినతండ్రిని వరాహరూపంబునఁ జంపిన యద్దురాత్ముని బట్టువలె నేలవర్ణించెదవు.

ప్రహ్లా—జనకా! ఆమహాత్ముని యూరకనిందించెదవేమి. యిటువినుము. నా పినతండ్రియొనర్చిన ఘోరపాపమే యాతనిని వరాహరూపంబున జక్కడిచినది. నారాయణదేవునకు రాగద్వేషములు లేవు.

హిర—దురాత్మా! (అని తన్నుచున్నాఁడు.)

ప్రహ్లా—శ్రీహరీ !

హిర—ఛీ ! నోరుమూయుము హరియను వాడెవ్వఁడును లేడు. ఉన్న చో తనహితులైన దిక్పాలురఁజంచి చెండాడునాఁడు నిందుమ గఁటిమిఁగలవాడైనచో నాతోఁ బ్రతిఘటించి నిలువకుండునా.

ప్రహ్లా—జనకా ! కామక్రోధాదులజయించి యింద్రియంబులఁ జిక్కువడకఁ జతురులై వర్తించు పుణ్యచరిత్రులకుగాని నీవంటి వారలకు గోచరింపఁడు.

హిర—ఓరీ దుర్మతీ ! నీమందమతి యింకను మేరమీరుచున్నదే (అని మరలదన్ని) ఓరీ! అలంబసా యొక్క పాములవానిని బిలిపించి క్రూరసర్పములచే వీనిని నాయెదుట గరపింపుము.

[ప్రవేశము: —లీలావతి. 11 పాడుము.]

లీలా—నాథా యించుక కరుణింపుఁడు. కుమారుని-నవమాసంబులు గర్భమందుదాల్చి గనిన నాకుమారుని- యీముక్కుపచ్చలారని ముద్దుకుఱ్ఱని- మనవంశలతాంకూరుని-చంపించుటయేనా! అందునను- అజ్ఞానముచే పసితనమున- విష్ణుని ధ్యానించుచుండెనను మిషపైఁ గన్నులయెదుటనే జంపించుటా ! ఇంతకన్న ఘోరమున్నదా ! కుమారా ! ఇంతపట్టుదలయేల ? (12)

నామాటవినుము. నీతండ్రి బోధించుమార్గమునఁ బొమ్ము. విష్ణుభక్తి మానుము. నీయభ్యుదయముఁగోరెడి నాకు సుఖమొనఁగూర్పుము. జనకునితో వైరమునీకుఁ దగునా ! తండ్రీ ! నామాటవినుము హరిభక్తిమానుము,

హిర—ఏమిరా ! యిచ్చటనుండి కదలవు. వెంటనే పాములవానిని దోడ్కొనిరమ్ము. (అలంబసుఁడు నిష్క్రమించును.)

లీలా— (13 అనుబంధము.)

నాథా ! నాథా ! నాయేకపుత్రుని మన్నింపరా ! మన్నింపకున్నమా

నె యావజ్జీవము బాధించుచుండుగాని నాకు పుత్రశోక
ముమాత్రము గల్గింపకుము. (వేడుకొనును.)

హిర—అక్షురాకుము. (దోసి వేయును.)

[ప్రవేశము:—అలంబసుడు, పాములవాడు.]

హిర—ఓరీ! నీయొద్ద మంచిపాములేశైన నున్నవా!

పాము—చిత్తం బాబూ చిత్తం- మాంమేలు పావులుండాయి బాబు!

హిర—చూపుము.

పాము—ప్రభోరుసిత్తగించండి ఇదో సూడండి. యీనల్లసుక్కలతా
సునండి- నున్నంకొండలోనండి- తిరిగితిరిగి మూణ్నెళ్ళు కాసి
మరీపట్టుకున్నామండి- ఈగోధుంతాసును చూడండి ప్రభో
మొన్ననండి పదిమందోచోట కూకుంటె యెనకపాటనొచ్చి
ముగ్గురుపానాలుచ్చుకొని బొక్కలో దూరిందండి అప్పుడునా
నెంతో కట్టపడి దీన్నట్టుకున్నా.

హిర—ఈరెండుపాములచేతను ప్రహ్లాదుని గరిపింపుము.

లీలా—నాథా! నాథా! కరుణింపరా! కుమారునిపైఁగనికరముంప
రా! కుమారా! ప్రహ్లాదా! నీవైన నాపల్కులాలింపవా!

ప్రహ్లా—అమ్మా! యేలశోకించెదవు. శేషాహితల్పుండగు నాశ్రీ
హరినే ధ్యానింపుచు- స్మరించుచు కీర్తింపుచున్న నన్నీకూర
పన్నగంబు లేమిచేయఁగలవు. యించుక యూరడిల్లుము కాని
నాకెన్నఁడును విష్ణుభక్తి మానుమని బోధింపకుము. వలయు
నేని యీదేహమును- ప్రాణమును సమర్పించెదగాని హరి
భక్తిని మాత్రము మానజాలను.

లీలా—హాకుమారా! (మూర్ఛిల్లును.)

హిర—ఓరీ! ఆలస్యమేలచేసెదవు. ఆపాములచే వానిఁగఱపింపుము,

పాము—సిత్తం సిత్తం. (నాగస్వరము పట్టుచుండును.)

ప్రహ్లా—పన్నగశాయనతల్పా ! కృపాకల్పా ! నిన్ననవరతంబు ధ్యానించుచుంటినని కోపించి జనకుండు పెక్కువిధముల బాధించి నాబుద్ధిమరలఁజాలక నన్నిక్రూరసర్పంబులచేఁ గఱపించుచున్నాడెను. కాని పాపతేనిపై శయనించిన నారాయణా నీపాదభక్తుండనైన నన్నిపన్నగము లేమిచేయఁగలవు.

పాము—(కరపింపబోవగరుత్మంతుడు పాములనెత్తుకొనిపోవును.)

పాము—(ఏడ్చుచు) అయ్యో బాబోయ్ బాబోయ్ కొంపమునిగింది. బాబోయ్ నాకూట్లో దుమ్మడింది బాబోయ్ నారెండుపాములు పోయినాయ్‌బాబో !

హిర—(తుళ్ళిపడి) ఏమిజరిగినది.

చండా—గరుడుఁడు దరుదెంచి పాముల నెత్తుకొనిపోయెను.

హిర—ఎంతపనిజరిగినది. అలంబసా ! వీనినిదోడ్కొనిపొమ్ము. కాలకూటతుల్యమగు విషపానీయమును గొనిరమ్ము.

లీలా—(మూర్ఛదేరి) తనయా ! తనయా ! నన్నిట్లు దుఃఖాంధకారమున వీడిపోయితివా !

ప్రహ్లా—అమ్మా ! ఏటికీశోకము యీావిచారము. ఈతనువు శాశ్వతమా! యింతవ్యామోహమున బడితివేమి- రమానాధచరణారవిందములు నమ్మిన నన్నీక్రూరసర్పము లేమిచేయఁగలవు.(14)

లీలా—(తనయుని కౌగిలించుకొని) కుమారా ! నీ వెట్లాక్రూరసర్పములబారి పడకుంటివి ?

ప్రహ్లా—ఆ హరి నాసహాయార్థము గరుత్మంతుని బంపియుండెను.

[ప్రవేశము: —అలంబసుఁడు.]

హిర—ఓరీ డింభకా ! యిక జచ్చితివి. ఆవిషంబు గ్రోలెదవా ! విష్ణుభక్తి మానెదవా !

ప్రహ్లా—(విషపాత్రమందుకొని) జనకా ! యీావిషము నేగాదు మఱి

యేఘోరవిషము నైన ద్రావి మరణించిన మరణింతురు గాని హరిభక్తి మానజాలను.

లీలా—నాథా! కరుణింపరా! కనికరమింపరా! భగవానుని రూపుమాపి వానిని భజించుచున్న కుమారునకు జూపినచోఁ దన యజ్ఞానమునుండి తన చిత్తము మరలించుకొని విష్ణుభక్తిని మానకుండునా? భగవానునిపైఁ జూపదగిన- పరాక్రమము- శౌర్యధైర్యములు- శక్తియుక్తులు- మున్నగునవి కన్నకుమారునిపై జూపదగునా! నాథా! అనుగ్రహింపుము. అయ్యో కన్నకుమారునికే విషమిచ్చి చంపుటా నాథా! నామొరాలింపుము. యించుకంత కనికరమునింపుఁడు. (15)

హిర—ఓసీ! దుర్మతీ! నీయేడ్పులికఁ గట్టిపెట్టి యీవిషము వీనిచేఁ ద్రాగించుము. లేదందువా! యీఖడ్గమున కెరయయ్యెదవు.

లీలా—(విషపాత్రలాగికొని) కటకటా! నవమాసములుమోసి కని పెంచి పెద్దగాఁజేసి-వారలవలన సుఖపడవలయునని తలంచుదివసంబులలోఁ గుమారునకు విషమిడి యంతకాలయుంబునకను పుతల్లులెందైననుండిరా! కుమారా! ... ...

ప్ర—(విషపాత్ర మందుకొని) జననీ! సందేహింతువేల. తుచ్ఛమగు పుత్రవ్యామోహమునఁబడి సతీధర్మము లేమరదగునా! సతులకు పతియేగదా దైవము. అట్టిచో నీపతి యాజ్ఞాపించిన ట్లొనరించుట కేటి యాటంకము. (తాగును)

పలా—ఆ! ఆ! త్రా-గు-చుం-టి-వా! (మూర్ఛిల్లును)

ప్రహ్లా—(తల్లిని మూర్ఛదేర్చి) అమ్మా! ఇయ్యదితగునా!

హిర—ఓరీ! మూర్ఖా! నిన్నిప్పుడీ ఖడ్గమున కెరజేసినచో నెవ్వడడ్డము రాగలఁడు.

ప్రహ్లా—జనకా !

కం. బలయుతులకు దుర్బలులకు
బలమెవ్వఁడు నీకు నాకు బ్రహ్మాదులకున్
బలమెవ్వఁడు ప్రాణులకును
బలమెవ్వం డట్టివిభుఁడు బలమసురేంద్రా !

ఆ శ్రీహరియే వచ్చి గాపాడగలఁడు.

హిర—ఛీఛీ! వదరకుము.

శా. నాతోడం బ్రతిభాషలాడెను జగన్నాథుండ నాకంటెనీ
భూతశ్రేణికి రాజు లేఁడొకఁడు సంపూర్ణప్రభావుండ మ
ద్భ్రాతం జంపిన మున్న నే వెదకితిం బల్మాఱు నారాయణుం
డేతద్విశ్వములోన లేఁడు మఱి వాఁ డెందుండురా దుర్మతీ?

నామరూపగుణరహితుండైన నాహరి యెక్కడనుండునురా.

ప్రహ్లా—జనకా ! సర్వభూతాంతర్బహిర్మధ్య సంగతుఁడైన యాశ్రీ
హరి లేని స్థలంబులున్నవా !

మ. కలఁడంభోధిగలండుగాలిఁ గలఁడా కాశంబునం గుంభినిం
గలఁడగ్నిన్ దిశలం బగళ్ళ నిశలన్ ఖద్యోతచంద్రాత్మలం
గలఁడోంకారమునం ద్రిమూర్తులఁ ద్రిలిం గవ్యక్తులందంతటం
గలఁడీశుండు గలండు తండ్రి వెదకం గానేల నీయాయెడన్.

ఇంకను వినుము.

కం. ఇందుగలఁ డందులేడని
సందేహము వలదు చక్రి సర్వోపగతుం
డెందెందు వెతకిజూచిన
నందందే గలఁడుదాన వాగ్రణివింటే.

హిర—ఓరీ !

కం. డింభక సర్వస్థలముల
నంభోరుహనేత్రుఁడుండు । ననుచు మిగుల సం
రంభంబున బలికెదవీ
స్తంభంబునఁ జూపఁగలవె । చక్రిన్ గిక్రిన్.

ప్రహ్లా— జనకా ! సందేహామే ?

శా. అంభోజాసనుఁ డాదిగాఁగఁ దృణప । ర్యంతంబు విశ్వాత్ముఁడై
సంభావంబుననుండు ప్రోడ విపుల । స్తంభంబునం దుండడే
స్తంభాంతర్గతుడయ్యు నుండుటకు నే । సందేహమున్ లేదు ని
ర్దంభత్వంబున నేఁడు గానబడు బ్రి । త్యక్షస్వరూపంబునన్.

హిర— ఇందా హరి లేకున్నచో నేను నీచాపు నిక్కము (స్తంభము
నుగొట్టును.)

(స్తంభముపగులును-నరసింహావతారము.]

హిర— ఓరీ ! దుర్మతీ ! నాయనుజునిజంపి యెందో దాగియుంటివి.
రమ్ము నా ప్రతిపగఁ దీర్చుకొందును. కుమారా ! నీవును
విరోధిని కీర్తించుచుంటి వనుకొంటిం గాని నాప్రత్యర్థిని-ఎందు
జూచినను గానరాని యీమాయకానిని నాకు జూపుదువని
తలంపనైతిని. కుమారా ! చిరకాలము వర్ధిల్లుము.

నృసింహమూర్తి— ఓరీ దురాత్మా!హిరణ్యకశ్యపా! నేటితో యాయుః
కాల మంతరించినది రమ్ము.(తొడలపైనిడ కొనిచీల్చిచంపును.)

ప్రహ్లా— (16)

తెర వ్రాలును.

శ్రీ

సంగీత విష్ణులీలలు.

వామనావతారము.

[ప్రవేశము:—శుక్రాచార్యులు బలి.]

బలి—గురువర్యా! ఈదినంబున నొక్క యతిథియైన రాకుండుటం జూడ కడుంగడు వింతగాఁ దోఁచుచున్నది.

శుక్రా—వింతగనుండుట కేమున్నది.

చ. అడుగకమున్నె నీవు విప్రు । లార్థములన్ వెదజల్లి కోర్కెలన్
దడయకఁ దీర్తునంచు వ్రత । ధారణసేసి చరించుచుండగా
గడచెను పెక్కుమాసములు । గాన దరిద్రులు కంటికైనగ
న్పడరని నూహసేసి నుడు । వందగు దైత్యకులావతంసమా!

కోటి కొక్కడైనను యాచకుఁ డుండియుండునా యని సందియము నీ కుండిన యుండవచ్చునుగాని నేనుమాత్ర మట్లు దలంపను.

బలి—గురూత్తంసమా! అట్లు శలవీయకుఁడు. పెక్కురు విప్రులింకను దరిద్రదేవతాపీడితులై యుండియుందురు. వారెల్లరును యీధనంబులను మన మన్యాయముగా నింద్రునిపీచ మడచి సంపాదించినదని ప్రతిగ్రహింప సంశయపడుచుందురు.

శుక్రా—ఇంద్రాదులనుటచే జ్ఞప్తికివచ్చినది. వారలమాత్రము మేమరి యుండగూడదు సుమా! ఏమందువా! తా మెవ్వరిచేనైన బాధింపబడినప్పుడెల్ల వారాహరియొద్దకేగి కల్లబొల్లి యేడ్పు

లచే నాతని మనంబును గరగించి యాతనిచే నభయంబును బొందుచుందురు. అట్లనే వారు నేమను బయలుదేరిపోయి యుండవచ్చును.

[ప్రవేశము—వామనుఁడు]

వామ—(చేయిజాపి)

ఉ. స్వస్తిజగత్త్రయీభువన । శాసనకర్త మహాసమిాత్రి వి
ధ్వస్తనిలింప భర్తకును । దారపదవ్యవహర్తకున్ మనీం
ద్రస్తుత మంగళాధ్వరవి । ధానవిహర్తకు నిర్జరీగళ
న్యస్తసువర్ణ సూత్రపరి । హర్తకు దానవలోక భర్తకున్.

బలి—(పీఠముఁడిగ్గి తనలో) ఈతఁ డెవ్వఁడో యర్థాపేక్ష నిట్లరుదెంచి నట్లు బొడకట్టుచున్నది. (ప్రకాశముగ) ఈపీఠమం దాసీనులు గండు.

శుక్ర—(తనలో) ఈమరగుజ్జురూపుం డెవఁడోగదా!

బలి—ప్రియా! యుదకంబును గొనితెమ్ము.

[ప్రవేశము—రాణి యుదకకలశముతో]

(వామనుని పాదములఁగడిగి తలపై జల్లుకొని నమస్కరించి)

బలి—భూసురోత్తమా!

మ. వడుగా యెవ్వరివాఁడ వెవ్వఁడవు సం । వాస స్థలం బెయ్యది
య్యెడకున్ నీవరుదెంచుటన్ సఫలమ । య్యెన్ వంశమున్ జన్మముం
గడుధన్యాత్ముఁడనైతి నీమఖము మా । గ్యఁబయ్యె నాకోరికల్
గడతేరెన్ సుహృతఁబులయ్యె శిఖులుం । గల్యాణ మిక్కాలమున్.

వామ—దానవరాజశేఖరా! ఉత్తరార్థినై నేఁడు నీసన్నిధి కరుదెంచితిని.

సీ. ఇది నాకు నెలవని । యేరీతిఁ బల్కుదు
నొకచోటనక యుండు । నుండనేర్తు

ఎవ్వానివాఁడనం । చేమని బల్కుదు
నాయంతవాఁడనై । నడువనేర్తు
నీవడవడియని । యెట్లు వక్కాణింతు
బూని ముప్పోకలఁ । బోవనేర్తు
నదినేర్తు నిదినేర్తు । ననిమేల చెప్పంగ
నేరుపులన్నియు । నేననేర్తు
నోరులుగారు నాకు । నోరులకు నేనాదు
నొంటివాఁడ జుట్ట । ములేదు లేదు
సిరియుఁ దొల్లి గలదు । చెప్పెద నాకెంకి
సుజనులందు తరచు । సాచ్చియుండు.

ముల్లోకంబుల వన్నె కెక్కిన దాతవని పలువురచే నాలించి నా వాంఛితంబు నీవలన దీరునను తలంపుతో నిచ్చటి కరుగదలంచితిని.

బలి — మహాభాగా ! తమకోర్కె యెద్దియైన దీర్చుటకు సిద్ధముగా నుంటిని యానతిండు చేతులుగట్టుకొని చేసితీరెదను.

వామ — (ఆలోచించుచుండుటను అభినయము.)

బలి — విప్రపుంగవా ! సందేహించుచుంటిరేల - నసత్యమాడువాఁడ నని తలంచుచుండిరా !

వామ — అట్టి తలంపులేదు. మున్ను చన్నమీవారందఱును మహాబల సంపన్నులు ఆడినమాట తప్పియెఱుంగరు. ఆవంశమర్యాదను నీవు చక్కగా నిలుపగల సమర్థుఁడవు.

బలి — మహాభాగా సంశయమే లేనిచోఁదమ వాంఛితంబును దెల్పుడు. దుకూలాభరణములో హయంబులో కరులో రత్నములో కాంచనమో సత్కులసంజాతలగు కన్యలో గ్రామములో భూములో గాక ధరణీఖండమో వాంచించెదరో దెల్పుఁడు. ఇవన్నియును గావలసినను గొనుడు.

వామ — బలీంద్రా! నీ చెప్పిన వస్తువుల బ్రహ్మచారినగు నేనేమిచేసి కొనగలవాడను. యీవస్తువులలో నా కెద్దియును వలదు.

శుక్రా — (తనలో) ఏమిది. యీతని చరిత్ర మద్భుతముగా నున్నదే. యీతనికోర్కె యెయ్యదిగా నోపును.

వామ — ఓబలిసార్వభౌమా! నాపల్కు లాలించుము.

గీ. ఒంటివాఁడ నాకు । నొకటి రెండడుగుల
మేరయిమ్ము సామ్ము । మేరయొల్ల
గోర్కెదీర బ్రహ్మ । కూకటి ముట్టెద
దానకౌతుకసాంద్ర । దానవేంద్ర.

బలి — భూసురోత్తమా! ఇదేటికోర్కె! కోరిన దెద్దియైన నొసంగెద నని యొకటిరెం డడుగుల నేలమాత్ర మడిగితివేల? ఇంతమాత్రముకన్న నధికముగా గోరిన నే నొసఁగలేనని దలంచితివా! లేక వేరొం డెద్దియైన నడుగవలయునని సంకల్పించికొని మరచి యిట్లడిగితివా? లేక పరిహాసమునకై యడిగితివా? భూసురోత్తమా! దాన మడుగునప్పుడు దాతపెంపులనైన దలంప వలదా!

మ. వసుధాఖండము వేడితో గజములన్ । వాంఛించితో వాజులన్
వెసనూహించితొ కోరితో యువతులన్ । వీక్షించి కాంక్షించితో
పసిబాలుండవు నేర వీవడుగ నీ । యల్పంబు లీపాటిగా
కసు రేందుగ్రిందు పదత్రయం బడుగ నీ । యల్పంబు నీనేర్పునే.

వామ — బలీంద్రా! నీ చెప్పినవాటితో నా కేటినిమిత్తము.

మ. గొడుగో జన్నిదమో కమండలువొ నా । కున్ ముంజియో దండమో
వడుగే నెక్కడ భూములెక్కడ కరుల్ । వామాక్షులశ్వంబు లె
క్కడ నిత్యోచిత కర్మమెక్కడ మదా । కాంక్షామితంబైన మూ
డడుగుల్ మేరయ త్రోవకిచ్చుటది బ్ర । హ్మాండంబు నాపాలికిన్

పేరాశబూనిన మానవుఁ డెచ్చోటనైనను సుఖింపఁగలఁడా! దానము పరిగ్రహించుటయె దోషము. అందును తనకు వలయుదాని కంటె నధికంబుగా గొనుట మిగుల పాతకముగాన తనకువల యునంత మాత్రము గైకొని తృప్తినొందవలయును. ఇంతియె గాక,

శా. ఆశాపాశము దాగడున్ నిడుపులే । దంతంబు రాజేంద్ర వా
రాశిప్రావృత మేదినీ వలయ సా । మ్రాజ్యంబు సేకూడియుం
గాశింబొందిరి గాకలైన్యగయభూ । కాంతాదులున్నర్థకా
మాశన్ బాయగనేర్చిరే మునునిజా । శాంతంబులన్ జూచిరే.

రాజేంద్రా! నీవెట్టిదానమైన నీయఁగల సమర్థుడవు అయినను నా తలకుమించిన కోర్కెలఁ గోరదగునా! రాజన్యచూడామణీ ! లేదనక నా యడిగిన యర్థంబిచ్చి పుత్తెంచుము.

బలి—వటూత్తంసమా! నీయభీష్ట మెట్టిదైనను దీర్తునని వాగ్దానం బొసంగి వెనుకంజ వేయుదునా! గొప్పవిత్తమును గోరుకొందు వేమో యని తరచి తరచి యడుగుచుంటిని. నీ కోరినదెల్ల యొసంగెదను. మరల గోరుకొమ్ము వలదందువా పదత్రంబుల మేర నీకిచ్చుట కాటంకము లేదు.

వామ—బలీంద్రా! అంతియ[illegible]ను మూడడుగుల మేరమాత్ర మిమ్ము.

శుక్రా—(తనలో) ఈవటుని కోర్కెనుబట్టియు రూపమునుబట్టియు జూడగా నితఁడు మహాపురుషుఁడని తోఁచుచున్నది. అయినను దివ్యదృష్టిని జూచెదగాక. (అభినయము) తెలిసినది. ఈవటుం డానారాయణదేవుడే సందియము లేదు. కానున్నది గాకమా నదు. బలీంద్రుని ప్రబోధించెదగాక. (ప్రకాశముగ) ఓయీ! నీవీతని కీదానమీయవలదు. (17)

ఈతని వచనంబులఁబట్టి చూడ నీతఁడు భూసురమాత్రుఁడని దోపదు. దేవతలకార్యంబు సాధించుకొఱకునై శ్రీమహావిష్ణు వీరూపంబున నదితిగర్భమున కశ్యపసూనుఁడై జన్మించి యిచ్చోటికరుదెంచెను. నిన్ను వంచించినాడు నీ వెఱుఁగక యిచ్చెదవని బల్కిన మూడడుగులమేరను స్వర్గమధ్యపాతాళము లాక్రమింపఁగలఁడు.

కం. ఒక్కపదంబున భూమియు
నొక్కటఁ ద్రిదివంబుఁ ద్రొక్కి । యున్నతమూర్తిన్
దిక్కులు గగనము తానై
వెక్కసమైయున్న నెందు । వెడలెదు చెపుమా!

ఇంతియెగాక నాపల్కులాలింపుము ఈదాన మొసంగినందువలనసర్వంబును నాశనముగాఁగలదు. గావున యేదానమువలన సర్వంబునకును నాశనమరుదెంచునో యట్టిదాన మొసంగకుండుటయె యుత్తమము. అట్లొసంగకుండుటవలన నిసుమంతయు దోసము లేదు. ఇందొక్క ధర్మసూత్రమున్న దాలింపుము తనకుఁగల సర్వస్వమును నైదుభాగములుగావించి యందొక్కభాగమును దానధర్మంబులకు వినియోగింపవలయును. అట్టిచో సర్వంబును విష్ణునకు సంతర్పణ మొనరించి బసుగువోలె నెట్లుజీవింపగలవు. కావున నీవీదాన మొసంగననుము. అయ్యో! అనృతమెట్లాడు వాడనందువేమో యాలింపుము.

ఆ. వె. వారిజాక్షులందు । వైవాహికములందు
బ్రాణవిత్తమాన । భంగమందు
జకితగోకులాగ్ర । జన్మరక్షణమందు
బొంక వచ్చునఘము । వొందదధిప.

ఈదానమువలన ప్రాణవిత్తమానములు మూఁడింటికిని భంగముగలుగు

చున్నది. కావున యీదానమొసంగకుము నామాటల వాటిం
పుము.

మ. కులమున్ రాజ్యము తేజమున్ నిలుపుమీ । కుబ్జుండు విశ్వంభరుం
డలతింబోఁడు త్రివిక్రమస్ఫురణ వాఁ । డైనిండు బ్రహ్మాండముం
గలఁడే మాన్పనొకండు నాపలుకు లా । కర్ణింపు కర్ణంబులన్
వలదీదానము గీనమున్ బనుపుమా । వర్ణిన్ వదాన్యోత్తమా.

బలి—గురూత్తంసమా! తమరునుడివిన వాక్యంబులెల్ల సత్యంబులు. కాని- వానినతిక్రమించితినని నాపైఁగినియకుడు నాయీనేరమును క్షమింపుడు. నీకోర్కె యెట్టిదైనను దీర్తునని వాగ్దానమొసంగి రాజ్యముపోవునేమో యను భీతిమై యర్థిని బొమ్మనుటెట్లు? ఎట్టిఘోరపాపులనైన భరించెదగాని సత్యహీనుని మాత్రము మోవజాలనని మున్ను భూదేవి బ్రహ్మతోఁబలుకదే. పలికిబొంకకుంటకంటె పాపమెద్ది ఇంకొక్కవిశేషమున్నదాలింపుడు. ఎందఱురాజులు మున్నుచనినారలు. వారలీరాజ్యమును మూటగట్టుకొనిపోయిరే.

శా. కారేరాజులు రాజ్యముల్ గలుగవే । గర్వోన్నతింబొందరే
వారేరీ సిరిమూటగట్టుకొని పో । వంజాలిరే భూమిపైఁ
బేరైనంగలదే శిబిప్రముఖులున్ । బ్రీతిన్ యశఃకాములై
యీరేకోర్కులువారలన్ మరచిరే । యిక్కాలమున్ భార్గవా!

అయ్యదియేగాక తమరనినట్లుగా నీతఁడు నిరంతరము పవనపర్ణాంబుభక్షులై జితేంద్రియులై- విపినాంతరాళముల తపంబాచరించుచుండు మహాయోగులకైన లభ్యుండుగాని యావిష్ణువేయైనచో- నీతనికోర్కెతప్పక నీడేర్పవలసినదేగదా! ఇంతకంటె కర్తవ్యమున్నదా! ఇంతకంటె నాబోంట్లకుఁ గావలసినదేమున్నది.

శా. ఆదిన్ శ్రీసతి కౌఁగిలింపె దనువుపై । నంశోత్తరీయంబుపైఁ
బాదాబ్జంబులపైఁ గపోలతటిపై । బాలిండ్లపై నూత్న మ
ర్యాదం జెందుకరంబు గ్రిందగుట మీఁ । దై నాకరంబుంట మే
ల్గాదే రాజ్యము గీజ్యముఁన్ సతతము । కాయంబునాపాయమే.

ఘ. నిరయంబైన నిబద్ధమైన ధరణీ । నిర్మూలనంబైన దు
ర్మరణంబైన గులాంతమైన నిజము ౯ । రానిమ్ము కానిమ్ము పో
హరుఁడైన౯ హరియైన నీరజభవుం । డభ్యాగతుండైన నా
దిరుగ౯ నేరదు నాదుఃజిహ్వ వినుమా । ధీవర్య వేయేటికి౯.

గురువర్యా! నన్ను తుమింపుడు తమపల్కు కెదురాడితినని నాపైఁ గినియకుడు- ఆవెన్నుడు మాత్రము నన్నే ౹వంచించును. ఆతఁడు గోరిన యర్థంబొసంగుచుండ నన్ను వంచించునా? అట్లువంచించి నచో నయ్యది నాభాగ్యము గాకుండునే- యేదియెట్లైనను దానంబు నొసంగెదను.

వామ—బలీంద్రా! ఏమందువు.

శుక్రా—ఏమిది? నాపల్కుల నాదరింపకుంటివి- నావచనంబులకుఁ బ్రతివచనమిచ్చెదవా! కులగురుపునై మీ శ్రేయంబనవరతంబు గోరెడి నన్నే తిరస్కరించెదవా! మూర్ఖా! ఇందులకుఁ దగిన ప్రతిఫలం బనుభవింపుము. నావచనంబు లాదరింపక నన్నవ మానపరచితివి గావున శీఘ్రకాలంబునఁ బదభ్రష్టుండవు గమ్ము. (నిష్క్రమించును.)

బలి— గురువర్యా!

ఆ. బ్రతుకవచ్చుగాక । బహుబంధనములైన
వచ్చుగాక లేమి । వచ్చుగాక
జీవధనములైన । జెడుగాక పడుగాక
మాటదిరుగ లేరు । మానధనులు.

తమశాపంబునకు గుఱియైనందుల కెంతగా విచారించుచుంటినో యం
తకు వేయిరెట్లు పరితాపమున సత్యమతిక్రమింపజాలనని జెప్పు
చున్నాడను. (వామనుని వైపునకు దిరిగి) వటూత్తంసమా !
జాలమికేల? రమ్ము! నీపాదపంకేరుహంబులఁ గడుగనిమ్ము.

క. రమ్మామాణవకోత్తమ
లెమ్మా నీవాంఛితంబు । లేదనకిత్తున్
దెమ్మా నీయడుగుల నిటురా
నిమ్మా కడుగంగవలయు । నేటికి? తడయన్.

(పాదముల గడగు టభినయము.)

వామ—బలిసార్వభౌమా! ధారాపూర్వకముగ మూడడుగుల మేర
ధారవోయుము.

బలి—పంచభూతంబులు-సోమసూర్యాది గ్రహనవకంబును-పరమేశ్వ
రుండును- సాక్షులుగ నీవటుశిఖామణికి మూడడుగుల మేర
దానమొసంగితిని. (దారవిడువబోవ పడకుండును.)

వామ—(తనలో) శుక్రుడు ధారపడకుండ జేయుచున్నాడుకానిమ్ము
(ప్రకాశముగ) రాజేంద్రా! దారపడుటలేదు. యాచకతాళు
ము. అద్దానిని నేను జక్కసేసెద. (అని దర్భపుడకచే బొడు
చును.)

శుక్రుఁడు—(ప్రవేశించి రోదనముచేయుచు) బలీ! కంటివా! నీచేనెట్టి
నదానమీయకుండ జేయగోరి నీటిధారపడకుండ నిలుపుజేసి
నందులకు నానేత్రమునకు మోసముపాటిల్లెను. చూచితివా!
యితనిపనులు యిప్పటికైనను నామాటవినుము.

బలి—గురువరేణ్యా! నాజిహ్వ తిరుగనేరదు.

శుక్ర—అయిన నాశాపమనుభవింపుము.

(శుక్రుఁడు నిష్క్రమించును.)

(బలి దాన మొసంగును. వామనుఁడు విశ్వరూపియగును.)

బలి—(ఆశ్చర్యముతో) వింతగానున్నదే ? ఈరోదసీకుహరమంతయు నాక్రమించి దివ్యతేజంబుతోనున్న యిమ్మహాభాగుండు-యాచార్యుఁడు నుడివినట్లా నారాయణుఁడే గావలయును.

వామ—బలీంద్రా! ధారాపూర్వకంబుగ దానమొసంగిన మూఁడడుగులకు భూమ్యాకాశములు రెండుపదంబులయ్యెను- మూఁడవ పదమునకు తావుజూపుము. లేకున్న యనృతమాడిన పాపమున బోవగలవు.

బలి—నారాయణస్వరూపా!

ఆ వె. సూనృతంబుగాని । నుడియదునాజిహ్వ
బొంకజాలనాకు । బొంకులేదు
నీతృతీయపదము । నిజమునాశిరమున
నెలవుసేసిపెట్టు , నిర్మలాత్మ.

ఆ. వె. నిరయమునకు బ్రాప్తి । నిగ్రహమునకును
పదవిహీనతకును । బంధనమున
కర్థభంగమునకు । నఖిలదుఃఖమునకు
వెఱవ వదే బొంక । వెఱచినట్లు.

వామ—(పాదమును బలిశిరముపైనిడి) బలీంద్రా! నీభక్తికి - నీసత్యవాక్పాలనంబునకును- నీదాతృత్వమునకును చాల సంతసించితిని. సావర్ణమన్వంతరంబున నీవింద్రుఁడవు గాఁగలవు. అంతపర్యంత మీవు నాపదధ్యానతత్పరుఁడవై సుతలలోకంబున సుఖముండుము.

బలి—(నమస్కరించి) అనుగ్రహింపబడితిని.

ఉ. ఎన్నఁడు లోకపాలకుల । నీకృపఁజూడని నీవు నేఁడు న
న్నున్నతిసేసి నాబ్రతుకు । నోజయునానతియిచ్చి గాచి తీ
మన్ననలీదయారసము । మాటల పెద్దరికంబు జాలవే
పన్నగతల్ప నిన్నెఱిఁగి । పట్టిన నాపదఁగల్గనేర్చునే?

భవత్పదారవింద సేవాతత్పరుఁడనై మెలంగునట్లనుగ్రహించితివి. యిం
తియెజాలును- భవదాజ్ఞపై సుతలంబుననే యుండెదను.

(తెరపడును.)

శ్రీ

సంగీతవిష్ణులీలలు.

పరశురామావతారము.

[ప్రవేశము:—కార్తవీర్యార్జునుఁడు, వీరసేనుఁడు,]

కార్త—వీరసేనా! ఒక్కనిముషమున- ననేకక్షోహిణులకు- నెవరికి-యెట్లు యెట్టిసౌఖ్యములు గావలయునో- యట్టిసౌఖ్యము లొసఁగూర్చి విందొనర్చినాఁడు. ఈజమదగ్ని మహాముని ప్రభావము వర్ణించుట కలవిలేనిదిగదా.

వీర—ప్రభూత్తంసమా! అయ్యది యాతనిప్రభావమని దలంపరాదు అతని చెంతనున్న సురభియను కామధేనువే సమస్తమును సమకూర్చెను.

కార్త—అట్టిసురభిమాత్రము సామాన్యులకు లభించునా? తపఃప్రభావము గలవారలకుఁగాని యట్టికామధేనువు లభింపదు-

వీర—అట్టి ధేనువు తమబోంట్లకడ నుండదగునుగాని యాకలములఁ దినుచుఁ గాలంబుఁగడపు మునిజనులకేల?

కార్త—నిజము! నిజము! కాని యదిమనకెట్లులభించును.

వీర—ఆజమదగ్ని మహాముని కడకు ననుఁబంపుడు. యాతనిప్రార్థించి యాధేనువును గొనివచ్చెదను.

కా ర్త — బహుయత్నలభ్యమైన యీ ధేనువును నీవడుగుటయేతదవుగా నీ కొసఁగుదునని తలంచితివా!

వీర — విప్రులు ధనాశాపరుఁలు గావున స్వర్ణమహాత్మ్యమున వారల లోఁబరచుకొనవచ్చును.

కా ర్త — అరణ్యంబుల కందమూలాదికముల భక్షించుచు తపోనిరతులై యుండువారలకు ధనాశయుండునా?

వీర — దేవా పలుమాటలేల? పైరెండుమార్గములు సరిపడకున్న దండించియైన యీసురభిని దోడ్కొనివచ్చెద. సంశయింపక నన్ను బంపుఁడు.

కా ర్త — అట్లైన పోయిరమ్ము.

వీరసేనుఁడు — చిత్తము. (నిష్క్రమించును.)

కా ర్త — అట్టిధేనువు నవశ్యముగా సాధింపవలయును. దండించియైన భూపాలకుఁడు తన దేశంబునగల జనులయొద్దనున్న సువస్తువులఁ గైకొనవచ్చును. దండించి యీధేనువునుఁ గైకొంటిమని పరశురాముఁడు యుద్ధమునకు సిద్ధపడునని దలంచెదను అయిన నా కేటిభీతి. ముల్లోకంబులు గడగడలాడింపఁగల మేటిమగండనైన నన్నెదిరించి యీపేదపాఱుఁడు నిల్వనేర్చునా? మొన్న మొన్న దేవేంద్రాదుల నిర్జించి వారలచే సమస్తోపచారములు జేయించుకొనుచున్న యీరావణునంతవానినే పట్టి బంధించియుంచితినిగదా! ఇంక నీ పరశురాముఁడా నను నెదుర్కొనజాలును. ఈతఁ డొక్కఁడేగాదు- యీతనివంటి పేదపాఱులు పదివేవురు ప్రతిఘటించి నిలుచిన నించుకేనియు భీతిల్లను. వారలనెల్ల జక్కాడి యీసురభిని గైకొందును.

[ప్రవేశము — వీరసేనుఁడు.

వీర — మహారాజా! జయము జయము.

కార్త — ధేనువును గొనివచ్చితివా? యాజమదగ్ని యద్దానిని నడుగుటయే తడవుగా నర్పించెనా?

వీర — లేదు. లేదు. ఎన్నియోవిధముల బ్రతిమాలితిని కాని లాభమిసుమంతయును గాన్పింపలేదు. అంత నేనింక చేయునది లేక బలిమి నద్దానిని గొనివచ్చితిని.

(తెరలో) హైహయాధీశ్వరా! రక్షింపుము. రక్షింపుము. ప్రమత్తులమై యుద్ధమునకు సిద్ధముగాలేని మమ్ముల నీ పరశురాముం డెదిరించి వధించుచున్నాఁడు.

వీర — (తనలో) కార్యము మించివచ్చినది. పరశురాముని కోపమింత నంతట చల్లారదు.

కార్త — సైనికులారా! వెలువకుఁడు మీమీ బలంబులజూపి యూతని నెట్టులైన నిర్జింపుఁడు. సేనానాయకులారా!

ఉ. బాలుఁడు వెఱ్ఱిబ్రాహ్మణుఁడు । బ్రాహ్మణుకైవడినుంటమాని భూ
పాలురతోడ భూరిజయ । భవ్యులతోడ భయంబుదక్కి క
య్యాలకువచ్చినాడు మన । యందికఁ బాపములేదు లెండు లెం
డేలసహింపభూసురుని । నేయుడువేఁయుఁడు గూల్పుడిమ్మహిన్.

మంత్రిసత్తమా! కార్యము మించివచ్చినది. రమ్ము సంగ్రామరంగమునకేగి సేనల బురికొల్పివత్తము రమ్ము. (నిష్క్రమింతురు.)

ద్వితీయరంగము.

పరశురాముఁడు — కార్తవీర్యుఁడు.

పర — ఓరోరీ! క్షత్రియకులాధమా! పరమనిష్ఠాగరిష్ఠమై తపమాచరించుచు గాలయాపన మొనరించుచున్న విప్రులధనంబు లపహరింప నెంచితే దుర్మతీ రమ్ము నిన్నీ భీమసంగ్రామంబున కథావశేషునిగా నొనర్చి నీతోడివారలకు బుద్ధిజెప్పెద.

కార్త—వెఱ్ఱిబ్రాహ్మణుఁడా! యూరక యేల వదరెదవు. రణమున ప్రతిఘటించి నిలచి నన్ను నిర్జింపజాలువాఁడు లేఁడు.

పర—ఏమా! గర్వము- శాపచాపబలంబులుగల్గిన భూసురులె నిన్ను సమయింపగలరు దుర్మతి యింతగర్వంబుగల నిన్నూరక విడువరాదు.

కార్త— మేటిబలుఁడగు- త్రిలోకభువనంబుల నుత్తలబడజేసిన- మా విప్రుఁడగు పంక్తికంధరుని యవస్థ నేమయ్యెనో వింటివా! పెక్కువత్సరంబులు నాచెరసాలలో నివసించెను. అతనిశక్తి యుక్తులకన్న నధికంబగు శక్తియుక్తులున్న రమ్ము.

గీ. లోకములు మూడుగూడ క । ల్లోలమొంద
జేయపంక్తికంధరుని శి । క్షించినట్టి
జెట్టి నగునన్ను మార్కొను । చేవయున్న
దురమునను నిల్చి జూపుమీ । దోర్బలంబు.

పర—ఛీ! దుర్మతీ! యుద్ధమునకు సిద్ధపడియుండుము. నేఁడు నిన్ను పరేతరాజనిలయంబున కంపినగాని రణరంగమును విడువనొల్లను.

కార్త—పాఱుఁడా! వృథా వదరెదవేల? బ్రాహ్మణుల కుద్భవించి యు- క్షత్రియోచితములగు వీరాలాపముల నీవాడుటఁ జూడ గడుంగడు వింతగానున్నది.

పర—ఓరీ! నృపకీటకాధమా! పూజనీయుల మగు మమ్మెదూలనాడ సాహసించితివా! జన్మముచే బ్రాహ్మణుఁడనై శాపబలంబును ఈశ్వరవరప్రసాదమున క్షాత్రబలంబును బొందియున్నాను. యింకనైనను- నా క్షత్రియోచిత వీరాలాపములకుఁగల కారణమెఱుకబడినెనా!

కార్త—(చిఱునవ్వున) దత్తాత్రేయవరప్రసాదలబ్ధుండైన యీకార్త
వీర్యుని మౌర్వీల నీశాపచాపబలంబులు- పనిజేయజాలవు.

పర—(కోపమున) రేదుర్మతీ! (18)

కార్త—వెఱ్ఱిపారుండా! నీ బెదరింపులకు భీతినొందువారెవ్వరు నిచ్చట
లేరు యుద్ధమునకు సిద్ధపడి- రమ్ము. నీ శాపచాపబలంబుల
మెంటగలపెద.

పర—ఓరీ! నృపకులాధమా! ఇంక కడతేరితివి.

(యుద్ధమొనరింతురు. పరశురాముండు కార్తవీర్యుని బాహువులన్నిటిని
ఖండించి- పిమ్మట నేలగూల్చును.)

పర—దుర్నీతిపరుండగు నీతండు కడతేరెను- ఆవృత్తాంతము జనకున
కెఱింగించి- యాతనికిఁగూడ సంతసమొనగూర్తును.

(నిష్క్రమించును.)

తృతీయరంగము—పర్ణశాల.

(జమదగ్నియు- పరశురాముండును యుండగా తెఱలేచును.)

జమ—కుమారా! ఎంతక్రూరకార్యమొనరించితివి. వర్ణాశ్రమకులా
చారధర్మంబులు దప్పివర్తింపకుండ శాసించి భూవలయంబు
నుబరిపాలించుచు- విపినాంతరాళంబుల పవనపర్ణాంబభక్షులై
వసింపుచున్న- మనబోంట్లకేకీడును బొరయకుండ రక్షించుచు
సౌఖ్యమొనగూర్చుభూపాలుర వధించుటయే తగునని భావిం
తివా?

కం. కలవేల్పు లెల్లదమలోతమ
ఛెలువంబులు దెచ్చి రాజు । జేయుదు రకటా

బలువేల్పురాజు వానిం
జలమున నిల్లలపోయి । జంపితిపుత్రా!

పర—జనకా! క్షమియింపుము. మన సురభిని బలిమినిగొనిపోయెనని యొక్కమునికుమారుఁడు దెల్పినంతనణచుకొనలేనంతటి క్రోధము నన్నావేశించి యాతని వధింపజేసినది.

జమ—కుమారా! క్రోధమే సర్వనాశనమునకు మూలకారణము- క్రోధముగల మానవుడెప్పటికిని స్థిరకీర్తి నార్జింపజాలఁడు. ఓర్పుగలిగి యుండుటవలన సర్వకార్యముల సాధింపవచ్చును. మనబోంట్లకు తాలిమియే ధర్మము.

కం. తాలిమి మనకును ధర్మము
తాలిమిమూలంబు మనకు । ధన్యత్వమునం
దాలిమిగలదని యీశుం
డేలించును బ్రహ్మపదము । నెల్లర మనలన్.

ఇంతియేగాక పద్మాసనంబున గూర్చుండి నిష్ఠాగరిష్ఠుండై తపమాచరించినంత మాత్రముననే మానవుఁడు పుణ్యలోకమునకుఁ బోవజాలఁడు. అరిషడ్వర్గంబుల జిక్కవడక సర్వభూతంబుల సమదృష్టి నరయుచు తనకెవ్వడేని యెగ్గొనర్చినను నోర్చికొని యుండి సన్మార్గంబున నడచునో యాతఁడు పుణ్యలోకమును జేరఁగల్గును.

కం. క్షమ గలిగిన సిరిగలుగును
క్షమగలిగిన వాణిగలుగు । సౌరప్రభయున్
క్షమగలుగుతోన గలుగును
క్షమగలిగిన మెచ్చుశౌరి । సదయుఁడుతండ్రీ.

క్షమగలిగినవానికి సిరిసంపదలు గలుగును క్షమగలిగినవాఁడే జగదీశ్వరుని మెప్పొందఁదగువాఁడు క్షమారహితుఁడవై నీకపకార

మొనర్చువాఁడని పట్టపు రాజును వధించితివి. సర్వశాస్త్ర పారంగతుఁడగు విప్రపుంగవుని వధించుటయే మహాపాతకము బ్రాహ్మణుని జంపిన ఘోరపాపంబుకంటెను భూనాయకుని జంపిన పాపమధికము. గాన కార్తవీర్యార్జునుని జంపిన పాపపరిహారార్థమై తీర్థయాత్రకు వెడలిరమ్ము.

క. పట్టపురాజును జంపుట
కట్టలుకన్ విప్రుజంపు । కంటెను బాపం
బట్టిటనకను నీవీ
చెట్టసెడన్ తీర్థసేవ । సేయుముతనయా!

పర—(జనకునియెదుట మోకరించి) జనకా! క్రోధరసాయత్త చిత్తుడనై యుక్తాయుక్తము లరయనేరక- “నావిష్ణుఃపృథివీపతిః” అను వాక్యమును దలఁపబోవక-స్వయంకృతాపరాధంబున-నేసంపాదించుకొనిన యీమహాపాతకంబునకుఁ దగినప్రాయశ్చిత్తము విధించిరి యీమహాపాతకము నిముస మాత్రమున పటాపంచలై పరువెత్తునట్లొనర్పగల-చక్కని మార్గమొక్కటి యుపదేశించి- యనుగ్రహించిరి. మహాదురిత పంకమధ్యంబున జిక్కుకొని యిటునటు గదలమెదల జాలనిస్థితిలో నున్న నాకు- యిట్టితరణోపాయ ముపదేశించి నన్ననుగ్రహించినందులకివే నాశతసహస్ర వందనములు- ఇంక నాకనుజ్ఞ యిందు యొక్కవత్సరములో పుణ్యానదీనదంబుల స్నానమాడి- పాపకళంకరహితుఁడనై-తమదర్శనమున కరుదెంచెద. ఆశీర్వదించి పంపుడు- బోయివచ్చెద.

జమ—కుమారా పోయిరమ్ము నేనను యనుష్ఠాన మాచరింరుఁబోయెద. (యిరువురును నిష్క్రమింప తెరవాలును)

చతుర్థరంగము.

మృతుఁడైన జమదగ్నిమహామునిపైఁ బడియేడ్చుచు- రేణుక ప్రవేశించియుండగా తెఱలేచును.

రేణు—నాథా! పలుకరేమి? తనుపాదరాజీవములేగతియని నెమ్మది సర్వకాల సర్వావస్థల సంస్మరించుచు-తమకొడిదేలోక మనుకొని-యింకను-పదపద్మసేవ లొనర్పవలయునని యుత్సహించుచున్న నన్నిట్లధోగతి పాలొనర్చి దివికేగితిరా! ఇంకమనము ద్దుఃఖరిలకు దిక్కెవ్వరు?-మన చిన్నికుమారుఁడగు పరశురాము నెవ్వరి కప్పగించిరి-అయ్యో! కడుపుదహించుకొని పోవు న్నదే......అల్లనాఁడు దురాత్ముఁడగు హైహయాధీశ్వరున కొసఁగిన యాతిథ్యఫల మీవిధముగా మనలజుట్టుకొనినదా! పరశురామా! హాపరశురామా! నీవేయున్నయిట్టి యాపద తటస్థించి యుండదుగదా! నీవు కార్తవీర్యుని జంపితివని క్రోధమున-నీవూరలేని తరి మూహైహయులెల్ల గుమిగూడి యిచ్చటికరుదెంచి- తపోనిష్ఠాగరిష్ఠుడై యున్న నీజనకుని వధించినారు-పరశురామా! నాఁడు కార్తవీర్యుని జంపుటగాదు నేఁడు నాకట్టి దుఃఖమొనగూర్చిన వారిని జక్కాడి-సాంతస మొనగూర్పుము...అయ్యో! పరశురాముడేడీ!-ఏడీ! (మూర్ఛిల్లును)

(ప్రవేశము:—పరశురాముఁడు)

పర—(అనుబంధము) నేడేలనోగాని పెక్కుదుర్నిమిత్తములు దోఁచు చున్నవి. ఎట్టివార్త వినవలసివచ్చునోగదా! (ముందుకునడచి రక్తమునుజూచి) ఇదేమి- ఈరక్తప్రవాహమేమి ? (పరికించి) జనకా! (మూర్ఛిల్లును)

రేణు—(మూర్ఛదేరి పరశురాముని గాంచి) తనయా! పరశురామా! వచ్చితివా! (మూర్ఛిల్లును)

పరశు—(మూర్ఛదేరి) అమ్మా!

రేణుక—కుమారా! గంటివా! నీజనకుని యవస్థ నీజనకుని హితులైన హైహయులొనర్చిన యుపకారము. తమతండ్రిని సమరంబున మ్రింది బినంగులకు నీజనకుని వారు తుదముట్టించిరి. వైరీతిచక్ర—శించుచు నాయెదుటనే యిట్టి యకృత్యము నర్చిరి.

పర—(ఉగ్రుడై మండిపడుచు) ఏమేమీ! యర్జునుని పుత్రులా! యిట్టి యకృత్యము నర్చిరి. కానిమ్ము. వారల నెల్ల యీదినంబుననే మట్టుపెట్టెదను. ఓరీ! దురాత్ములారా! మీకు మరణ మాసన్నమైనదని తెలిసికొనుడు. ఒక్క యీ దురాత్ముల నేగాక-నృపాలురు లేకుండునట్లెల్లర వధించి తీరెదను. మద్యమాంసంబుల కుత్తుగబాటిగా మెసవి భోగపరాయణులై దాము దినుచున్నదెల్ల ప్రజలకష్టార్జితమను మాటమరచి యుక్తాయుక్తములు విచారింపని భూపాలురుండిన నేమి? లేకున్న నేమి? ఓరీ! రాజాధములారా! భూమిపై నొక్క మగపురుషునైన లేకుండునట్లొనరించి నాజనకుడు స్వర్గమున కేగుట కనువగు సోపానములుగా మీ శవముల బరచియుంచెదను. అమ్మా యూరడిల్లుము.

గీ. మాటపరుసకు నొకరాజ । మాత్రు డేని
మిగులకుండంగ నెల్లర । మృత్యువాత
ద్రోసి నా జనకునకు సం । తోషమెసగ
తర్పణము జేతు వారి ర । క్తంబుతోడ.

జననీ నాకనుజ్ఞయిమ్ము!

రేణు—కుమారా! నీజనకుడు నన్ను విడచినందులకే చింతించుచున్న నన్ను విడచిపోయెదవా!

పర—అమ్మా! భూపాలురం జక్కాడకున్న నాదుఃఖానలము జల్లారదు.

రేణు—కుమారా! పోయిరమ్మా.

పర—మహాప్రసాదము. (నిష్క్రమించుచుండ తెరవ్రాలును.)

పరశురామావతారము.

పంచమరంగము.

[ప్రవేశము—పరశురాముఁడు.]

పర—మున్ను నాజననితోఁ జేసిన ప్రతిజ్ఞాప్రకార మిరువదొక్కమాఱ్లు ధరావలయంబునఁగల భూపాలురవధించితిని. భూభారముడిపితిని. ఇంక నిచ్చోనే నొనరింపవలసిన కార్యములన్నియు ముగిసినవి. ఇంక నాజనకునకుఁ బుణ్యలోకములు ప్రాప్తించుటకొఱకయాగ మొనరించి నా బాహువిక్రమంబున నార్జించిన యీరాజ్యం బొక్కవిప్రునకొసంగి జనసంపర్క మిసుమంతయు లేని మహేంద్రపర్వతముపైఁ దపం బొనరించుకొనియెద.

(నిష్క్రమించును. తెరవ్రాలును.)

శ్రీ

సంగీత విష్ణులీలలు.

రామావతారము.

పర్ణశాల.

(సీతారామలక్ష్మణులు ప్రవేశించియుండగాఁ దెఱలేచును.)

రాము—అన్నా లక్ష్మణా!

చ. జనకుని యాజ్ఞ మౌళినిడి । స్వాంతమునన్ బెగడొందకుండ యీ
వనములఁ జేరి రక్కసుల । బల్వురఁ జంపి జయంబుగాంచి స
న్మునివరులిచ్చు దీవనలు । మోదముతో గొనినట్టి హర్షమే
మనమున నుండదయ్యె గుణ । మాన్యుఁడు తండ్రి దివంబు జేరుటన్.

ఇంతలోననే యింతయగునని యెన్నఁడైన ననుకొంటిమా!

సీ. పదునాల్గువర్షముల్ । పదునాల్గు నిమిషంబు
లట్లు కాలక్షేప । మమరఁ జేసి
తనకోర్కెలీడేర । ననిమదిలోనకై
కమ్మమిగులసంత । సమ్మునొంద
నిత్యసత్యవ్రత । నియుతాత్ముఁడౌ తండ్రి
ఘనతరానందంబుఁ । గనుచునుండ
ప్రజలెల్లమారామ । భద్రుఁడెంతెంచెమా
భాగ్యమేమనఁ జూడ । వచ్చునుండ

గురువరేణ్యుఁడు సమ్మని । వరులతోడ
వడిగ జనుదెంచి దీవన । లిడుచునుండ
నాపురంబునుఁ జొరనున్న । నాదుకోర్కె
వారిస్వప్నమై పోయెబ్రతుకెందు । కక్కటకట.

సీత — నాథా! మామగా రదృష్టవంతులు. అరువదివేలవత్సరము లఖండవైభవంబుతో భూమండలం బెల్లఁ బరిపాలించి గణింపరాని యశోలక్ష్మి నార్జించి విష్ణ్వంశసంభూతులరగు మిమ్ము పుత్రులుగాఁ బడసి నేటికి విధిప్రేరణముచే దివం బలంకరించిరి. అట్టివారి మరణమునుఁ గూర్చి మనము సంతసింపవలయును. కాని కలిగినసంతానములో నొక్కఁడైన కడదినంబున దగ్గర లేకునికి మాత్రమే గాఢవిషాదమున కెడమిచ్చుచున్నది.

రాము — కల్యాణీ! నీవనినది నిక్కువము. కన్నతండ్రిని పిడికెడు బుగ్గి సేయు నదృష్టము సురదృష్టవంతులమగు మాకు లేకున్న మానె. యీకాలమునకు భరతశత్రుఘ్ను లిరువురుకూడ లేకపోవలయునా?

లక్ష్మ — అగ్రజా! గణించినదాన్కికై వగచుచు గూర్చుండిన మనకు మిగులఁ బ్రమాదము రాఁగలదని శంకించుచున్నాను. కారణమేమందురా! అదుగో యీచాయఁ దిలకింపుఁడు. ఆవచ్చెడి జవ్వని యెవ్వతెయై యుండనోపును. ఇది మహారణ్యముగదా! మానికాంత లీతీరున శృంగారదేవతల పోలె నుండరుగదా! ఇట్టి నవనవాగ్రకోమలు లీప్రాంతమున కెట్లొంటరిగ రాజాలరుగదా! అట్టియెడ నీతరుణీమణి మనమున నెట్టిభయమును లేక యాత్మరక్షణమునకొక యాయుధమైనను లేక యెట్లిచ్చటికి రాఁగలిగియుండును. ఇదేదియో రాక్షసమాయగా నుండనోపునని నాతలంపు.

[ప్రవేశము:—శూర్పణఖ]

శూ—(తనలో) మునులు జెప్పిన రామలక్ష్మణులు వీరై యుందురు. నా కుమారుని దమపొట్టబెట్టుకొని మునిముచ్చులవోలె కూర్చుండిరి. ఈక్షణము వీరలపైఁబడి పచ్చివక్క "కటక్కు" నకొఱికినట్లీ యిరువురఁగొఱికి నాదుఃఖానలముఁనుఁ జల్లార్చుకొనియెదను. (సమీపించి పరికించిచూచి) ఎంతసుందరాకారులు. వీరలఁ జక్కఁడుటకుమారుగా పెక్కు ముద్దులిడుకొనవలయుననుమోహ ముదయించుచున్నది. వీరిలోనొక్కనిఁ జేరదీసితినా—నాజన్మసార్థకమగును. (యింకను సమీపించి) సుకుమారులారా! మీరెవ్వరు.

లక్ష్మ—జవ్వనీ! తండ్రియానతిచే నరణ్యవాసమొనరింపవచ్చిన శ్రీరామచంద్రుఁడతఁడు. నేనాతనితోఁగూడ నరుదెంచి యాతనికి వలయు పరిచర్య సేయుచుందును. నన్ను లక్ష్మణుఁడందురు. నీ వెవ్వతెవు. ఇట్లొంటరిగ నిమ్మహారణ్యంబున నేలదిర్మ్మరుచుంటివి.

శూర్ప—(రామునితో) మారసుకుమారసుందరా! లోకపాలకులమని మేటి బిరుదములఁగన్న యింద్రాదులఁ బెక్కుమార్లు రణరంగమందుఁ జితోస్మియనిపించిన లంకాధినాథుఁడగు రావణుని సోదరిని. ఇంక నావచ్చినపని వినుము. మునులవలన నీవుసుందరుఁడవనివిని నాజన్మము సార్థకపరచుకొనవలయునని యిట్లరుదెంచితిని. నన్నుఁజేబట్టి యాదరింపుము.

తే. వలచివరియించుకొన్న దం। పతులసౌఖ్య
మంతు దరిలేనివారాసి। యట్టులుండు
రసికవరున కేభ్రాసి పే। యసిలభింప
బెరుగు వడ్లనుగలిపిన। విధముదనరు.

నీకీమెతో సహవాసము నేఁజెప్పిన రెండవవిధమున నున్నదిగావున నన్ను జేకొనుము. సతియుండగా నీవేలనంకు వేమో వినుము; యీమెవలన బాధలేకుండ మ్రింగివేసెదను.

సీత — నాథా! యీదుర్మతి సిగ్గుబిడియములవిడచి రాక్షసకృత్యములకు వన్నెబెట్టునట్లుగా మాట్లాడుచున్నది.

రాము — సుందరీ! నీవంతశ్రమపడనేల? నామాట యటుంచుము. ప్రస్తుతము మామఱదలు చెంత లేకునికి గష్టించుచున్న నా తమ్ముఁడగు లక్ష్మణునివరింపుము.

శూ — ఛీ! ఛీ! ఏమంటివి! నిన్ను మనసారవలచి ప్రేమించినకాంతను తృప్తిపరుపలేక పరునియొద్దకుఁ బొమ్మనుచుంటివా! యిది యేనా! నీమగతనము. ఇట్టివాడవగు నీతో నాకేమిపని. (లక్ష్మణునితో) లక్ష్మణా! నీవంగీకరింతువనుము. (సమీపించును.)

లక్ష్మ — (దూరమున కేగి) తాళు. తాళు.

గీ. పెద్దవాడగురాముని । విడచి వారి
దాసు వరియించి దాసివై । దనరగలవె
యతని నగోరి వరియించి । నట్టులైన
వారితో బాటు నీకు సపర్యజేతు.

ఈయంశమును నీమది నాలోచించుకొనుము.

శూ — కొఱమాలిన యొక్కమగపురుషునకై దాసిని కాజాలను. రామా! పెక్కుమాటలేల నన్ను పరిగ్రహింతువా! పరిత్యజింతువా!

రాము — (అపవారించి) సోదరా! యీమెకు బుద్ధిసెప్పుము (ప్రకాశముగ) శూర్పణఖా! నాసోదరుఁడే నీకు సుఖకరమగుమార్గము నుపదేశించును.

శూ—అదే నాకుఁ గావలసినది రమ్మా మార్గము పదేశింపుము.

(శూర్పణఖ లక్ష్మణుఁడు నిష్క్రమింతురు.)

[పునః ప్రవేశము:— లక్ష్మణుఁడు]

లక్ష్మ—అగ్రజా! ఆదురాత్మురాలి ముక్కుచెవులగోసి వికృతాకారిణిఁ జేసివచ్చితిని.

రాము—విరుద్ధపు గోర్కెల గోరువారల కయ్యది తగినశిక్షయే... (తెరలో కలకలము) ఏమాకలకలము (ముందునకుజూచి) పెక్కురు రాక్షసు లరుదెంచుచున్నారు. వారివెంట శూర్పణఖ గూడనున్నట్లున్నదే (జూచి) అగునగును. వీరెల్ల రామెపరాభవమాలించి మనల బరిమార్చుటకై వచ్చుచున్నట్లున్నారు. లక్ష్మణా! ఆబాణాసనమందుకొనుము. నేపోయి వారలరూపుమాపి వచ్చెద. మీవదినెను జాగరూకతతో నరయుచుండుము.

[కార్ముకమందుకొని నిష్క్రమించి రెండవప్రక్కనుండి ప్రవేశించును]

సీత—(ఎదురేగి) నాథా! రాక్షసులెల్లఁ గథావశేషులైరిగదా!

రాము—కొందఱు మాత్రము భీతిల్లి పరువులిడిరి. పెక్కురురక్కసులీభూదేవికి బలియైరి. నాయకులగు ఖరదూషణు లిరువురును మడసిరి.

[తెరలో]

శూ—ఖరదూషణాదులు సులభముగ నీచే వడిరని సంతసించకుము నాసోదరుఁడగు రావణునితోఁ జెప్పి మీకు దగినంత పరాభవమొనర్పక నిద్రింపను. యాహారముఁ గొనను.

లక్ష్మ—ఓసీ! పోవే నీబెదరింపులకు భీతిల్లువా రెవ్వరు!

సీత—ఇయ్యది కారణంబుగ ముందేమేని ప్రమాదములు గలుగునని భీతి జనించుచున్నది.

రాము—కల్యాణీ! భీతిల్లకుము. లక్ష్మణా! కాలోచితకృత్యములఁ దీర్చుకొనుటకు వేళయైనది లోనికేగుదము రండు.

(నిష్క్రమింతురు.)

తెర వ్రాలును.

ద్వితీయరంగము.

పర్ణశాల.

[సీతారాములు ప్రవేశించియుండ తెఱ లేచును.]

రాము.—కల్యాణీ! నీవు నాచెంతనుండుటఁజేసి యరణ్యవాస క్లేశమిసుమంతయుఁ దోపకున్నది. అభ్యాసవశమున నరణ్యావాసమే సుఖముగా నున్నది.

సీత—ఏమిసుఖము. ఎప్పుడేరక్కసుని మూలమున నెట్టియిక్కట్లు వాటిల్లునోయని భీతిల్లుచునే యుందును.

రాము—భీరురాలా! ఈపరిసరమున గల రక్కసులందఱును పరలోకము కేగిరి. మనచేఁ బరాభవింపబడిన శూర్పణఖ యెందో భీతితో నణఁగిమణఁగి యున్నది.

[ప్రవేశము:—లక్ష్మణుఁడు.]

లక్ష్మ—అగ్రజా! ఫలపుష్పాదులదెచ్చి పర్ణశాలయందుంచివచ్చితిని.

సీత—నాథా! అల్లదే! అచాయజూడుము. ఆబంగారులేడిని- అదే "చంగుచంగు" మని యాలతాకుంజముచెంగట దాటుచున్నది. అయ్యది నాచెంగట నున్న జెలికత్తియలు లేనిలోపము దీరగలదు. అద్దానిని దెచ్చి యొసంగరా? (19)

రాము—ప్రియా! అట్లైన గొనివచ్చెద.

లక్ష్మ—అగ్రజా! వలదువలదు! ఎక్కడనైన బంగారులేడి యుండు నా! మనల మోసగింప నెవ్వఁడో యీరూపమున వచ్చి యుండనోపునని యూహించుచున్నాఁడను.

రాము—లక్ష్మణా! నీవనినట్లుగా రక్కసుఁడైనఁ బరిమార్చెద లేకు న్నభూజాతకోర్కెఁ దీర్చెద రెండును మన కవశ్యాచరణీ యములేగదా! మీావదినెను జాగరూకతో జూచుచుండుము. పోయివచ్చెద. (నిష్క్రమించును.)

సీత—(రాముని పరికించునట్టుల నటించుచు) ఆపసిడిమృగమును బ ట్టుకొనుటకై యెంతశ్రమ పడుచుండిరి...అయ్యయ్యో! నిష్కా రణముగా నాథుని నలయించిన దాననైతినే?........ఏమిది- లేడియు మీాయన్నగారుఁ గూడ గాన్పించుటలేదు. లక్ష్మణా! పరికించుము.

(తెరలో) లక్ష్మణా! రమ్ము! రమ్ము!!

సీత—(భయకంపితయై) లక్ష్మణా! వింటివా! మీాయన్నగారి యా ర్తనాదము. త్వరితముగా నాతనికి సహాయమొనరింపఁ బొ మ్ము, కదలుము. ఇంకను నిచ్చటనే యుంటివా?

లక్ష్మ—అమ్మా! జగదేకపూజ్యుండగు శ్రీరామచంద్రునకెన్నఁడైన నాపద కలుగునే- జననీ! సందేహింతువే? అన్నగారి పరాక్ర మమిావుమాత్రమెఱుఁగవా? అంతియెగాక- ఆయార్తారప ము సోదరునిదైనట్లు దోపదు. రక్కసుఁడెవ్వఁడో యట్టులరచి యుండును.

సీత—నిన్నటిదనుక నామాటలు శిరసావహించు నీవు- నేడేల నా పల్కులయెడ నాదరముంపకుంటివి. కష్టదశయందున్న యగ్ర జుని యార్తనాద మాలించియు పోకున్న నినుజూడ నేడు

నీకెద్దియో విపరీతబుద్ధి బుట్టియున్నదని తోచుచున్నది......
(ఆలోచించి) తెలిసెను నీమర్మాగ్రపుటాలోచనము- రాముడు
పరలోకమున కేగిన నన్నుపరిగ్రహింపవలయుననిదలంచితివా!
దుర్మతీ! జీవనమునైన విడతునుగాని నీకుమాత్రము వశ్య
రాలనుగాను......ఎక్కడిసోదరులు- ఒక్కసోదరుడు రాజ్యమ
పహరించెను. వేరొక్కడు భార్యనపహరింప దలచుచున్నాడను.

లక్ష్మ—జననీ! కఠోరవాక్యములాడెదవేల? అన్నయానతినతిక్రమించి
వర్తింపభీతిల్లుచుంటిని. నిన్నిచ్చట నొంటరిగా దిగవిడిచి చనిన
నేయాపదయైన కల్గునేమోయని భీతిల్లుచుంటిని. కాని-నీకఠో
రవాక్యముల విని సహింపజాలకుంటిని- జాగరూకతతో నుం
డుము. పోయివచ్చెదను. (నిష్క్రమించును.)

[ప్రవేశము:—రావణుడు.]

రావ—(తనలో) ఏమీ లతాతన్వీసౌందర్యము. ఇట్టి త్రిజగన్మోహిని
నెందును జూచియుండలేదు- ఈమెను నాయర్ధాంగిగాఁ జేసి
కొనిన నాజన్మ సార్ధకమగును. (20)

సీత—మునీంద్రా! నమస్కారము.

రావ—మనోవాంఛఫలసిద్ధిరస్తు లతామణీ నీ పేరెవ్వరు- నీ నాథుఁ
డెవ్వఁడు. నీసుందరాకార, బీకుడవి పాల్జేయుచుంటివేల?

సీత—మునీంద్రా! మామామగారగు దశరథేశ్వరుని పంపున నర
ణ్యావాస మొనరింపవచ్చిన నాపతితో నరుదెంచితిని. నావి
భుఁడును- మఱిదియు నరణ్యాగ్నుల కేగిరి వారిరువురును కొల
దికాలంబున నరుదెంచి నీగురీతిని సత్కరింతురు అంతవఱకీ
యాసనమున గూర్చుండుడు.

రావ—తరుణీమణీ! నీవృత్తాంత మెఱింగించితివి నింక నావృత్తాంతముఁ

గూడ వినుము కమలభవుండు నాపితామహుండు. జగద్విశ్రు తుఁడగు విశ్రవసుండు నాజనకుఁడు. స్వర్ణవికారమైన లంకా పురంబు నివాసము. ముల్లోకంబు లొక్క పెట్టున నాక్రమింప జాలిన దైత్యవల్లభుఁడను రావణుఁడనువాఁడను. ఇంక నావచ్చి న పనివినుము లోకంబులనెల్ల నీవు చక్కని దానవని శూర్ప ణఖచే విని. విరహాభరంబున ధైర్యంబుడిల్లవోవ మన్మథప్రేరి తుఁడనై యిట్లరుదెంచితిని-నన్ను జేకొనుము-లంకారాజ్యము నకు నిన్నధికారిణిగా నొనర్చినీకనుసన్నల మెలగుచుండెదను.

సీత—ఛీ దురాత్మా! యించుకతాళుము నా విభుఁ డరుదెంచినంత నే నిను జక్కాడి ముక్తికాంతను నీ కర్పింతును. (21)

రావ—తన్వీమణీ! నీవంగీకరింపకున్న బలిమినైన గొనిపోయెదను. ఇంతకును నీవు నా నిజరూపమును జూడకుండుటచే నట్లను చుంటివి. ఇదే చూడుము నా నిజరూపము. (అని నిజరూపము దాల్చును.)

సీత—రామభద్రా! హారామభద్రా! (మూర్ఛిల్లును.)

తృతీయరంగము—యుద్ధభూమి.

[ప్రవేశము అంగదుఁడు.]

అంగదు—శ్రీరామచంద్రుని బాహువిక్రమము వర్ణింప నెవ్వనితరము. ముల్లోకంబుల నొక్క పెట్టున నిర్మూలింపజాలిన బలుఁడగు కుం భకర్ణుని నొక్కనిముషమున గూలనేసెను. అతికాయుం డాది గాగల వీరులెల్లరును గతించుటచేతను కుంభకర్ణుఁడు కుంభినిపై గూలుటచేతను రావణుడిప్పుడు ఱెక్కలు తెగినపక్షివోలె నిస్స హాయుఁడై యున్నాఁడు. ఇట్లైనను వెనుకంజయిడక యింకను

మాశ్రీరామభద్రుని జయింపవలయుననియే యద్దురాత్ముఁడు యత్నించుచున్నాఁడు. అతని పట్టుదల కెంతయును మెచ్చ వచ్చును.

(తెరలో) అంగదా ! ఎచ్చటనున్నావు

అంగ—విభీషణా ! ఇటురమ్ము !

[ప్రవేశము విభీషణుఁడు.]

అంగ—విభీషణా ! విశేషములేమి? నాకొఱకై వెతకుచుంటివేల ?

విభీ—ఓయీ ! కార్యము మించివచ్చుచున్నది. శుక్రానుమతంబున నాసోదరుం డిప్పుడు పాతాళహోమ మాచరించుచున్నాడఁట. అయ్యది నిర్విఘ్నముగా నెఱవేరిన నాతని జయించుట దుర్ఘటము మన మెట్లైన నద్దానికి విఘ్న మాపాదింపవలెను.

అంగ—సిద్ధముగా నుంటిని. కాని కార్యసాధనోపాయము దోచుట లేదు.

విభీ—గొప్పపరాభవమును జూచినగాని యాతఁడు నిష్ఠనుండి లేవజాలడు. కావున నీవాతని యంతఃపురంబునకుఁబోయి యాతనిభార్యనుచెఱగొని యాతని యెదుటఁ బరాభవింపగడగుము.

అంగ—పాపము శమించుగాక. పాపము శమించుగాక. విభీషణా ! నన్నిట్టి నీచకార్యమున కేలనియోగించెదవు.

విభీ—అంగదా ! నిన్నట్టి నీచకార్యములకు నియోగింతునా ! ఇందొక్క రహస్యమున్న దాలింపుము. నీవు వాలికి మండోదరియం దఁబుట్టితివి కావున నీవామెనంటిన దోషములేదు. అందునను పరమాత్మస్వరూపుఁ డగుశ్రీరామకార్యార్థ మెట్టిపనియైన యొనరింపవలయును. ఇంతకును మరొక్క డీకార్యమును నిర్వహింపఁజాలఁడు.

అంగ—మంచిది అవశ్య మాతని హోమమునకు విఘ్నమాపాదించి వచ్చెదను.

విభీ—రమ్ము ! శ్రీరామచంద్రునికడ ననుజ్ఞగొని తత్కార్యమును సాధింపబోవచ్చును. (నిష్క్రమింతురు.)

తెర వ్రాలును.

తురీయరంగము.

[రావణుఁడు దీక్షతో హోమముజేయుచుండగా మండోదరి నీడ్చుచు నంగదుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

అంగ—ఓస క్తంచరాధమా ! అమితబలుఁ డగుసోదరుఁడు వడినను శౌర్యశాలియగు సుతుండు గూలినను మూలబలంబులెల్ల నాశనమైనను పట్టుదలవీడక నిట్లింకను హోమమాచరించుచుంటివేల? ఆప్తులను బంధులను సుతులను గోలుపోయి జనశూన్యమగు రాజ్యము నింకను పరిపాలింపవలయునని దలఁచితివా? యిదే చూడుము.

గీ. మున్ను శ్రీరాము నెటులనో । మోసగించి
యవనిజాతను గైకొంటి । వంతెగాని
నేడు బాహువిక్రమమున । నీదుసతిని
బట్టితెచ్చితి చూడుమో । పంక్తికంఠ.

మాయాకృత్యవిశారదుండైన మారీచు సహాయమున భూజాతను దొంగిలించి తెచ్చితివి గాని నేను నీభటులెల్ల మాఁన్పడి చూచుచుండ బాహుబలంబున గొనివచ్చితిని. పరాక్రమమున్న బలమున్న శౌర్యమున్న రమ్ము నాతో బోరానర్చి నీభార్యను సంరక్షించుకొనుము. రమ్ము త్వరపడుము. నిజభార్యను సంర

క్షించుకొననేరని నీకీపాతాళహోమ మెందులకు. పరకాంతా కర్షణ ప్రియత్నమెందులకు లెమ్ము.

మండో—ప్రాణేశ్వరా! నిశ్చింతమై యొక్క వనచరుండు నీభార్యను పరాభవించుచుండ చూచుచు నూరకుందువా? అప్రయోజకునివలెనీ నీభార్య నొరులు గొనిపోయి పరాభవించుచుండ నూరకుందువా? పగవానిచేబడిన నాదెస చూడవేల? వీనినేల వధింపవు. కొరవిచే తలగోకగొనినట్లు సీతామహాసాధ్విని గొని తెచ్చితివి లంక కిట్టిచేటొనగూర్చితివి. కుమారుని సోదరుని జంపుకొంటివి. నిజభార్యాపరాభవమును కండ్లారగాంచుచుంటివి—జీవితేశ్వరా! యిట్లూరకుండుట నీకుదగునా?

రావ—(తనలో) సర్వనాశనమైనది. (లేచి ప్రకాశముగ) దురాత్ములారా! చచ్చితి రిదే కాచుకొనుడు. (బాణముల విడచును.)

అంగ—(తనలో) చేయవలసిన కార్యము నిర్విఘ్నముగా ననుకొనిన రీతిగా జరిగినది. (నిష్క్రమించును.)

మం—(సమీపించి) నాథా నాతుదిపల్కు లాలింపుడు. విష్ణుస్వరూపుండగునమ్మహాత్మునితో బోరి జయించుట దుర్లభము. యికనైన నాపల్కులాలించి సీతామహాసాధ్విని రామచంద్రునకర్పింపుము. యాతని శరణువేడుము.

రావ— ప్రియా! నీపల్కులు నాకు రుచింపవు. ఏలనందువా వినుము.

గీ. ఎఱుగుదును నేను రాముండే । హరియటంచు
యతనిచే నాకు చావు స । త్యంబటంచు
పూర్ణముగ నేనెఱింగియే । బోవుచుంటి
ముక్తికాంతను క్షణములో । బొందుకొఱకు.

నాయొనర్చుచున్న యీహోమవిధ్వంసముగూడ నామరణమునే సూ

చింపుచున్నది. గెలిచిన కాంతామణిని గెలువకున్న ముక్తికాంతను వరింపగలను పొమ్ము. నీవు మాకు నీతు లుపదేశింపవలసినకాలము రాలేదు.

మండో—నాథా వలదు. వలదు. హా (మూర్ఛిల్లును.)

రావ—(తనలో) ప్రేమపాశ మిప్పటికి ద్రెంపుకొంటిని. రణభూమికేగెదగాక. (నిష్క్రమించుసు.)

తెర వ్రాలును.

పంచమరంగము—యుద్ధభూమి.

[ప్రవేశము శ్రీరాముఁడు విభీషణుఁడు.]

శ్రీరా—ఓయీ! విభీషణా! ఇదేమియో మాయగానున్నది. ఎన్నిమార్లు ద్రుంచినను శిరంబులు మరల నుద్భవించుచున్నవి.

గీ. తలలు చేతులు ద్రుంచి దో ॥ ర్బలముజూపి
విసివితినిగాని బ్రతిపక్షి ॥ పీసమైన
గాసినొందడు యింకనే ॥ కరణివీని
ద్రుంచుటట్టులో మదిలోన ॥ దోపదయ్యె. .

విభీ—స్వామీ! చతురానన వరప్రసాదమున వీనినాభియందమృతము కుండలాకృతినున్నది. అయ్యది కారణంబున దలలుచేతులు తెగియు మరల నుద్భవించుచున్నవి. కావున నాభిచీల్చుటకు యత్నింపుము.

[ప్రవేశము—రావణుడు.]

రావ—విభీషణా! ఎంతజేసితివి! నారహస్యములన్నియు నెఱింగించితివా? యింటిగుట్టుదెల్పి లంకకు జేటొనగూర్చెదవా? రామా!

ఈశరమును దప్పించుకొనజాలవు. యీయస్త్రమున నీవో
నేనో గూలవలయును. (శరము విడచును.)

రాముడు—(తప్పించుకొని) శరసంధానమన్న సామాన్యముగ నెంచితివా? యింక నాయస్త్రప్రభావమును జూడుము.

మ. చపలత్వంబున డాఁగి హేమమృగముం । సంప్రీతి బుత్తెంచుటో
కపటబ్రాహ్మణమూర్తివై యబలనా । కాంతారమధ్యంబునం
దపలాపించుటయో మదీయశిత ది । వ్యామోఘబాణాగ్ని సం
తపనం బేగతి నోర్చువాఁడవు దురం । తంబెంతయున్ రావణా!

(శరమును విడుచును.)

రావ—శివ-శివ! శి-వ-శి-వ—(చనిపోవును.)

రాము—దుష్టసంహారమైనది. యింక నా రాక కాంక్షించు వారలకు ముదము గలుగఁ జేసెదను. (నిష్క్రమించును.)

తెర వ్రాలును.

శ్రీ

సంగీతవిష్ణులీలలు

కృష్ణావతారము.

ప్రథమరంగము.

[ప్రవేశము—చంపక నీలవేణి రాధ కమల]

రాధ—చంపకా! బాలకృష్ణుని చర్యలన్నియును నద్భుతముగానున్నవి. చంటిపాపఁడై చనుగుడుపవచ్చిన పూతన యసురక్కసి నుక్కడంచెను. తృణావర్తాదుల యమలోకంబున కనిపెను. యీతని చర్యలన్నియునుఁ గడుంగడు జోద్యంబులయ్యెడి.

చంపక—ఇట్టి యమానుషకృత్యంబు లాచరించుటకు జాలిన పూరుషు డెవ్వఁడు ఈతఁడు నిక్కముగా దేవాంశసంభూతుఁడగును.

కమల—అయిననేమి, యింత దుండగీఁడుతనమా!

నీల—దేవాంశసంభూతుఁడని మీకుఁదోచినచో యీయిండ్లగల పాలుపెరుగులన్నియు నాతనికి సమర్పించుఁడు. సామంతులు గనుక మీరట్లుచేయగలరు కాని మాబోంట్లట్లాచరింపలేరుగదా!

కమల—ఓసి నీపాలుపెరుగులు పాడుగాను! గోపబాలురతోఁగూడి-చెప్పుటకు సిగ్గగుపనులగూడ జేయుచున్నాడు. బాలుఁడని

మన్నించి యూరకొందుమన్న యాతని యల్లరిచేష్టలు సహిం
పనీయకున్నవి.

నీల—రమ్మా యశోదమ్మగారివద్దకేగి యాతనికొంటెపనులన్నియును
జెప్పిశిక్షింపఁ జేతము. (తొందరపడి కమలను లాగును)

రాధ—ఏమే! నీకంత తొందర. మేమును- మీతో నరుదెంచెదము.
మాపాలుపెరుగుల నొక్కనాఁడేని మిగుల్చుటలేదు. యీవృ
త్తాంతమా యశోదమ్మతో జెప్పవలయునని యేబయలుదేరితిమి.

కమల—అట్లైన రండు ప్రొద్దుపోవుచున్నది.

చంపక—నడువుడు. (పరిక్రమింపగా తెఱలేచును.)

[ప్రవేశము—యశోద]

య—ఏమే చంపకా! గుంపుగూడి నల్వురును- యిల్లుదెంచిరి- రాక
రాక వచ్చితిరి కూర్చుండుడు.

చం—ఏమున్నది. బాలకృష్ణుని యల్లరిపనులంతకంత కధికమగుచు
న్నవి. పాలుపెరుగుల నొక్కదినమునైన మమ్ముదిననీయఁడు.

నీల—పాలుపెరుగులేకాదు! మీగడ- వెన్న- నేయి- కంటికగుపడనీ
యఁడు- వెన్న దినుచుండ నెవ్వరైనగాంచి యడ్డువచ్చిన- దిట్టి
జిక్కులబెట్టి జిక్కక తనదారిని బోవును.

రాధ--యశోదా! ఏమిచెప్పుదును నీకృష్ణుని చర్యలు.

క. మగువా నీకొమరుఁడు మా
మగవారటుపోవఁజూచి । మంతనమునకుఁ
దగఁజీరిపొందనడిగెను
జగముల మున్నిట్టిశిశువు । చనునంబుజాక్షీ!

కమల—తల్లీ! మీకృష్ణుని దుండగములు వర్ణింప నేరితరము. మాకు
మార్తె జలకము లాడుచుండ నట కేతెంచి సమీపమునను
న్న వలువనుకొని పరుగులిడెను.

క. వేజకతి తప్పిబడెనని
ప్రాబల్యముతోడవచ్చి । భవనము వెనుకన్
మాబిడ్డ జలకమాడఁగ
నీబిడ్డను వలువఁదెచ్చె । నెలతుకతగునే?

చంపక — తల్లీ! ఏమని విన్నవింతురు.

క. వెన్నదినఁగఁ బోడగనిమా
పిన్నదియడ్డంబువచ్చి । పిరిదికిఁదివియన్
జన్నోడసిపట్టిజీరెను
చిన్నికుమారుండె యతఁడు । శీతాంశుముఖీ!

కమ —

క. కమలవ్వి కలిగెనేనిం
గుమతురు గట్టుదుమగాక । గోపకులనగుచున్
బమగుల వాడలపైఁ బడ
విమతురె రాకాంత లెందు । విమలేందుముఖీ!

యశో — ఏమేమో! మావానిమీద నేరములు జెప్పెదరు. కాని నాకుమారుడెప్పుడును నిట్టియల్లరి చిల్లరిపనులకుఁ బోవఁడు. మాకృష్ణుఁడునన్ను విడచి యొక్కనిముషమైన నుండఁడు.

తే. గీ. అన్యమెఱుఁగఁడు తనయింత । నాకుచూపు
మంచివాఁడీతఁ డెగ్గులు । మానరమ్మ
రామలార త్రిలోకాభి । రామలార
తల్లులార గుణవతీమ । తల్లులార.

మీరందఱే వచ్చి యిట్లు చెప్పుటచే మీరందఱును గుమిగూడి యాలోచించుకొని యిట్టినేరములు మావానిపై మోపుచుండిరి.

నీల — అమ్మా నిక్కమే వచించెదము. నీవు నీకుమారుని క్రమశిక్ష

లో నుంపకున్న మేమీపురంబున కాపురముండలేము.

క. ఓయమ్మ నీకుమారుఁడు
మాయిండ్లను పాలుపెరుగు ॥ మననీడమ్మా
పోయెద మెక్కడికైనను
మాయన్నల సురభులాన ॥ మంజులవాణీ!

యశో—కమలా! నీలవేణీ! మావానిపై నలుగకుఁడు- కృష్ణునితగు
నట్లు మందలించి బుద్ధిసెప్పెదను యిప్పటికేగుడు.

కమ—మంచిది. (గోపికలు నిష్క్రమింతురు.)

యశో—నాకనులముందటనే యెల్లప్పుడాడుచుండును. అట్టి కృష్ణుఁ
డెట్లు గోపికల నగచాట్లబెట్టియుండును ఏమో! ఏసమయ
ముననో నాకనుగప్పి సందుచేసుకొనిపోయి యల్లరిసేసియుం
డును. లేకున్నచో వారు నాతో నేల యీరీతిజెప్పుదురు.

[ప్రవేశము:—కృష్ణుఁడు, బలరాముఁడు, గోపాలుఁడు]

గోపాలు—అత్తా! చూచేవా! కిట్టయ్యబావేంజేసేడో-

యశోద—యేమిచేసినాడు.

కృష్ణుఁడు—(చెప్పవలదని బెదరించుచున్నాఁడు.)

గోపాలు—అదుగో! అదుగో! చెప్పితే కొడతానంటున్నాఁడు నేను
చెప్పను- నీవు లేనప్పుడు నన్ను చావగొడతాడు-

యశో—బలరామా! నీవుజెప్పుము.

గోపా—నేనే చెప్పుతాను. మేమాడుకుంటూయుండగానే- యొకచోట
పెద్దకొయ్యతీసి- మన్నుముద్దలు ముద్దలుగాఁ దీసికొని—

కృ—(బెదరించును.)

గో—నీబెదరింపులకు- నాకు భయములేదు. అత్తా! చెప్పితే నమ్ము
తావోలేదో అమట్టిముద్దలు- గుటకు. గుటకు- మింగేశాడు

వద్దువద్దంటే నామాటవినక నన్నుతిట్టి మన్నంటే నాకిష్టమని యింకా పెద్దముద్దలుతీసి మింగేడు.

యశో— బలరామా! నీవాతని వారింపలేదా!

బల—(తనలో) పరాత్పరునిమహిమ నెఱుఁగువాడెవ్వఁడు. (ప్రకాశముగ) తినవద్దని జెప్పితిని.

యశో—ఏమిరా! కృష్ణా! నీదుండగము లెక్కువయగుచున్నవి. గోపికలందఱును నీపై నేమేమో నేరములజెప్పిపోయిరి. నేడు నీ యన్నయును యీబాలుఁడును మన్నుదినుచుంటివని జెప్పుచున్నారు. మన్నేల భక్షించెదవు.

క. మన్నేటికి భక్షించెదు
నున్నియమము లేలనీవు । మన్నింపవు నీ
యన్నయు సఖులును జెప్పెద
రన్నా మన్నేలమఱి ప । దార్థములేదే.

కృ— (తల్లిదగ్గరకేగి) అమ్మా! నామాటలాలించుము. నేనెన్నఁడును మన్నుదినలేదు. మన్నుదినుటకు వెఱ్ఱివాఁడనా! వీరిరువురకును నీవు నిన్ననాకు పెట్టినవెన్న పెట్టలేదనుకోపమున నీతో నిట్లు జెప్పుచున్నారు.

యశో—ఏదీ నీవదనము మన్నుదినిన మట్టివాసనయెచ్చటికిఁబోవును.

కృ— శా. అమ్మామన్నుదినంగనే శిశువునో । యాఁకొంటినో వెఱ్ఱినో
సమ్మంబజూడకు వీరిమాటలు మదిన్ । నన్నీవుకొట్టంగ వీ
రిమ్మార్గంబుఘటించిచెప్పెదరుకా । దేనిన్ మదీయాస్యగం
ధమ్మాఘ్రాణముసేసి నావచనముల్ । దప్పైనదండింపవే.

యశో—(తనలో) ఇదేమి- యీతనివక్త్రమునందు సమస్తలోకంబులును బ్రహ్మవిష్ణుమహేశ్వరులును సప్తమహాఋషులును కులపర్వతంబులును- యిదియదియననేల? సకలచరాచర భూతం

బులతో నిండియున్న యీజగంబెల్లను గాన్పించుచున్నది. అదే నేను నానాథుఁడు గోవులుగోపికలుగూడ యీతనిముఖంబున నే యున్నారము. ఇట్టిమహామహుఁడు కేవలము బాలుఁడని దలంపరాదు. సర్వవ్యాపియగు నాశ్రీమహావిష్ణు వీరూపంబున నవతరించియుండెను.

(42 అనుబంధము.)

ఆ. వె. ఏమహాత్మువలన । నీవిశ్వరూపంబు
గానఁబడియె బుద్ధి । కంపమయ్యె
నామహాత్మువిష్ణు । నఖిలలోకాధారు
నార్తులెల్లబాయ । నాశ్రయింతు.

కృ—(తనలో) ఈమహాసాధ్వి నన్నుపరమేశ్వరునిగా దలంచుచు-తనకుమారుఁడనుట మరచినది. యోగమాయాప్రభావమున నీమెను భక్తిమార్గమునుండి మరల్పవలయును. (అట్లొనర్చును)

యశో—కృష్ణా! నీవు మన్నుదినలేదు నీయన్నయు నీగోపాలుఁడను కల్లలాడుచుండిరి. రండు మీకన్నము బెట్టెద. (నిష్క్రమింతురు.)

తెరవ్రాలును.

ద్వితీయరంగము.

[ప్రవేశము:—యశోద]

యశోద—కృష్ణుని దుండగములు మేరమీరుచున్నవి. ఈకుర్రని చేష్ట లన్నియును సహింపరాకున్నవి.

సీ. బాలుఁడీతండని । భావింతునందునా
యే పెద్దలును నేర । రీక్రమంబు

వెలిపెలుంగుటకునై । వెలిపిం తునందునా
కలిగితే కొక్కడు । గానిలేదు
వెలుపుతో నాబుద్ధి । వినిపిం తునందునా
తనుదానమైమె బుద్ధి । దప్పకుండు
నోండ్లెఱుఁగక యింట । నుండెడునందునా
జొచ్చిచూడనిదొక । చోటులేదు
తన్ను నెవ్వరైన । దలపోయె బారెడి
యోజలేదుభీతి । యొకటియెఱుఁగ
డెలమినూరకుండ । డెక్కసక్కెముఁలాడు
బట్టిశాస్త్రిసేయు । భంగియెట్లు.

ముద్దుకుమారుఁడని మందలింప కూరకొన్న కొలఁది యాతని యల్లరి పనులధిక మగుచున్నవి. ఉట్టిపై బెట్టియుంచిన వెన్ననంతయు దినివైచి భాండమును బగులగొట్టి పారిపోయెను. ఇట్టితుంటరి యెట్టిపనులనైన జేయగలడు బట్టిశిక్షింపవలయునని యత్నించు చుంటిని. ఇంతలో నా యిఁగిత మెఱిఁగికా బోలు పరువెత్తెను. ఎక్కడికి కేగగలడు. ఈసమీపముననే యెక్కడనో నక్కియుండును. నలుమూలలజూచి అదే! ఆమూలనేమియు నెఱుఁగనివానిపోల్కి గూరుచున్నాడు. పరువున బోయి యాతని బట్టుకొని బంధించి యుంచెదను. (నిష్క్రమించును.)

[ప్రవేశము:— కృష్ణుఁడు రోలీడ్చుకొనుచు.]

కృ—ఎంతయో విశ్వప్రయత్న మొనరించినను బట్టుకొని యారోటను బంధించెను. ఎవ్వరిచేతను బంధింపబడనినేను- నేటికీమెచే యారోటికి బంధింపబడవలసి వచ్చినది. కానిమ్ము- యిప్పుడు మద్దివృక్షములైఁ బడియుఁడి నారాకకై నిరీక్షించుచున్న నలకూబరమణిగ్రీవులకు శాపవిమోచనం బొనరించెదను.

[మద్దిచెట్లమధ్యనుంచి రోలీడ్చును. చెట్లుకూలిపోవును చెట్ల
నుండి నలకూబర మణిగ్రీవు లుద్భవింతురు.]

నల—శ్రీకృష్ణా!

కం. భువనములు సేయఁగావఁగ
నవతీర్ణుఁడవైతి కాదె । యఖిలేశ్వరయో
గివరేణ్య విశ్వమంగళ
కవిసన్నుత వాసుదేవ । కల్యాణనిధీ!

మణి—ఓ దేవదేవా!

శా. నీపద్యావళు లాలకించుచెవులున్ । నిన్నాడువాక్యంబులున్
నీపేరన్ బనిసేయుహస్తయుగమున్ । నీమూర్తిపైఁజూపులున్
నీపాదాబుల పొంత మ్రొక్కు శిరముల్ । నీసేవపైఁ జిత్తముల్
నీపైబుద్ధులు మాకునిమ్ముకరుణన్ । నీరేజపత్రేక్షణా!

శ్రీకృష్ణ — నలకూబరమణిగ్రీవులారా! నారాక కాంక్షింపుచు నన్నే
మీమానసమునందు ప్రార్థించుచునుండుటంజేసియు నాదర్శనమగు
టచేతను మీరు కృతార్థులైరి.

క. తమతమ ధర్మముదప్పక
సములైనను నమ్మిలిరుగు । సభ్యులకును బం
ధమునను జూడగవిరియును
గములాప్తుఁడు వెడలవిరియు । ఘనతమము క్రియన్.

యింక మీరు మీలోకంబున కేగుడు.

మణి- నల—మహాప్రసాదము. (నిష్క్రమింతురు.)

[ప్రవేశము — నందాదులు.]

గొల్లఁడు—మద్దిచెట్లు గూలినవి- (కృష్ణుని సమీపించి బాధనము లూ
డ్చి.) బాబూ నీకేమియు దెబ్బతగుల లేదుగదా! దైవమా
యచే నిప్పటికి మనకృష్ణునికిసుమంతయు నొగ్గుగలుగలేదు.

నందు—ఇంకనిచ్చోట నుండఁగూడదు. ఎవ్వరోయొకరు మనకృష్ణుని కెగ్గుసేయవలయుననియే దలంచుచుండిరి.

ఉ. ఇక్కడ నుందురే మనుజు । లీమన కృష్ణున కెగ్గుసేయఁగా
రక్కసురాలు జన్నొసఁగె । రాలపయిన్ సుడిగాలివీఁచె బై
కెక్కిరియున్ దరుల్ వడియె । కేశవసత్కృప దప్పె జాలునే
డెక్కడికైన బోవలయు । నింకిటగోపకులార వింటిరే!

2 గొల్లడు—తప్పకుండా పోవాలి.

3 వాడు—నాకు తోచింది సెపుతాసినండి.

క. కసవుగల దిరవుపసులకు
లసదద్రినదీమహీజ । లతికావలిపెం
పెసఁగును గాపురమునకును
బొసఁగును బృందావనంబు । వొందదచ్చటికిన్.

నందు—నీవు చెప్పినది గూడ నాలోచింపవలసినదే. మనగోవులకుఁ గావలసినది కసవు- అయ్యది కొల్లలుగ లభించు స్థలము బృందావనము- గాన నింక సంకోచింపబని లేదు- మారుమాటాడక యచ్చటికేగుటకు ప్రయాణముకండు- (నిష్క్రమింతురు.)

తెర వ్రాలును.

తృతీయరంగము.

బృందావన సమీపారణ్యము.

ప్రవేశము;—బ్రహ్మ.

బ్రహ్మ—ఈతని మహత్వమెద్దియో పరికింపవలయునని గోవులను గోపాలురనుఁగూడ గృహాయందుంచి వైచితిని. ఆగోవులకొఱకై కృష్ణుడు నన్ను జేరి యడుగకమానడు- అదే వెదకుచున్నాడు-

శా. కర్ణాలంబితకాకపక్షములతో । గ్రైవేయహారాళితో
స్వర్ణాభాసితవేత్రదండకముతో । సత్పింఛధామంబుతో
బూర్ణోత్సాహముతో దృతాన్నకబళో । త్ఫుల్లాబ్జహస్తంబుతో
దూర్ణత్వంబున నేగెలేగలకునై । దూరాటవీవీథికిన్.

ప్రచ్ఛన్నముగ నీతని వెంట నాటి యేమిసేయునో బరికించెదగాక.
(నిష్క్రమించును.)

[ప్రవేశము: — కృష్ణుడు.]

కృ — (తనలో) ఎంత వెదకినను గోవులజాడయే గాన్పింపకున్నది. (ఆలోచించి) ఆ - తెలిసినది. చతురాననుండు నాప్రభావ మెఱుంగగోరి గోవులను గోపాలురను దాచినైచెను. మోసమునకుం బ్రతిమోసము బన్నవలెను. నేనే గోగోపకుల రూపంబున వర్తించెదను. (నిష్క్రమించును.)

[పునఃప్రవేశము :— బ్రహ్మ]

బ్రహ్మ — వెరపింపబోయి వెరచివచ్చినది. కృష్ణుని వంచింపదలచి విశ్వ ప్రయత్న మొనర్చి విఫలీకృతమనోరథుండనై యాతనిచే వంచింపబడితి. గోగోపాలురను మాయముచేసిన తానే గోగోపాలుర రూపంబుల ధరించి చరించుచున్నాడు......ఆహా ! ఈతని మహిమార్ణవంబున గాని కూడ యాదిశేషునకైన దరమా. ఈ కృష్ణుని జూచుచు నానందించు యీ గోపాలురే ధన్యులు.

ఉ. ఎన్నడునైన యోగివిభు లెవ్వని । పాద పరాగమింతయున్
గన్నులగానరట్టి హరి । గాగిటం జేర్చుచుం జెట్టంబట్టుచున్
దన్నుచుం గ్రుద్దుచున్ నగుచుం । దన్నుచు బైంబడిగూడియాడుచున్
మన్ననసేయు వల్లవకు । మారుప భాగ్యము లింతయొప్పునే.

అదే కృష్ణుడొంటిగ నందు గూర్చుండెను. నేబోయి యాతనియొద్ద నానేర మొప్పికొని కృతార్థుడ నయ్యెద. (నిష్క్రమించును)

[తెరలేవఁగా కృష్ణుఁడు ప్రవేశించును]

కృ — చతురాననుండు గోగోవుల దాఁచిపెట్టి దాదాపుగా నొక్క-
వత్సర మయ్యెను. ఇంకను నాతనికి నాప్రభావ మెఱుకఁబడి
నట్లుఁ దోఁపదు. (ఎదుటఁజూచి) అదే బ్రహ్మగా రరుదెంచు
చుండిరి.

[ప్రవేశము :— బ్రహ్మ]

బ్రహ్మ — శ్రీమన్నారాయణా ! నానేరమును సైరింపుము. నిన్నె-
ఱుంగలేక నీయెడ మూఢుఁడనై వర్తించితిని. (28)

సీ. శంపాలతికతోడ । జలదంబు కైవడి
మెఱుఁగు టొల్లియతోడ । మేనివాని
గమనీయ మృదులాన్న । కబళ నేత్ర విషాణ
వేణు చిన్నంబుల । వెలయువాని
గుంజావినిర్మిత । కుండలంబులవాని
శిఖిపింఛ వేష్టిత । శిరమువాని
వనపుష్పమాలికా । వ్రాతకంఠమువాని
నలినకోమలచర।ణములవాని
కరుణగడలుకొనిన । కడగంటివాని గో
పాలబాలుభంగి । బరగువాని
నగుమొగంబువాని । ననుగన్నతండ్రిని
నినుభజింతు మ్రొక్కి । నీరజాక్ష.

మ. ననుమన్నించి భవజ్జనంబులకు నా।నందంబు నిండించు నీ
తనురూపంబిదె నామనంబున నచిం।త్యంబయ్యె నీయుల్లస
ద్ఘన విశ్వాకృతి నెవ్వఁడోపు నెఱుఁగ। న్కైవల్యమై యొప్పు నా
త్మనివేద్యంబగు నీకు వైభవమ్ము చం।దం బెట్టిదో యీశ్వరా !

క. తారాతుషారశీకర
భూరజములకైనలెక్క । బుధు లిడుదురు భూ
భారవతీర్ణకరుడగు
నీరమ్యగుణాలి నెన్న । నేరరగణ్యా.

ఓపురాణపూరుషా !

మ. ఒకడై యుంటివి బాలవత్సములలో । నోప్పారితీవంతట౯
సకలోపాసితులౌ చతుర్భుజులునై । సంప్రీతినే గొల్వగా
బ్రికటశ్రీగలవాడవైతి వటుపై । బ్రహ్మాండము౯ జూపి యొ
ల్లక యిట్లొక్కడవైతి నీవివిధరీ । లత్వంబు గంటింగదే.

శా. దేవానీచరణప్రసాదకణ లబ్ధింగాక లేకున్న నెం
డేవెంటంజను నీమహామహిమ నూహింపంగ నెవ్వారికి౯
నీవారైచనువారిలో నొకడనై । నీ౯ గొల్చు భాగ్యంబు నా
కీవే యిప్పటి జన్మమందయిన నొందింపవే సర్వేశ్వరా ! [?]

మ. నిను హింసించిన పూతనాదులకు మి౯ । నీమేటి సంకేత మి
చ్చిన నీకుం బురదారపుత్రగృహ గో । శ్రీప్రాణదేనాదు లె
ల్లను వంచింపకయిచ్చు గోపకులకు౯ । లక్షింపనేమిచ్చెదో
యని సందేహముతోచుచున్నది ప్రపన్నా నీకరత్నామణీ !

లోకేశ్వరా ! భవద్దివ్యపాదారవింద మరందపానప్రమత్త చిత్తుడనై మెలంగునట్లనుగ్రహింపుము.

కృ—చతురాననా ! సంతసించితిని యిందు నీవొనర్చిన దేమియును లేదు. అయినను నీకోరిన వరమిచ్చితిని.

బ్రహ్మ—నారాయణా ! పురాణపూరుషా ! భవద్దర్శనంబున కృతార్థుడనైతిని. సెలవొసంగిన నాలోకంబున కేగెదను.

కృ—మంచిది బోయిరమ్ము.

బ్రహ్మ—(నిష్క్రమించును).

కృ— బ్రహ్మచే దాఁచియుంచఁబడిన గోగోపాలురదే వచ్చుచున్నారు. నామాయ నుపసంహరించి వారల నెదుర్కొందును. (నిష్క్ర)

తురీయరంగము—యమునానది.

[ప్రవేశము :—కృష్ణుడు- కాళీయునిపై తాండవమాడుచు యిరువురు నాగాంగనలు- చెరియొకవైపునను జేరి స్తుతించుచుందురు]

నాగ—దేవదేవా ! అరిషడ్వర్గంబుల జయించి యింద్రియనిగ్రహము గలవారలై మునివృత్తిని కాననంబున మెలంగుచుండెడి యోగీశ్వరులకైన దుర్లభుండవగు నీవు- యీ ఫణీంద్రునిపై నటించుచుంటివి యిట్టి మహద్భాగ్యమెుంద నీఫణి పూర్వ మేమి యొనర్చెనో.

ఉ. ఎట్టి తపంబుసేసెనొకొ । యెట్టి సుకర్మములాచరించెనో
యెట్టి నిజంబువల్కెనొకొ । యీ ఫణిపూర్వభవంబునందు ము
న్నెట్టి మహానుభావులకు । నెన్నడు జేరువగాని నీవు నే
డిట్టి వినోదలీల దల । లెక్కి నటించెద వీ ఫణీంద్రుపై.

ద్వితీయ— కృపాపూర్ణభావా !

మ. బహుకాలంబు దపంబుసేసి వ్రతముల్ । వాటించి కామించి నీ
మహనీయోజ్జ్వల పాదరేణురణ సం । స్పర్శాధికారంబు శ్రీ
మహిళారత్నము తొల్లికాంచెనిదె, నే । మంచేమియుఁ లేక నీ
యహి నీపాదయుగాహతింబడసెనే । డత్యద్భుతం బీశ్వరా !

1 నా—యదుకులభూషణా ! నిజభుజగర్వప్రమత్తచిత్తుండైన మద్విభుడెన్నియో నేరము లొనరించెను. తండ్రీ! కుమారుని తప్పిదముల మన్నించి మంచిమార్గమునకు ద్రిప్పురీతిని మావిభుని సన్మైన మార్గమున బెట్టి మాకుఁ బతిభిక్షపెట్టుము.

సీ. నేరములెన్న నెక్కడివి । నేముదలంచుదలంపుగోపల౯
నేరుపులున్న వే సుతుల । నేరమి తండ్రులు ద్రోచిపుచ్చిరే
నేరముసేయువారి ధర । నీపతు లొక్కొకమాటు గావరే
నేరముగల్గు మద్విభుని । నేఁ డిటు గావఁ గదే కృపానిధే.

2 నా—ఈ కాళీయుఁడు పిన్న నాఁ డనియు పాపకార్యము లాచరింప లేదనియు వక్కాణింపజాలము. అయినను-వైధవ్యమను దుఃఖ సముద్రమున మునుగనోపక నీపదాబ్జంబుల బట్టివేడుచుంటిమి. మాకుంబతిభిక్ష పెట్టి మమ్మనుగ్రహింపుము.

శా. బాలుండీతఁడు మంచివాడనుచుఁ జెప్ప౯ రాము క్రూరుండు దు
ష్షీలుండౌ నవునైననేము సుభగ । స్త్రీబాసి వైధవ్యదు
ష్టాలంకారముబొందనోడెద మనా । థాలాప మాలింపవే
చాలున్నీపద తాడనంబు పతిభి । క్షంబెట్టి రక్షింపవే !.

ప్రి—కమలామనోహరా !

ఆ. వె. మమ్ము పెండ్లిసేయు । మాప్రాణవల్లభు
ప్రాణమిచ్చి కావు । భక్తవరద
నీవుసేయుపెండ్లి । నిత్యంబు భద్రంబు
చిన్ననాటిపెండ్లి । పెండ్లి కాదు.

ఇరువురును—లక్ష్మీకళత్రా ! జోహార్ ! జోహార్ ! (24)

కృ—నాగాంగనలారా ! చింతింపకుఁడు. కాళీయా ! నీ భార్యలపాతి వ్రత్యప్రభావమున రక్షింపఁబడితివి.

కం. గోవర్గముతో మనుజులు
దాపురకరీమడుగు నీరుఁ । దగదిందుండన్
నీవును నీ బాంధవులును
నీవనితలు సతులుజనుడు । నేడంబుధికిన్.

నాపదచిహ్నములఁజూచి గరుడుఁడు నీపై రాకుండును. గావున నిర్భీతి
తో రత్నాకరంబున నివసించి సుఖముండుము పొమ్ము.

కాళీ—మహాప్రసాదము. (తెర వ్రాలును).

పంచమరంగము—బృందావనము.

[అక్రూరుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

అక్రూరు—కంసుని కవసానకాలము సమీపించినది. లేకున్న నిట్టివిప
రీతపు టాలోచనలు పుట్టియుండవు. ధనుర్యాగమను మిషపై
రామకృష్ణుల మధురానగరంబునకు రప్పించి వధింపనెంచి
యున్నాఁడు కాని, పూతన తృణావర్తాది రక్కసుల పెక్కుర
జంపిన యాకృష్ణుని- యాదివ్యపూరుషుని- మర్దింపగలఁడే!
రామకృష్ణులు నిక్కముగ నాతో మధురానగరంబున కరుదెం
చి- కంసుని గర్వమడచి- జక్కాడెదరు...అయిన నాకేల
యీతర్కవితర్కములు నావిధ్యుక్త కార్యమాచరించి- యా
గోపాలకృష్ణుని దర్శించి కృతార్థుఁడనయ్యెద...ఏమో సందియ
ముగానున్నది- దుర్మార్గుడగు కంసునిచే పంపబడినవానినని
దలంచి- నీచునిగాదలంచునో లేక- సర్వభూతాంతర్బహిర్మధ్య
సంగతుల నామూలాగ్రముగా నెఱిఁగినవాఁడగుటఁజేసి- నా
యంతరంగిక భావమును నెఱింగి నన్ను సుజనుఁగాదలఁచి
యాదరించి మన్నించునో... తప్పక యాకృపాసింధులుఁడు
నన్ను సుజనుఁగా దలచి యాదరించును. తనపాదసరసీరుహాం
బుల శిరమిడి నమస్కరించి నన్ను నిక్రృష్ణునిగా దలఁచునంతటి
వాఁ డాతఁడుగాడు.

ఇట్లు తర్క వితర్కములఁ జేయుచు నిచ్చటనే గూరుచుండనేల. శీఘ్రముగ నేగి రామకృష్ణుల దర్శించి వారలకు నావచ్చినపని యెఱిఁగించి మధురాపురమునకు దోడ్కొని పోయెదగాక.

(నిష్క్రమించును).

తెర వ్రాలును.

[ప్రవేశము—కంసుడు]

కంసు—(తనలో) పదివేవురు బాలురనైన నిముషమాత్రమున నుక్కడగింపజాలు కువలయాపీడ మీయిరువురిబాలకులచే పరలోకమున కేగినది. ఎవ్వరు నాయభీష్టము దీర్పఁగిన విక్రమశాలులో యట్టి చాణూరముష్టికులు రామకృష్ణులచే మడసిరి. యింకనీబాలకు జంపుటెట్లు. వీరలనే జంపకున్న నాకు మనశ్శాంతి లభించునా?- వీరలు జీవించియుండ నాకు మనఃశాంతి లభింపదు. నాయీనిశితకరవాలముననే వారల జక్కాడెదగాక.

[ప్రవేశము—కృష్ణుఁడు]

కృ—మామా! ఇంతగున నిందు దాగొనవచ్చితివా! సంగ్రామవిజయులమగు మమ్మభినందించుటకు మారుగా దూషించి యవమానింపనెంచితివా! మమ్ములజంపుమని సైనికుల కాజ్ఞయొసంగితివా! ఎంతశ్రమపడితివి మామా! ఇంతమాత్రపుబనికై సైనికులేల రమ్ము. నీశూరత్వమును జూపుము.

కం—వచ్చితివా! రమ్ము. నీకోరినట్లు నీతో- బోరొనర్చి నిన్నంతకాలయమున కనిపెదను. వెఱగుపడిరా లేదు. యీఖడ్గమును గొనిపోవ నిచ్చటి కరుదెంచితిని. యీఖడ్గముచే నిన్ను వధించి- నాపగ సాధించుకొనియెదను.

కృ—నీఖడ్గము నన్నుఁ దాకజాలదు.

కం—చూడుము. (అని ఖడ్గము నెత్తి వ్రేయబోయి కత్తి కృష్ణుఁడుగా మారుటజూచి, పారవైచి- తనలో) యిదేమి వింతగానున్నది. (ప్రకాశముగా) ఓరీడింభకా! ఖడ్గముచేగాకున్న ముష్టిఘాతముల నినుజంపితీరెదను. (అని దరిజేరఁబోవును).

కృ—మామా! తత్తరింపకుము! యీదేహముతో నీవు నన్ను సమీపింపజాలవు.

కం—ఛీ! వాచాటా! నోరుమూయుము. (ముందునకుజూచి తనలో) నలువంకల కృష్ణుడేగలఁడు- ఎచ్చోటజూచిన నచ్చోటనే కృష్ణుఁడు- గాన్పించుచున్నాఁడు. ఎట్లీతని సమీపింతును.

కృ—గర్వపరిహారమైనదా! నీవద్దకే నరుదెంచి- నన్ను సమీపింపగల సూక్ష్మదేహ మిచ్చెదనుండుము.

కంసు—అక్కడనుంటివా (రెండడుగులు నడచి కృష్ణుని బట్టుకొనపోయి క్రిందపడును).

కృ— శ్రమపడకుము. నీయవసానము సమీపించినది- యింక ముందైన నిట్టి యకృత్యముల నొనరింపకుండుటకై నిన్ను వధించెద. (అని యాతనివక్షముపై గూరుచుండి వధించి) ఇంక రాబోవు మహాభారతయుద్ధమున పెక్కురు దుర్మార్గుల కూల్చి నాయవతారమును సమాప్తినొందించెద. (నిష్క్రమించును.)

తెరవ్రాలును.

శ్రీ

సంగీతవిష్ణులీలలు,

బుద్ధావతారము.

పాలసముద్రము

[ఇంద్రుఁడు- బ్రహ్మ శివుఁడు- నారదుఁడు- మునులు యుండగా తెఱలేచును.]

అందఱు —(25)

[శ్రీమహావిష్ణువు శేషునిపై శయనించియుండును. లక్ష్మి పాదములొత్తుచుండును]

శ్రీమ—సురపుంగవులారా! మానిజనశేఖరులారా! చింతాక్రాంత హృదయులవలె యున్నట్లు జూపట్టుచుంటిరేల?

నార— లోకరక్షకా! ఏమనివిన్నవింతును. నీవెఱుఁగనిదేమున్నది. అయినను మానోటినుండి వినఁదలచితివి- వినుము త్రిపురాసురుల బాధలకు దేవేంద్రాదులెల్లరును తాళలేకున్నారు-

ఇంద్ర—దేవా! స్వర్ణరజిత యయోమయ నిర్మితములగు నాపురములఁ దమయిచ్ఛవచ్చినట్లు ద్రిప్పుచు- త్రిపురాసురులు లోకముల నలయించుచున్నారు.

బ్రహ్మ—మహాయోగిపుంగవుఁడగు మయుని ప్రాపులభించినదనికన్ను మిన్నుగానకున్నారు- వీరల నిప్పట్టున జక్కాడకున్న లోక సంక్షోభము చల్లారునట్లు దోపదు.

శివు—త్రిపురదానవులు వేదమార్గావలంబులగుటచే మాకు దుర్ని రీక్షకులైరి. ఇప్పట్టున మే మొనర్పగల దేమున్నదో గోచట లేదు.

మునులు— నారాయణా! జగద్రక్షకుండవగు నీవిప్పట్టున నుపేక్షచే సిన లోకములన్నియు భస్మీభూతములగును.

ఇంద్రు—దేవాది దేవా!

సీ. మత్స్యరూపమున సో । మకుదుఁ్రంచి యలనాడు
సాౢజదువులను గా । పాడినావు
బ్రహ్మ—కూర్మావతారివై । కుధరంబుమూపున
నిడుకొని సుధనుమా । కిచ్చినావు
శివు—కపటసూకరుఁడవై । కనకాక్షుజక్కాడి
భూదేవినానాఁడు । బ్రోచినావు
ముని—నారసింహుండవై । క్రూరదానవుజంపి
మూడులోకంబుల । బ్రోచినావు
ముని— వామనరూపివై । బలిబలంబునుమాపి
యమరులగాపాడి । యలరినావు
ఇంద్రు— పరశురాముఁడవౌచు । వసుధాధిపులద్రుంచి
ధరణిభారముమాన్పి । దనరినావు
బ్రహ్మ—రామావతారివై । రావణాదులగూల్చి
యెల్లలోకములను । నేలినావు
శివు—వసుదేవుకుర్రివై । పాపాత్ముఁడౌకంసు
ద్రుంచిలోకముల ర । క్షించినావు
ఇం—గీ. పెక్కుమార్లిటు దుష్టుల । నుక్కడంచి
త్రిపురదైత్యులునేడు యీ । రీతిమమ్ము

బాధపెట్టుచుండగాఁ । బరమపురుష
నీకృపాదృష్టి మామీఁద । నిలుపవేల ?

నార — గీ. కామసంచారమొనరించి । భూమిమీఁద
బడినకోఁడనె దేశముల్ । పాడువారి
భస్మమగుచుండె నవలీల । పరమపురుష
యిట్టిపెనువింత గంటిమే । యెచటనైన.

లక్ష్మి — నాథా! ఈరాక్షసాధముల జక్కాడి లోకంబుల జక్కపరుప వలయును.

ఇంద్రు — లక్ష్మీకళత్రా! ఆదానవుల బాధపడలేక మాబోంట్లెల్లరును తల్లడిల్లుచున్నారు.

విష్ణు — మహేంద్రాది బృందారకులారా! త్రిపురంబులవలన లోకములు వ్యాకులపడుట నెఱింగియు సమయమరుదేరకుండుటచే- నెఱుఁగనివానిపగిది నూరకుంటిని. కాలవశమున నన్నియు సమకూడెను. మిమ్ములనుబిలచియీవిషయమై మీతోఁ బ్రసంగింపవలయుననియే దలచుచుంటిని. ఇంతలోననే మీరరుదెంచిరి. త్రిపురనిర్మాతయగు మయుండు- తపశ్శాలి- అణిమాద్యష్టసిద్ధులఁ బొందినవాఁడు, ఆతఁడు తనయోగమహిమకు- తపశ్శక్తికిఁ దోడొనర్చి యీపురత్రితయము నిర్మించెను. అయ్యది కారణంబుగ నీపురంబులకు కామగమనంబు కలిగినది- యింతియెగాక త్రిపురాసురులు వేదమార్గావలంబులు. అట్టియెడ వీరల మట్టుబెట్టు టసాధ్యమని దోచుచున్నది. అస్త్రశస్త్రములు వారల నేమియు చేయజాలవు.

లక్ష్మి — నాథా! అట్లైన యీరాక్షసుల పీడ వదలించుకొనదగు మార్గమే లేదా ?

విష్ణు. — ఉన్నది కాని, యాచరించుట కష్టతమము.

నార—కష్టతమమైనను. కార్యసాధన మైనపిదప సుఖంపవచ్చునను యాశతో యుత్సాహముతో నద్దానిని జేసితీరుదును.

విష్ణు—త్రిపురాసురుల సంహరించుటకు ముందు సిద్ధరసకూపములోని యమృతమును హరింపవలయును. లేకున్నచో వారలు నశింపరు.

ఇంద్రుడు—సిద్ధరసమును హరించు టెట్లు ?

విష్ణు—తారకాసురాదులు వేదమార్గముల బాటింతురుగావున గోవుల హింసింపనొల్లరు. నేనును యీనలినోద్భవుండును గోవత్సక రూపముల నేగి యాసిద్ధరసకూపమునం బ్రమాదవశమునబడి నట్లుబడి సిద్ధరసమును గ్రోలవలయును.

శివు—సిద్ధరస మంతరించినపిమ్మట వారు సులభసాధ్యులగుదురా!

విష్ణు—అంతమాత్రమున నేనా? కష్టతమమింకను ముందున్న దాలింపుడు. తదనంతరంబు నేనా త్రిపురాసురులకు బుద్ధరూపంబున నాస్తికమత మువదేశించి వేదబాహ్యులగునట్లు జేసెద. వారి భార్యల పాతివ్రత్యమహాత్మ్యముచే వారు మరలజీవింపకుండునట్లు జేయుటకై వారిస్త్రీజనంబులకు మానభంగ మొనర్చెదను. ఆపిమ్మట నిరీశ్వరవాదులును నిస్తేజులును యయినపిమ్మట వారల జక్కాడుట సులభము.

శివు—చాల చక్కని యుపాయము.

విష్ణు—ఇంతకే సంతసింపకుండు. వారల రూపుమాపుటకై ధరణిని రథంబుగాం జేసి సూర్యచంద్రుల రథచక్రములుగా జేసి సారథిగ బ్రహ్మను, శరాసనంబుగ మేరువును తూణీరముగ వార్ధితురంగములుగ వేదములను జేసి రథారూఢుండైన యీశంకరుండు నన్నే బాణముగ బ్రయోగించి యాత్రిపురంబుల నొక్కసారిగా గాల్పవలయును ఫాలలోచనుని నేత్రాగ్నిని నారాయణా

స్త్రమునకు ములికగనిడి పృష్ఠభాగంబున చంద్రికళనిడి యా బాణము ప్రయోగింపవలయును. ఫాలలోచనుని నేత్రాగ్నిలేకున్న పురములు భస్మముగాజాలవు చంద్రికళలేకున్న దానవులు మడియరు ఇంతగ్రంథము నడపినగాని యారక్కసులంత మొందరు

శివు — ఎంతకష్టము.

ఇంద్రు — అయినను ఆచరింపవలసియున్నది.

విష్ణు — కార్యసాధనోపాయ మెఱింగిరి గనుక సాధనకై గడంగుడు.

తెరపడును.

ద్వితీయరంగము.

[తారకాక్షుడు కమలాక్షుడు విద్యున్మాలి ఉచితాసనములపై నుండగ దెరలేచును.]

విద్యు — సోదరా! తారకాక్షా! ఇంద్రాదులెల్లరును మనల నెట్లైన ను సంహరింపుమని యాశ్రీహరిని వేడుకొన వైకుంఠంబున కేగిరని యింతకుమున్ను వినియుంటిని.

తార — ఇంద్రాదు లగువారెందరుగూడినను మనల నేమిచేయగలరు?

తే. గీ. కదనమొనరింప సర్వజ । గమ్ములొనసి
మచ్చరంబున వచ్చిన । వచ్చుగాక
సిద్ధరసకూపమునస । మృద్ధిగా ల
భించు పీయూషముండగా । వెఱపదేల?

(తెరలో) దానవసార్వభౌములారా! ఎక్కడినుండియో యొకచక్కని పాడియావరుదెంచి ప్రమాదవశమునబడినట్లు సిద్ధరసకూపంబునందుబడి యమృతమునంతయును గ్రోలివైచెను.

తార — కమలాక్షా! నీవేగి యీసమాచారమును కనుగొనిరమ్ము.

[కమలాక్షుడు నిష్క్రమించి రెండవప్రక్కనుండి ప్రవేశించును.]

కమ — సోదరా! ఒక్కబిందువైనను మిగులలేదు.

తార — ఆశ్చర్యమాశ్చర్యము.

కమ — మరియొక్క విశేషము — కూపరసముతోఁగూడ గోవంతర్ధానమయినది.

విద్యు — అట్లయిననియ్యది శ్రీహరిమాయాకృత్యమయియుండవచ్చును.

[ప్రవేశము — బుద్ధుఁడు.]

బుద్ధు — తారకాక్షా! జయము. జయము.

తార — (తనలో) ముఖలక్షణములు పట్టిచూడ రాజకుమారునివలె నున్నాఁడు. వేషభాషలు పరికింప యోగిపుంగవునివలె నున్నాఁడు. (ప్రకాశముగా) అయ్యా తమరెవ్వరో యెఱుంగఁజేయుదురా.

బుద్ధు — ఓయీ! బుద్ధుండను యోగిని.

కమ — తమ యోగప్రభావమున మాసిద్ధరసము హరించిన దెవ్వరో చెప్పుడు.

బుద్ధు — యింకెవ్వరు మాయాస్వరూపుఁడగుశ్రీహరియే మిమ్ముమోసగించెను. మీప్రవర్తనలబట్టియే మీకిట్టి యనర్థమురుదెంచె.

తార — వేదచోదితపథంబున నడచు మాప్రవర్తన కేమిలోపము.

బుద్ధు — మీలోపముల మీకు చూపెద వినుడు మీరు వెన్నునిదలంపరుగదా.

గీ. విష్ణుచోదితమైనట్టి । వేదచయము
విష్ణుగుణకీర్తనముచేయు । వేదచయము
విష్ణుకైవల్య మొసగెడి । వేదచయము
బోధచేసెడ మార్గాన । పోవనేల.

వేదచోదితమార్గముల చరింపు చుండుటచేతనే యిట్టి యిక్కట్లు సంభవించినవి. ఆమాట యటుంచుము. వేదచోదిత యజ్ఞయాగాదు లొనర్చుటకై నోరులేనిజంతువుల వధించుచున్నారే "అహింసాపరమోధర్మః" అనువాక్యమును మరచి వర్తించుట మీకు దగునా? ముందేదో స్వర్గసుఖములభించునని జంతువుల హింసించుచున్నారుగదా? పాపభీతికి జంకికదా యిట్లొనర్చుట? రాకుసేంద్రా! యిటువినుము స్వర్గసుఖ మెప్పుడో లభించుననుట కల్ల. నరకమున్నదనుట హుళక్కి. నరకమనునది యున్నచో జనులీభూలోకంబున కష్టపడు టేమిటికి? జనులుతా మొనర్చిన పాప మీలోకముననే యనుభవించుచుండగా నరకమెందులకు? గాన నరకములేదు. నరకమే లేనిచో స్వర్గమంతకు మున్నె లేదు. మానవుని భూలోక సౌఖ్య జీవనమే స్వర్గము-యింతకు వేరులేదు. కావున మనకువలయు సౌకర్యము లన్నియును చేకూర్చుకొని భోగపరాయణులైయుంట మేలు.

తార—మీరనునది నిక్కముగా దోచుచున్నది.

బుద్ధ—ఇంక మీచేయు మతిమాలిన పనుల నిరూపించెద చూడుము. మృతినొందినవాని కేమేమియో ప్రత్యాబ్దమున నాబ్దికములు బెట్టుచుందు రేటికి. మీయింట భోక్తలు కుడిచిన వానికి తృప్తికలుగునా? కల్ల! కల్ల! పొరుగూరనున్న మీబంధువునకు భోజనసదుపాయ మమరదని మీయింట నొక బ్రాహ్మణునకు భోజనమిడిన పొరుగూరనున్న మీబంధువున కాకలినివర్తి యగునా? అట్లులే మీరొనర్చు యాబ్దికక్రియలవలన మృతునికి సంతృప్తికాజాలదు.

తార—అయిన మమ్మిప్పు డేమిచేయుమనియెదరు.

బుద్ధు—వేదచోదిత కర్మల విసర్జించి హింసయొనర్పక ముక్తిమార్గ
మును సాధించుటకు యత్నింపుడు.

మువ్వురును—తమపాదములానతమశిష్యులమైతమరుపదేశించినయట్లు
వర్తింపుచు యీమతముమాపురంబుల వ్యాపింపచేయుదుము.

బుద్ధ—అట్లయిన నాతోరండు.

తార—మహాప్రసాదము. (నిష్క్రమింతురు.)

తృతీయరంగము.

(ప్రవేశము— బుద్ధుఁడు.)

బుద్ధుఁడు—తారకాసురాదులదరిజేరి వారికెట్టులో నిరీశ్వరమత ముప
దేశించి వారును- వారిప్రజలును- వేదబాహ్యు లగునట్లొన
రించితిని. వారిభార్యలచెంత కేగి. వారలకుగూడ బౌద్ధమత
ముపదేశించి సంతాన ప్రాప్తికై గౌరీపూజమాని ఋతుస్నాత
లై రావిమొక్కల కౌగలించుకొనవలయునని జెప్పితిని. నా
యందుగల నమ్మకము పెంపున వారట్లొనరింపగలరు. నేనయూ
రావిమొక్కల రూపుదాల్చి వారికి మానభంగమొనరించెద.
పాతివ్రత్యము భస్మీపటలమైన పిమ్మట వీరుగూడ నాథులతో
డనే యంతమొందగలరు. ఇంక నేనేగి తత్ప్రయత్నములో
నుండెద. (నిష్క్రమించును.)

తురీయరంగము.

[రుద్రుఁడు రథిమైయుండ నిరుపార్శ్వముల మునులు
దేవతలు యిందుఁడునిలచియుండ తెఱతేచును.]

రు—ఇదే! తారకాసురుల సంహరించుటకై - త్రిపురముల భస్మమొ

సరించుటకై నారాయణాస్త్రమును బ్రయోగించెద. (శరము విడచును.) (తెరలో పెద్దధ్వని)

మునులు—జయము. జయము. (9)

ఇంద్రుడు—అదే శ్రీమహావిష్ణువు బుద్ధావతారరూపంబున నిట్లరుదెంచుచున్నాడు.

[ప్రవేశము – బుద్ధుడు.]

అందఱు—బుద్ధయోగీశ్వరునకు జయ్.

బు—జగదీశ్వరా! భవదీయకరుణాకటాక్షముచే కాదె నీయసురులెల్ల గూలిరి.

రు—ఇయ్యది నీప్రభావమునగాదే! నేనిందు నిమిత్తమాత్రుడనైతి. లీలామానుషవిగ్రహుండవగు నీవు పైనుండి మాచే నిట్లాడించి వినోదించుచుంటివి.

బుద్ధు—ఇంద్రా! లోకకంటకులగు తారకాసురులు తమపురంబులతో గూడ వశించిరి. ఇంక నిచ్చోట గూర్చుండి గతించినదానిని గూర్చి తర్కవితర్కముల జేయుటెందులకు. రండు. మనరాక కెదురుజూచుచున్న యికు రపురవాసుల కీశుభవర్తమాన మెఱిగింతము.

(అని నిష్క్రమింతురు.)

తెర వ్రాలును.

గద్యము. ఇది శ్రీ రమారమణ చరణసేవాతత్పర హారితస గోత్రపవిత్ర మద్దూరివంశ లతాంకూర నరసమాంబా సోమనార్యపుత్ర శ్రీ రామమూర్తి నామధేయ ప్రణీతంబైన సంగీత విష్ణులీలలు సర్వమును సంపూర్ణము.

అనుబంధములు.

(1) సురటరాగము-ఆటతాళము.

సత్య—ఓహో! - నా - జన్మ ధన్య - మయ్యె॥ నో హో॥
అ॥ ప॥ ఈ విరాట్స్వరూపుసేవ - లభించుటచే॥ నోహో॥

చ॥ 1 వరమునిపాలుని - పావనచరితుని
స్థిరమతిగొలిచెడి - ప్రాప్తిలభించె॥ నోహో॥
2 పతితపావనుని - భక్తపోషణుని
సందర్శనమది - దొరకుటచే॥ నో హో॥

(2) శంకరాభరణరాగము—ఏకతాళము.

అందఱు—పాహి - పాహి - వరదా!
పాహి - పాహి - ముకుందా! ॥ పాహి॥
1 కరుణగనవె - మనవివినవె - దయనుబ్రోవరే
పరమపురుష - పాపవిమోచన - భక్తసుపోషణరావా॥ పా॥
మునీంద్రవాస - శ్రీపతీ
పాహి - పాహి - కరుణింపవె - సద్దయ॥ పాహి॥

(3) వ అనుబంధము.

అందఱు—పాహి - భవభంజనా! - పాపవిమోచనా॥ పాహి॥
దేవ—మంధరపర్వతమ - మందగతినీ
పాదోరాశినిమునిఁగి - పోకుండఁగగావవె॥ పాహి! ॥
రాక్ష—సామిమిముగొల్తుము - మనసారగ
సింహమహిమజూపి - యిచ్చోడమముగావవె॥ పాహి॥
అందఱు—రావే - దీనదయాకర - మాంపాహి - పాహి
యనివేడెడి మామొఱవిని - కనికరమున॥ పాహి॥

(4) కళ్యాణిరాగము — ఆదితాళము.

ఇంద్ర—1 దయజూడుమా - రమాధవా - ఆ...ఆ......దయ॥
సమయంబిదె నీ - యనుగ్రహము మాపైనిల్పంగ॥ దయ॥
2 బలవంతులు యీ - పలలాశినులగుటన్
హరియించిరి పీ - యూషంబయ్యో దిక్కు లేదు॥ దయ॥
3 కష్టించిన మా - కష్టమువృథయయ్యెగా
సృష్టిస్థితిలయకారక - చేరిమమ్ము గాపాడుమా॥ దయ॥

(5) లతాంగిరాగము—త్రిపుటతాళము.

బలి — ఈ—లతాంగి తను - సోయగము
శీతాంశుని బురడించును - మది
కెంతో మోదము నించును॥ ఈ॥
చాలసౌఖ్య మొదవగా - సంతోషము మదిహెచ్చగా॥ ఈ॥
ఈసుధారసంబునకు తోడి - మధురసుధారస పానముజేసెడి
ప్రాప్తిలభించిన - చాలదే - జన్మము ధన్యముగాదే॥ ఈ॥

(6) పూరీకళ్యాణిరాగము—జంపితాళము.

బలి — లెండు లెండు రండు రండు భండనమున
మొండిసురలను - గుండపిండి - జేయుటకై వడివడి॥ లెండు॥
కరుణింపక - దురమందున - శరణన్నను - సురల బట్టి
పీచమణచి - పీయూషము హరియింపగ - కడుముదమున॥ లెం॥

(7) ధన్యాసిరాగము—ఏకతాళము.

నార—దేవదేవ - వాసుదేవ - శ్రీధవా! ॥దేవ॥
శుభములొసంగి నీ - భక్తుల-గాపాడుము దయతోడుంత॥ దేవ॥
సకలనిగమ స- న్నుతగుణశీలా-సాదరమున-మము సాకుము-
నీ మహామహిమజూపి - నిగమాంతక -
వేదవేద్య - నిర్గుణరూపా॥ దేవ॥

(8) 7వ అనుబంధమే పాడవలయును.

(9) భైరవిరాగము—రూపకతాళము.

నారద—జయ - జయ - శ్రీలోలా
జయ - జయ - కరుణాలవాల -
శుభగశీల - సుజనలోలా - ఆ-ఆ। జయ॥
మునిజనమందార - కరుణింపుము మమ్మందఱ
నిఖిలలోకసంవేద్య - నిగమాంతవేద్య॥ జయ॥

(10) జంఝూటిరాగము—ఏకతాళము.

ప్రహ్లా—హరిభజనమే - ముక్తిసాధనము॥ హరి॥
అండపిండబ్రహ్మాండమెల్ల
నిండి వెలిగెండి యాశ్రీహరి॥ హరి॥
చిన్మయరూపుని - సేవలభించిన
మత్సర - మద - మోహామమత లడంచెడి॥ హరి॥

(11) ముఖారిరాగము— ఏకతాళము.

లీలా—నాథా! మనముద్దుసుతుఁడు కాదా?
వానియెడలప్రేమలేదా? దయరాదా? ॥ నాథా॥
తల్లి ప్రాణముగఁటఁ - యిటు తల్లడించుచుంటి
నాయెడలప్రేమలేదా - ననుబట్టిపీని
గావరాదా? - దయరాదా? ॥ నాథా॥

(12) శ్రీరాగము—అటతాళము.

లీలా—తగునా యిదితనయా—
నీవంటివానికింతపట్టు॥ తగు॥
హరియనుచును మ్రుక్కు మొగమెఱుగనివానిని గొల్చి
కన్నతండ్రి - తోడ - వైర - మూన - నీకు॥ తగు॥
పర్వులకును ప్ర - త్యక్షదైవము
కన్న - తండ్రి - యనుచు - నెన్నకుంట॥ తగు॥

(13) ఫీల్వారాగము—ఏకతాళము.

లీలా—ప్రాణేశా! నీవింత - పంతమూనంగనేల?
పసిబాలుండనియైన - భావింపవేల? ॥ ప్రాణే॥
నీమాటవినకున్న - నిముషమందునవాని
బందెపెట్టుమునాథ - వధియింపమాని। ప్రాణే॥
పుత్రదుఃఖముతోడ - బొగులుచుంటినినాథ
పుత్రభిక్షముపెట్టి - ముదమార ననుగావు॥ ప్రాణేశ॥
ముల్లోకములుగెల్చి - వరలు నీయాజ్ఞ
కెవ్వారు నిల్తురు - యేటికి భయమింక॥ ప్రాణే॥

(14) నిత్యకల్యాణిరాగము—ఏకతాళము.

ప్రహ్లా—దయగనుమా - నీభక్తునియెడ॥ దయ॥
నిత్యకల్యాణమూర్తివైన - యో
నిర్గుణ పరబ్రహ్మమూర్తీ
నీనామమె జపియించితినని
క్రూరహృదయుండై - క్రూరసర్పముల
కెఱజేయుచుండె నిర్దయ॥ దయ॥

(15) హంసధ్వనిరాగము—త్రిపుటతాళము.

లీలా—నా మొఱాలింపవా—
ననుదయగనవా? సుతునిప్రోవలేవా?॥ నా॥
కనికరింపుమనుచు నీ - కాళ్ళంటితిగాదా?
మన్నింపకుంటతగునా? - మనముఱాయిజేయతగనా?

(16) సుకల్యాణిరాగము—ఏకతాళము.

ప్రహ్లా—పతితపావన - భక్తపోషణ
పాహి - పాహి - యని - నీ
పదముల వ్రాలితి- భక్తునిబ్రోవుము॥ పతి॥

చిన్మయరూపా ! స్థిరతభజించెద - చెచ్చెరబ్రోవుము॥ పతి॥
నీనామం బెద దలంచిన ఘోరపాపములు గూలిపోవుగద॥ పతి॥

(17) ఫరజురాగము — ఏకతాళము.

శుక్రు—వలదు దానవేశ్వరా? యీదానమీయవలదు॥ వలదు॥
భూసురుఁ డీతఁడుగాఁడూ - వాసుదేవుడితగాఁడూ
దేవదేవునకు దానమిడ - నీతరమంచెద నెంచితె॥ వల॥
ఆదిపరబ్రహ్మమూర్తి యీ - యవతారంబెత్తెను
నాపల్కులు వినుము యీ దానము మానుము॥
వడుగంచును మది దలఁపకు మితఁడా
యింద్రునిగావఁగ బుట్టిన శ్రీహరిజుమ్మీ వలదు॥

(18) ఖ్యాంఘుట్యాను.

పరశు—పనిచేయునో? వృధపోవునో?
గనుగొందును నిలుము దుర్మతీ॥ పని॥
ఖలుడవగుచు నీవు నిటుల కాఱులఱువలాభమే
ఖలమతి - నిలుమిఁక - గర్వమడచి - గండడంతు॥ ప॥
పరశురాముఁడనిన నీ - భావమందునేమిగా
దలచినావొ - నిలువుమింక - ధైర్యమున్న - దలగబోక॥ పని॥

(19) బేహాగ్ రాగము—ఏకతాళము.

సీత—చంగుచంగుమని పరువిడుచుండెడి యీకు
రంగంబును గనుడీ - గనుడీ - నాథా - గనుడీ॥ చంగు॥
సాకీ—మది,కెంతో ముదముగూర్చెడిన్
వింతవింతరంగుల నొప్పారెన్
చెంతనున్న హృదయానందముగన్
మిత్ర—దయతోడన్ - దానినిబట్టన్ - యత్నముజేయన్
వేడెదమిమ్మున్॥ చంగుచంగు॥

(20) మోహన రాగము—జంపెతాళము.

కావ—ఈజగ - న్మోహనాంగి సొగ
సెంతో రమణీయమై యలరారెగా॥ ఈ॥
అలరారెఁగా - మది - కల - వర పఱచెనుఁ గా॥ ఈ॥
లలనామణి గూడిన - సౌఖ్యం బలవడుగా॥ ఈ॥
సోదరి చెప్పిన - శుభలక్షణములు
మోదమునించెఁ - ముగుదనుగాంచఁ॥ ఈ॥

(21) బిళహరిరాగము—ఏకతాళము.

సీత—తపసివనుచు భ్రమసితిరా । దైత్యాధమ పోపోరా॥
రాముసతిని - నేమటంచు । నీమనమున - నెంచితివో
కాలిలిట్టు లఱచుచున్న । కాలుపోఁలి కేగుదువిక॥ తప॥

(22) ఫరజురాగము— ఏకతాళము.

యశో— ఈ. బాలుని - మాహాత్మ్య మెఱుగంగ
వశమౌనె - నెవ్వారికైన । ఈ॥
సర్వలోకంబు లీ - బాలుని వక్త్రములో
గాన్పించుచుండె - నద్భుతమదియేమో॥ ఈ॥
కొడుకంచు నేనెంతో - మఱిమఱి మురిసితిగానీ
యాదిమధ్యాంతరహితుఁడని యెంచనైతి॥ నీబా॥

(23) శంకరాభరణరాగము—ఏకతాళము.

బ్రహ్మ—తప్పుక్షమియింపుమయ్య। దేవకినందనా మాదు॥ తప్పు॥
నీమహాత్మ్య మెఱుగక - నేరక జేసినట్టి॥ తప్పు॥
పరిపరివిధముల నీ - పదములనేబట్టి
స్థిరమతినిఁ వేడుకొందు - చెచ్చెఱ నను బ్రోవుమయ్య॥ తప్పు॥
నిన్నెఱుఁగతరమే - నీమాయ తెలియ తరమే
నిఖిలలోకధన్య - నిన్నెన్న నాదుతరమా॥ తప్పు॥

(24) కల్యాణిరాగము—ఏకతాళము.

ఇరువురు—జోహార్ జోహార్ జోహార్

జోహార్ యశోదనందనా! జోహార్ ॥

మహాత్మ నీపదంబులెప్డు - మమతతోడఁగొల్తుము

కృపామయుండమా - పతిని మాకువీడుమా॥ జోహా

యెల్లవేళలందునన్ - నుల్లమలర మిమ్మునే

కల్లగాదు గొల్తుమయ్య - కావుమయ్య ప్రేముడిన్॥ జో॥

(25) హంసధ్వనిరాగము— ఏకతాళము

బ్రహ్మ—మామనోహరా - మమ్ముబ్రోవుమన్న

మన్నింపవేల?॥ మా॥

నిఖిలలోకరూపా - నిర్మలాత్మస్వరూపా

నీదయారసముజూపి - యాదరమున మా

బాధలుపోవగ త్రిప్పు - రాసురు బరిమార్పుము॥ మా॥

(26) కల్యాణిరాగము— ఏకతాళము.

మునులు— 9 వ అనుబంధమే పాడవలయును.